www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పోలవరం గడువు.. తరచూ మార్చితే ఎలా?



పీపీఏ సీఈవో అభ్యంతరం.. 2026 మార్చికే ఈసీఆర్‌ఎఫ్ పూర్తి చేస్తామన్నారుగా!

ఇప్పుడేమో 2027 చివరికని అంటున్నారు.. వచ్చే జనవరి 2న డయాఫ్రం వాల్ మొదలుపెట్టాల్సిందే

ప్రత్యేక ఖాతా నుంచే లావాదేవీలు చేయాలి.. 75% ఖర్చుపెడితేనే తదుపరి వాయిదా విడుదల

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్

4

శనివారం | 7-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 232 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 11.06 తదుపరి సప్తమి; నక్షత్రం: ధనిష్ఠ సా. 4.50 తదుపరి శతభిషం, వర్జ్యం: రా. 11.47-1.20, దుర్ముహూర్తం: ఉ. 6.36-8.04; అమృతఘడియలు: ఉ. 6.38-8.12; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 5.36

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఈ క్యాలెండర్ ఏడాదిలో 50 టెస్టు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా బుమ్రా.

1

టెస్టుల్లో మొదటి బంతికే ఎక్కువసార్లు (3) వికెట్ తీసిన బౌలర్‌గా పెడ్రో కాలిన్స్‌తో సమంగా నిలిచిన స్టార్క్.

కెరీర్‌లో ఉత్తమ గణాంకాలు (6/48) నమోదు చేసిన స్టార్క్‌కు భారత్‌పై 5+ వికెట్లు తీయడం ఇదే తొలిసారి. అలాగే గులాబీ టెస్టుల్లో అత్యధికంగా నాలుగుసార్లు ఈ ఫీట్ సాధించిన బౌలర్‌గా నిలిచాడు.

భారత్ మొదటి ఇన్నింగ్స్ 180 ఆలౌట్

తొలి రోజు.. తేలిపోయారు!

- ఆకట్టుకున్న నితీశ్
- స్టార్క్‌కు ఆరు వికెట్లు
- ఆస్ట్రేలియా 86/1
- పింక్‌బాల్ టెస్టు



స్టార్క్ (6/48)

అడిలైడ్: గులాబీ టెస్టును టీమిండియా పేలవంగా ఆరంభించింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/48) స్వింగ్ బౌలింగ్ ధాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ కనీసం 200 పరుగులు కూడా చేయలేకపోయింది. కనీసం బౌలర్లయినా ప్రత్యర్థిని ఇబ్బందిపెడతారనుకుంటే.. వారూ తేలిపోయారు. ఫలితంగా మొదటి రోజు అన్ని విభాగాల్లోనూ ఆతిథ్య ఆస్ట్రేలియానే ఆధిపత్యం చూపింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే కుప్పకూలింది. చివర్లో నితీశ్ కుమార్ (42) మెరుపు బ్యాటింగ్ కారణంగా ఆ మాత్రం స్కోరైనా నమోదయ్యింది. భారత్ ఇన్నింగ్స్‌లో నితీశ్‌దే టాప్ స్కోర్ కావడం విశేషం. రాహుల్ (37), గిల్ (31) ఫర్వాలేదనిపించారు. పేసర్లు కమిన్స్, బోలాండ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. క్రీజులో ఓపెనర్ మెక్‌స్వీనే (38 బ్యాటింగ్), లబుషేన్ (20 బ్యాటింగ్) ఉన్నారు. ఏకైక వికెట్ బుమ్రాకు దక్కింది. శనివారం తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా వికెట్లు తీయగలిగితేనే ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంటుంది.

తొలి బంతికే వికెట్: టాస్ గెలిచిన భారత్ వెంటనే బ్యాటింగ్ ఎంచుకుంది. వాస్తవానికి పింక్ బాల్ టెస్టులో తొలి రెండు రోజులు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. కానీ భారత బ్యాటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. అటు ఆసీస్ పేసర్లు మాత్రం కొత్త బంతితో చెలరేగారు. ముఖ్యంగా గులాబీ టెస్టంటే రెచ్చిపోయే స్టార్క్ ఈసారి కూడా బెదరగొట్టాడు. బంతిని ఇరువైపులా స్వింగ్ చేస్తూ అతడు సాగించిన విధ్వంసానికి భారత బ్యాటర్లు చకచకా పెవిలియన్ బాట పట్టారు. మ్యాచ్ తొలి బంతికే జైస్వాల్‌ను గోల్డెన్ డకౌట్ చేశాడు. ఆ తర్వాత బరిలోకి దిగిన గిల్ అదే ఓవర్‌లో రెండు ఫోర్లతో జట్టు పరుగుల ఖాతాను తెరిచాడు. అటు మరో ఓపెనర్ రాహుల్ ఓపిగ్గా క్రీజులో నిలిచే ప్రయత్నం చేశాడు. అయితే అతను బోలాండ్ ఓవర్‌లో డకౌట్ అయినప్పటికీ నోబ్ వేయడంతో బతికిపోయాడు. అదే ఓవర్‌లో అతను ఖవాజాకు క్యాచ్ ఇచ్చినా పట్టలేకపోయాడు. తానెదుర్కొన్న 20వ బంతికి రాహుల్ తొలి పరుగు సాధించాడు. కమిన్స్ ఓవర్‌లో అతను రెండు వరుస ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. గిల్ కూడా నిలకడను కనబర్చడంతో ఇద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కానీ టీ విరామానికి నాలుగు ఓవర్ల ముందు భారత్ తడబడింది. స్టార్క్ విజృంభించి వరుస ఓవర్లలో రాహుల్, విరాట్ కోహ్లీ (7) వికెట్లు తీయగా.. గిల్‌ను బోలాండ్ అవుట్ చేయడంతో జట్టు 69/1 నుంచి 81/4కి చేరింది. రెండో సెషన్‌లోనూ కథ మారలేదు. ఆరోనెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ (3)ను ఆరంభంలోనే బోలాండ్ ఎల్బీగా అవుట్ చేశాడు. పంత్ (21) కూడా ఎక్కువసేపు నిలవలేదు.

నితీశ్ మరోసారి..: తొలి టెస్టు మాదిరే ఆంధ్ర క్రికెటర్ నితీశ్ మరోసారి ఆకట్టుకున్నాడు. అటు అశ్విన్ (22) బంతికో పరుగు చొప్పున సాధిస్తూ అతడిపై ఒత్తిడి తగ్గించాడు. ఈ దశలో స్టార్క్ మళ్లీ దెబ్బతీస్తూ 39వ ఓవర్‌లో ఇన్‌స్వింగ్ యార్కర్లతో అశ్విన్, హర్షిత్ (0) వికెట్లు తీశాడు. అప్పటికే 8 వికెట్లు కోల్పోవడంతో బుమ్రా (0)ను అండగా చేసుకుని నితీశ్ ఎదురుదాడికి దిగాడు. స్టార్క్ ఓవర్‌లో సిక్సర్ బాదిన తను.. మరుసటి ఓవర్‌లో 6,4,6తో బోలాండ్‌కు షాకిచ్చాడు. ఈ ఓవర్‌లో స్లిప్ వైపు రివర్స్ స్కూప్‌లో సాధించిన సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. కాసేపటికే వరుస ఓవర్లలో ఈ జోడీ వెనుదిరిగారు.

బ్యాటింగ్‌లోనూ జోరు: సహజంగానైతే డే/నైట్ టెస్టు మూడో సెషన్‌లో పేసర్లు పండగ చేసుకుంటారు. కానీ ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ ఆసీస్ బ్యాటర్లను భారత బౌలర్లు ఇబ్బందిపెట్టలేకపోయారు. ఈ సెషన్ మొత్తంలో తీసింది ఒక్క వికెటే కావడం గమనార్హం. బుమ్రా ఖవాజా (13)ను అవుట్ చేశాడు. కెరీర్‌లో రెండో టెస్టు ఆడుతున్న ఓపెనర్ మెక్‌స్వీనే పట్టుదలగా క్రీజులో నిలిచాడు. అటు లబుషేన్ తన సహజశైలితో భారత బౌలర్లను విసిగించాడు. పిచ్ స్పిన్‌కు సహకరించకపోవడంతో అశ్విన్ కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు.



నితీశ్ (42)

టెస్టుల్లో తొలి బంతికే అవుటైన ఏడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. 1974లో గవాస్కర్ తొలిసారి ఇలా డకౌటయ్యాడు. **7**

మొరాయించిన ఫ్లడ్‌లైట్లు

ఈ మ్యాచ్‌లో ఫ్లడ్‌లైట్ల కారణంగా ఒకే ఓవర్లో రెండుసార్లు ఆటకు అంతరాయం ఏర్పడింది. ఆసీస్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో మూడో బంతికి, ఐదో బంతికి ముందు ఇలా లైట్లు ఆఫ్ కావడంతో పేసర్ హర్షిత్ రాణా అసహనంగా కనిపించాడు. అయితే అటు ప్రేక్షకులు మాత్రం సరదాగా తమ మొబైల్ ఫోన్లలో టార్చిలైట్స్‌ను ఆన్ చేయడం కనిపించింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) స్టార్క్ 0; రాహుల్ (సి) మెక్‌స్వీనే (బి) స్టార్క్ 37; గిల్ (ఎల్బీ) బోలాండ్ 31; విరాట్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 7; పంత్ (సి) లబుషేన్ (బి) కమిన్స్ 21; రోహిత్ (ఎల్బీ) బోలాండ్ 3; నితీశ్ (సి) హెడ్ (బి) స్టార్క్ 42; అశ్విన్ (ఎల్బీ) స్టార్క్ 22; హర్షిత్ (బి) స్టార్క్ 0; బుమ్రా (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 44.1 ఓవర్లలో 180 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-69, 3-77, 4-81, 5-87, 6-109, 7-141, 8-141, 9-176, 10-180; **బౌలింగ్:** స్టార్క్ 14.1-2-48-6; కమిన్స్ 12-4-41-2; బోలాండ్ 13-0-54-2; లియాన్ 1-0-6-0; మార్ష్ 4-0-26-0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనే (బ్యాటింగ్) 38; లబుషేన్ (బ్యాటింగ్) 20; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 33 ఓవర్లలో 86/1; వికెట్ పతనం:** 1-24; **బౌలింగ్:** బుమ్రా 11-4-13-1; సిరాజ్ 10-3-29-0; రాణా 8-2-18-0; నితీశ్ 3-1-12-0; అశ్విన్ 1-1-0-0.

నల్ల బ్యాడ్జీలతో బరిలోకి..

గులాబీ టెస్టులో ఆసీస్ ఆటగాళ్లు తమ భుజాలకు నల్ల బ్యాడ్జీలను ధరించి బరిలోకి దిగారు. ఈనెల ఒకటిన మృతి చెందిన మాజీ ఆటగాడు ఇయాన్ రెడ్‌పాత్‌కు సంతాపాన్ని తెలియజేయడంతో పాటు క్రికెటర్ ఫిల్ హ్యూజ్ మరణించి పదేళ్లయిన సందర్భంగా అతడికి ఈ విధంగా నివాళులర్పించారు.



'వైభవ'ంగా ఫైనల్‌కు

- సెమీస్‌లో లంకపై భారత్ గెలుపు
- రేపు బంగ్లాతో తుదిపోరు
- అండర్-19 ఆసియా కప్



వైభవ్ (36 బంతుల్లో 67)

షార్జా: ఐపీఎల్‌కు ఎంపికైన పిన్న వయసు క్రికెటర్‌గా రికార్డుకెక్కిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ లీగ్‌కు ముందే మేజర్ టోర్నమెంట్‌లో సత్తా చాటుతున్నాడు. అండర్-19 ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరచి జట్టును ఫైనల్ చేర్చాడు. వైభవ్ (36 బంతుల్లో 5 సిక్సర్లు, 6 ఫోర్లతో 67) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను ఏడు వికెట్లతో చిత్తు చేసింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక.. భారత బౌలర్లు చేతన్ శర్మ (3/34), కిరణ్ చోర్మాలె (2/32), ఆయుష్ మాత్రే (2/37) ధాటికి 46.2 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. ఇక.. ఛేదనలో వైభవ్ దూకుడుగా ఆడడంతో భారత్ 21.4 ఓవర్లలోనే 175/3 స్కోరు చేసి గెలిచింది. 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్.. మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (28)తో కలిసి తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును గెలుపుతీరాలకు చేర్చాడు. వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అది వారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీఫైనల్లో బంగ్లా ఏడు వికెట్లతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పాక్ 37 ఓవర్లలో 116 పరుగులకే పరిమితమైంది. బంగ్లా బౌలర్ ఇక్బాల్ (4/24) పాక్ బ్యాటర్ల భరతం పట్టాడు. స్వల్ప లక్ష్యాన్ని బంగ్లా 22.1 ఓవర్లలో 120/3 స్కోరుతో ఛేదించింది. బంగ్లా సారథి అజీజుల్ (61 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో అదరగొట్టాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సుమిత్



మెల్‌బోర్న్: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగాల్ వచ్చే ఏడాదిలో తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. నిరుడు క్వాలిఫయింగ్ రౌండ్లు ఆడిన సుమిత్.. ఈసారి మాత్రం నేరుగా చోటు దక్కించుకున్నాడు. వచ్చే జనవరి 12 నుంచి 26 వరకు జరిగే ఈ గ్రాండ్‌స్లామ్‌లో తలపడే క్రీడాకారుల జాబితాను టెన్నిస్ ఆస్ట్రేలియా శుక్రవారం ప్రకటించింది. పురుషులు, మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాలో ఆడేందుకు ఆటగాళ్ల కటాఫ్ ర్యాంక్ 98. దీంతో ప్రస్తుతం సింగిల్స్‌లో 98వ ర్యాంక్‌లోనున్న సుమిత్.. ప్రధాన రౌండ్‌కు అర్హత సాధించాడు. ఇక.. పురుషులు, మహిళల డిఫెండింగ్ చాంపియన్లుగా టాప్‌సీడ్లు సినర్, సబలెంకా బరిలోకి దిగనున్నారు.

పారా క్రీడల్లో తెలుగోళ్లకు 7 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ ఎబిలిటీ పారా యూత్ గేమ్స్‌లో తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు ఏడు పతకాలు కైవసం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ ఐదు స్వర్ణాలు సహా మొత్తం 16 పతకాలు నెగ్గగా, అందులో తెలుగోళ్లు ఏడు సాధించడం విశేషం. తెలంగాణ అథ్లెట్ దేవేంద్ర అండర్-17 షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రెండు పసిడి, 100 మీటర్ల స్ప్రింట్‌లో రజతం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివాని అండర్-20 షాట్‌పుట్‌లో స్వర్ణం నెగ్గారు. ఇక అండర్-17 కేటగిరీ హైజంప్‌లో లోకేష్ స్వర్ణం, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలలో సతీష్ రజతాలు సాధించారు.

శ్రీలంక 243/3

గెబెహ: దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో శ్రీలంక దీటుగా బదులిస్తోంది. రెండో రోజైన శుక్రవారం ఆట ముగిసేసరికి లంక 3 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 269/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 358 రన్స్‌కు ఆలౌటైంది. వెరిన్నే (105) అజేయ శతకంతో సత్తా చాటాడు.

బ్రూక్ సెంచరీ

● ఇంగ్లండ్ 280 ● కివీస్ 86/5



వెల్లింగ్టన్: హ్యారీ బ్రూక్ (123) సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో తొలిరోజు ఇంగ్లండ్ పైచేయి సాధించింది. శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. బ్రూక్ శతకానికి తోడు ఓలీ పోప్ (66) అర్ధ సెంచరీతో రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులకు ఆలౌటైంది. నాథన్ స్మిత్ (4/86) నాలుగు, విల్ ఓరూర్కీ (3/49) మూడు, హెన్రీ (2/43) రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆతిథ్య కివీస్ బ్యాటర్లను పర్యాటక జట్టు బౌలర్లు కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ఫలితంగా మొదటిరోజు ఆట ముగిసేసరికి కివీస్ ఐదు వికెట్లు కోల్పోయి 86 పరుగులే చేయగలిగింది. ఓపెనర్లు లాథమ్ (17), కాన్వే (11) తక్కువ స్కోర్లకే వెనుదిరగగా.. కేన్ విలియమ్సన్ (37) ఫర్వాలేదనిపించాడు. విల్ ఓరూర్కీ (0), బ్లండెల్ (7) క్రీజులో ఉన్నారు.

బిజినెస్

బ్యాంకులకు సీఆర్ఆర్ బూస్ట్

4.5% నుంచి 4 శాతానికి తగ్గిన నగదు నిల్వల నిష్పత్తి

- బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల నిధులు
- 6.5% రెపో రేటు మాత్రం యథాతథం
- రుణగ్రహీతలకు మళ్లీ నిరాశే
- జీడీపీ వృద్ధి అంచనా 6.6%కి కుదింపు
- ద్రవ్యోల్బణం అంచనా 4.8%కి పెంపు
- ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 5-7 తేదీల్లో తదుపరి ద్రవ్యపరపతి విధాన సమీక్ష



ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో రుణగ్రహీతలకు ఎలాంటి ఊరట లభించకపోయినప్పటికీ.. ద్రవ్య కొరతతో సతమతం అవుతున్న బ్యాంకులకు మాత్రం ఉపశమనం కల్పించింది. ధరల పోటుకు భయపడి రుణాలకు ప్రామాణికమైన రెపో రేటును ఆర్‌బీఐ వరుసగా 11వ సారి యథాతథంగా కొనసాగించింది. పరపతి విధానంపై తటస్థ వైఖరినీ అలాగే కొనసాగించింది. తాజా నిర్ణయంతో రెపో మరికొంతకాలం 6.5 శాతంగానే ఉండనుంది.

ఒత్తిడిలో బ్యాంకులు

రుణాలపై వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పటికీ మార్కెట్లో రుణాలకు డిమాండ్ మాత్రం బాగానే ఉంది. కానీ, డిమాండ్‌కు తగ్గ స్థాయిలో రుణాలిచ్చేందుకు అవసరమైన నిధుల్లేక బ్యాంకులు ఒత్తిడినెదుర్కొంటున్నాయి. ఇందుకు పరిష్కారంగా ఆర్‌బీఐ తాజా సమీక్షలో బ్యాంక్‌ల నగదు నిల్వ నిష్పత్తి (సీఆర్ఆర్)ని అర శాతం తగ్గించింది. దాంతో సీఆర్ఆర్ 4.5 శాతం నుంచి 4 శాతానికి దిగిరానుంది. తత్ఫలితంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయి. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దాదాపు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి నెమ్మదించిన జీడీపీ వృద్ధికి ఊతమిచ్చేలా బ్యాంక్‌లు మరింత విస్తృతంగా రుణాలిచ్చేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి. బ్యాంకులు సేకరించిన డిపాజిట్లలో తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేయాల్సిన నిష్పత్తినే సీఆర్ఆర్ అంటారు.

వృద్ధి డౌన్.. ధరలు అప్

దేశంలో వృద్ధి మందగించింది. ధరలు దిగిరానంటున్నాయి. దాంతో ఆర్‌బీఐ గత అంచనాలను సవరించింది. ఈ ఆర్థిక సంవత్సరాని (2024-25)కి ఆర్‌బీఐ జీడీపీ వృద్ధి అంచనాను 7.2 శాతం నుంచి 6.6 శాతానికి కుదించింది. అలాగే, ద్రవ్యోల్బణం అంచనాను 4.5 శాతం నుంచి 4.8 శాతానికి పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. ఈ ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో వృద్ధి నిరాశపరిచినప్పటికీ, ద్వితీయార్ధంలో మళ్లీ పుంజుకోనుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పలు స్థూల ఆర్థిక గణాంకాలు ఇదే సంకేతాలిస్తున్నాయన్నారు. ద్రవ్యోల్బణం విషయానికొస్తే, గరిష్ఠ స్థాయి ఆహార ధరల కారణంగా డిసెంబరుతో ముగియనున్న త్రైమాసికంలోనూ సూచీ నియంత్రణ లక్ష్యానికి ఎగువనే ఉండనుందన్నారు.

ఎఫ్‌సీఎన్ఆర్ డిపాజిట్ రేట్ల పరిమితి పెంపు: ప్రవాస భారతీయుల నుంచి మరిన్ని నిధులు ఆకర్షించేందుకు ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్) బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల పరిమితి పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. రూపాయి క్షీణతకు అడ్డుకట్ట వేయడంతో పాటు విదేశీ మారకం నిల్వల్లో ఒడుదుడుకులను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది.

తనఖా రహిత పంట రుణ పరిమితి రూ.2 లక్షలకు పెంపు

వ్యవసాయ వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకిచ్చే తనఖా రహిత పంట రుణ గరిష్ఠ పరిమితిని ప్రస్తుతమున్న రూ.1.6 లక్షల స్థాయి నుంచి రూ.2 లక్షలకు పెంచాలని నిర్ణయించింది. దీని అమలుకు సంబంధించి త్వరలోనే బ్యాంకులకు సర్క్యులర్ జారీ చేయనున్నట్లు తెలిపింది. తనఖా రహిత పంట రుణ పరిమితిని 2010లో రూ.లక్షకు, 2019లో రూ.1.6 లక్షలకు పెంచారు.

డీ-డాలరైజేషన్ ఆలోచన లేదు..

అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించే ఉద్దేశంతో ఆ కరెన్సీ ద్వారా చెల్లింపులను తగ్గించే (డీ-డాలరైజేషన్) ఆలోచనలేవని.. ప్రస్తుతానికి వాణిజ్య ముప్పును తగ్గించుకోవడంపైనే దృష్టిసారించామని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ స్పష్టం చేశారు. సరిహద్దు వాణిజ్యంలో డాలర్‌ను పూర్తిగా పక్కన బెడితే గనుక బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సభ్య దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికాకు కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఈ మధ్యనే హెచ్చరించిన సంగతి తెలిసిందే.

డిజిటల్ ఆర్థిక మోసాలకు చెక్!

నకిలీ ఖాతాల ఏరివేతకు మ్యూల్‌హంటర్.ఏఐ అభివృద్ధి

డిజిటల్ ఆర్థిక మోసాలను గుర్తించి, వాటిని నిరోధించేందుకు 'మ్యూల్‌హంటర్.ఏఐ' పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాన్ని అభివృద్ధి చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. బెంగళూరులోని రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) దీన్ని అభివృద్ధి చేసింది. ఆర్థిక మోసాలు, మనీలాండరింగ్‌కు పాల్పడేందుకు అనుమానం రాకుండా ఇతరుల పేరిట తెరిచిన నకిలీ ఖాతాలను ఏరివేసేందుకు మ్యూల్‌హంటర్.ఏఐలో భాగస్వామ్యం కావాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. సాధారణంగా ఈ తరహా నేరాలకు పాల్పడేవారు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఇతరులకు సులభ ధనార్జన ఆశజూపి లేదా బలవంతంగా వారి పేరిట ఖాతాలు తెరుస్తారు. అక్రమ సొమ్మును ఈ అకౌంట్ల ద్వారా ఇతర అకౌంట్లకు మళ్లిస్తుంటారు. కాబట్టి, ఈ ఖాతాలను గుర్తించి, సొమ్ము రికవరీ చేయడం కష్టమే. ఆర్థిక సేవల రంగంలో డిజిటల్ మోసాలను అరికట్టేందుకు బ్యాంక్‌లతో కలిసి ఆర్‌బీఐ ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. తాజాగా అభివృద్ధి చేసిన మ్యూల్‌హంటర్.ఏఐలోనూ బ్యాంకులు భాగస్వామ్యం కావాలని కోరారు. జీరో ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ థీమ్‌తో ఆర్‌బీఐ ప్రస్తుతం హ్యాకథాన్‌ను నిర్వహిస్తోందని, నకిలీ ఖాతాల సమస్య అరికట్టేందుకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంక్‌లు, ఆర్థిక సేవల సంస్థలు ఆర్‌బీఐ అభివృద్ధి చేసిన మ్యూల్‌హంటర్.ఏఐతో పాటు ఇతర కృత్రిమ మేధ సాధనాలను వినియోగించుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ సైతం కోరింది.

కొత్త ఏడాదిలో కార్ల ధరలకు రెక్కలు

- ఇప్పటికే 3% మేర పెంచిన పలు కంపెనీలు
- తాజాగా అదే బాటలో మారుతి, మహీంద్రా
- జనవరి 1 నుంచి అమల్లోకి
- ఉత్పత్తి వ్యయాలు పెరగటమే కారణం

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో కార్ల ధరలు చుక్కలు చూపించనున్నాయి. నిర్వహణాపరమైన వ్యయాలతో పాటు ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరిగిపోవటంతో ఇప్పటికే హ్యూండయ్, మెర్సిడెస్ బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ కార్ల ధరలు జనవరి 1 నుంచి 3 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించాయి. తాజాగా శుక్రవారం దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ధరలు పెంచుతున్నట్లు వెల్లడించాయి. మారుతి సుజుకీ తన అన్ని మోడళ్ల ధరలు 4 శాతం వరకు పెంచినట్లు ప్రకటించింది. పెంచిన ధరలు కొత్త ఏడాది నుంచి అమల్లోకి వస్తాయని ఎంఎస్ఐ తెలిపింది. మోడల్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది. మరోవైపు ఎం అండ్ ఎం కూడా తన ఎస్‌యూవీ మోడళ్లు, వాణిజ్య వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ కూడా తన ఉత్పత్తుల ధరలను 3 శాతం మేరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు, కమోడిటీ ధరలతో పాటు నిర్వహణ వ్యయాలు పెరిగిపోవటంతో ఆ భారాన్ని కొనుగోలుదారులపై వేయాల్సి వస్తోందని మారుతి, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తెలిపాయి. కాగా ఈ నెల 5న హ్యూండయ్ మోటార్ తన కార్ల ధరలను రూ.25,000 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

సూచీలకు స్వల్పంగా నష్టాలు

ముంబై: ఈక్విటీ మార్కెట్‌లో ఐదు రోజుల ర్యాలీకి ఆర్‌బీఐ పాలసీతో బ్రేక్ పడింది. రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించడంతో పాటు వృద్ధి అంచనాను కుదించడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. తీవ్ర ఆటుపోట్ల మధ్యన ఊగిసలాడిన సెన్సెక్స్ చివరికి 56.74 పాయింట్ల నష్టంతో 81,709.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.60 పాయింట్లు నష్టపోయి 24,677.80 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,906.33 పాయింట్లు, నిఫ్టీ 546.7 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా ఐదు రోజుల ర్యాలీ కారణంగా మార్కెట్లో ఏర్పడిన ఈ విరామం ఆరోగ్యవంతమైనదేనని విశ్లేషకులంటున్నారు. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.60 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.36 శాతం లాభపడ్డాయి.

సురక్షకు నష్టాల స్వాగతం: సురక్షా డయాగ్నోస్టిక్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర రూ.441తో పోల్చితే 5.22 శాతం నష్టంతో రూ.417.95 వద్ద ముగిసింది. శుక్రవారం 0.90 శాతం నష్టంతో రూ.437 వద్ద లిస్టింగ్ అయిన ఈ షేరు ఇంట్రాడేలో 5.94 శాతం నష్టంతో కనిష్ఠ స్థాయి రూ.414.80ని తాకింది. ఎన్ఎస్ఈలో కూడా ఆ షేరు 5.43 శాతం నష్టంతో రూ.417.05 వద్ద ముగిసింది.

ఇన్వెస్టర్ నియమావళిని సవరించిన సెబీ

ఇన్వెస్టర్ భద్రతను పెంచడంతో పాటు మార్కెట్లో పారదర్శకత తేవడం, ఇన్వెస్టర్లలో విశ్వాసం కల్పించడం లక్ష్యంగా సెబీ సవరించిన ఇన్వెస్టర్ నియమావళిని విడుదల చేసింది. ఇన్వెస్టర్ సమాచార గోప్యతకు హామీ ఇవ్వడం, న్యాయబద్ధమైన/హేతుబద్ధమైన నిబంధనావళి సహాయంతో మార్కెట్ నుంచి వెలుపలికి వచ్చేందుకు భరోసా కల్పించడం ఈ నియమావళి సవరణ లక్ష్యం. దీనికి తోడు స్కోర్స్ 2.0, స్మార్ట్ ఆన్‌లైన్ సహాయంతో వివాద పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేసింది.

గోల్డ్ బులియన్ హాల్ మార్కింగ్ తప్పనిసరి

న్యూఢిల్లీ: బంగారానికి హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం ఇప్పుడు గోల్డ్ బులియన్ హాల్‌మార్కింగ్ దిశగా అడుగులేస్తోంది. సీఐఐ వజ్రాభరణాల సదస్సులో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే మాట్లాడుతూ.. నాణ్యమైన ఉత్పత్తులు అందించడం ద్వారా వినియోగదారుల ప్రయోజనాలు కాపాడడం అవసరమన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే గోల్డ్ బులియన్ హాల్‌మార్కింగ్‌కు కూడా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వాస్తవానికి తాము దిగుమతి చేసుకుంటున్న బంగారం నాణ్యమైనదే అనే విషయం ఆభరణాల వర్తకులకే తెలియదని, అందుకే మొత్తం వ్యవస్థను సరిదిద్దాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

11న సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓ

ఇష్యూ ధర రూ.522-549

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాయి లైఫ్ సైన్సెస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 11న ప్రారంభం కానుంది. 13న ఇష్యూ ముగియనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.522-రూ.549గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.3,042.62 కోట్లు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా రూ.950 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్ షేర్ హోల్డర్స్, ఇతర వాటాదారులు 3.81 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్ సంస్థ సాయి క్వెస్ట్ సిన్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు టీపీజీ ఆసియా 7 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాతో పాటు ఇతర వాటాదారులు తమ వాటాలను విక్రయించనున్నారు.

విశాల్ మెగామార్ట్, మొబిక్విక్ కూడా: విశాల్ మెగామార్ట్, మొబిక్విక్ పబ్లిక్ ఇష్యూలు కూడా ఈ నెల 11నే ప్రారంభం కానున్నాయి. విశాల్ మెగామార్ట్ ఒక్కో షేరు ధరను రూ.74-78గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.8,000 కోట్లు సమీకరించనుంది. కాగా మొబిక్విక్ ఒక్కో షేరు ధరను రూ.265-279గా నిర్ణయించింది.

ఐపీఓకి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా: దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ అనుబంధ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించనుంది. ఇష్యూలో భాగంగా మాతృసంస్థ 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఈ ఇష్యూ పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉండనుంది.




బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▼	71,150 ▼	1,01,000 ▼
ముంబై	76,187 ▼	69,787 ▼	90,820 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ



హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	94
వరంగల్	80	గుంటూరు	94
కరీంనగర్	80	ఒంగోలు	94
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	82
కర్నూలు	80	నెల్లూరు	82
విశాఖపట్నం	90	అనంతపురం	82
గోదావరి	94		

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



తిరుచానూరులోని పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం పంచమీతీర్థం భక్తజనసందోహం నడుమ వైభవంగా జరిగింది. చక్రస్నానం వేళ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసేందుకు దాదాపు లక్ష మంది హాజరయ్యారు. శుక్రవారం ఉదయం తిరుమల నుంచి శ్రీవారు పంపిన ముత్తైదువు సారెతో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జీయర్‌స్వాముల సమక్షంలో తిరుమంజనం నిర్వహించారు.

శనివారం | 7-12-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



నాలెడ్జ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

దాని కేంద్రం విశాఖే: చంద్రబాబు

రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు

స్టార్టప్స్‌కు అనుగుణంగా పాలసీలు

వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ముందుకు

డీప్ టెక్నాలజీ సదస్సులో సీఎం వెల్లడి

11



మళ్లీ రైతాంగం భగ్గు

శంభు నుంచి ఢిల్లీకి 101 మంది రైతుల పాదయాత్ర

బారికేడ్లు పెట్టి ఆపేసిన పోలీసులు

వాటిని తొలగించి ముందుకు సాగేందుకు అన్నదాతల యత్నం


6

అడ్డుకున్న పోలీసులు.. బాష్పవాయువు ప్రయోగం.. ఆరుగురు రైతులకు గాయాలు

బ్రదర్స్ బొక్కేశారు!

ఖండాలు విస్తరించిన ద్వారంపూడి దందా

సోదరుడు వీరభద్రారెడ్డి, అనుచరుడు అగర్వాలే కీలకం



చంద్రశేఖరరెడ్డి



వీరభద్రారెడ్డి

రాష్ట్రంలో ఎక్కడ అక్రమ బియ్యం పట్టుబడినా మూలాలు కాకినాడలోనే! ఆ మూలాలు సరాసరి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోదరుడు వీరభద్రారెడ్డి, అనుచరుడు వినోద్ అగర్వాల్ దగ్గరకే వెళ్లి ఆగుతున్నాయి. అంతలా వీరిద్దరూ కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని రూ.వేలకోట్ల విలువైన పేదల బియ్యాన్ని బొక్కేశారు. వైసీపీ పాలనలో అధికారులను మేపి.. రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్ల బొడిచేశారు. ప్రభుత్వ ఖజానాను పిండేశారు. జగన్ జమానాలో కాకినాడ పోర్టుపైనా, రేషన్ బియ్యంపైనా పెత్తనం వీరిదే. ఏకంగా రూ.4,995కోట్ల విలువైన 13.41లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం వీరిద్దరే విదేశాలకు విక్రయించేశారు. అందులో సగానికి పైగా రేషన్ బియ్యమే అని అంచనా!

ఐదేళ్లలో రూ.4,995కోట్ల విలువైన 13.41లక్షల టన్నుల బియ్యం తరలింపు

అందులో సగానికిపైగా రేషన్ బియ్యమే

రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్ల బొడిచారు

ఎక్కడెక్కడి అక్రమ బియ్యమూ కాకినాడకే..

తెలంగాణ నుంచీ ఇక్కడకు పేదల బియ్యం

ఈ ఏడాది జూన్, జూలైల్లో బియ్యం అక్రమ తరలింపుపై కాకినాడ, చుట్టుపక్కల 13 కేసులు

85 కోట్ల విలువైన 22,947 టన్నులు పట్టివేత

బియ్యం స్మగ్లింగ్ మాఫియా పని పట్టనున్న 'సిట్'

రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటున్నాయి? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడినుంచి తరలిస్తున్నారు? ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోతున్నాయి? ఇవి కేవలం ప్రశ్నలు కాదు.. సర్కారుకు పెను సవాళ్లు! ఈ సవాళ్లకు 'సిట్' సమాధానం ఇవ్వనుంది!



పోర్టులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యం మాఫియాపై ఉచ్చు బిగుస్తోంది. పేదలకు పంచే బియ్యాన్ని కారుచౌక ధరకు కొట్టేసి, ఆనక పాలిష్ చేసి, విదేశాలకు తరలించి వేలకోట్లు కొట్టేసిన స్మగ్లింగ్ ముఠాల ఆట కట్టించడానికి ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. బియ్యం అక్రమార్కుల దందాపై లోతైన దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో కాకినాడ, చుట్టుపక్కల రేషన్‌బియ్యం

మిగతా 11వ పేజీలో...

రేషన్ లూటీపై సిట్



బ్రిజ్‌లాల్

సీఐడీ ఐజీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ఏర్పాటు

ఇందులో సీఐడీ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు

కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులపై నమోదైన కేసుల విచారణ

స్మగ్లింగ్ సూత్రధారుల గుట్టు తేల్చేందుకు సిట్‌కు ప్రత్యేక అధికారాలు అప్పగింత

తనిఖీలు, ఆస్తుల జప్తు, అరెస్టుకు వీలు

దర్యాప్తు పురోగతిపై 15 రోజులకో నివేదిక

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

11



రేపల్లె మండలం పేటేరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

రెవెన్యూ సదస్సులకు పోటెత్తిన భూ బాధితులు

536 మండలాల్లో సదస్సులు ప్రారంభం

పాల్గొన్న రెవెన్యూ మంత్రి, స్పెషల్ సీఎస్, సీసీఎల్ఏ

తొలిరోజే ప్రభుత్వానికి 11,857 వినతులు

ఎన్నికల కోడ్‌తో ఆరు జిల్లాలు దూరం

ప్రతి అర్జీకి ఓ నంబర్ కేటాయింపు

ఆర్టీజీఎస్ ద్వారా సీఎం పరిశీలించే అవకాశం

ప్రభుత్వం దృష్టికి పలు రీసర్వే సమస్యలు

అన్ని సమస్యలూ పరిష్కరిస్తామన్న ప్రభుత్వం

12

నేడు మెగా పీటీఎం

రాష్ట్రవ్యాప్తంగా 44,303 పాఠశాలల్లో నిర్వహణ

1.2 కోట్ల మంది హాజరవుతారని అంచనా

4

బాపట్ల మున్సిపల్ పాఠశాలలో సమావేశానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నియంతపై తిరుగుబాటు

దక్షిణకొరియా అధ్యక్షుడు తనకుతానుగా తప్పుకోవడమో, మిగతావారంతా ఆయనను దించేయడమో రేపోమాపో ఖాయం. ఆయనను అభిశంసించే ప్రయత్నం మరింత వేగం పుంజుకుంది. ఎంత పాపిష్టిపనిచేసినా అధినాయకుడి నిర్ణయాలను గుడ్డిగా సమర్థించే దిగువస్థాయి నేతలను చూస్తున్న మనకు దక్షిణకొరియా పరిణామాలు ఆశ్చర్యం కలిగించేవే. అప్రజాస్వామిక వైఖరులను, నిరంకుశ నిర్ణయాలను కేవలం నిరసనలతోనూ, ధర్నాలతోనూ జనం వ్యతిరేకిస్తే కూడా సహించలేని పాలకులు మన మధ్య ఉన్నారు. లాఠీ దెబ్బలతోనూ, తూటాలతోనూ అణచివేయడం తప్ప, ప్రజాభీష్టాన్ని గౌరవించడం, ప్రజాస్వామికంగా వ్యవహరించడం మన నాయకులకు తెలియనివిద్య. అవినీతి ఆరోపణలతో పరువుపోగొట్టుకొని, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం సైనికపాలనను ప్రకటించిన ఆరుగంటల్లోనే జనానికి జడిసి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న దక్షిణకొరియా అధ్యక్షుడిని విమర్శించాలో, ప్రశంసించాలో తెలియని స్థితి.

అధ్యక్షభవనాలను వేలాదిమంది చుట్టుముట్టినా కాల్చిపారేయడం తప్ప, గద్దెదిగిరాని నియంతలను మనం చూశాం. సైనికపాలన నిర్ణయాన్ని కొద్దిగంటల్లోనే వెనక్కుతీసుకోవడానికి అధ్యక్షుడు యూన్ సెక్‌యోల్ మీద వచ్చిన ఒత్తిడి చిన్నదేమీ కాదు. దానిని బేఖాతరు చేసి, ఆఖరు నిముషం వరకూ ఆయన అంతే నిరంకుశంగా వ్యవహరించివుంటే, అంతకంతకూ మరింత మూర్ఖంగా వ్యవహరించి ఉంటే, పరిస్థితి పూర్తిభిన్నంగా ఉండేది, కథ ఇలా ముగిసేది కాదు. తప్పటడుగువేసినా, వెనకడుగువేసినందుకు, విపక్షనేతల, ప్రజల ఒత్తిడికి తలొగ్గినందుకు ఆయనను మెచ్చుకోవాలి. ఇటువంటి వాడు దేశాధ్యక్షస్థానానికి పనికిరాడు, ఆయన తనకుతానుగా దిగితే సరి, లేదా కలసి దించేస్తామని విపక్షాలు ఏకకంఠంతో నిర్ణయాన్ని ప్రకటించాయి. ఆశ్చర్యమేమంటే, స్వపక్షంనుంచి కూడా అదే అభిప్రాయం వినబడుతూండటం. ఆయనను దేశాధ్యక్షుడిగా కూచోబెట్టిన పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) పెద్ద తలకాయలు కూడా ఇదేమాట అంటున్నారు. ఆయన మర్యాదగా తప్పుకోవడం కాదు, అంతలోగా మనమే దించేయకపోతే పార్టీ పరువు పోతుందన్న ఆ కాస్తంత ఇంగితజ్ఞానం వాళ్ళకు ఉన్నందుకు సంతోషించాలి. రాష్ట్రాలకు రాష్ట్రాలు కులం కార్చిచ్చుల్లోనో, మతం మంటల్లోనో తగలబడుతున్నప్పుడు నిమ్మకు నీరెత్తినట్టుండే పాలకులను, అస్మదీయులను వెనకేసుకొచ్చే అధినాయకులనూ మనం చూస్తూనే ఉన్నాం.

అంతచైతన్యవంతంగా ఉన్నందుకు దక్షిణకొరియా ప్రజలను మెచ్చుకోవాలి. విపక్షనేతలు సరేసరి. అపఖ్యాతి పాలైన అధ్యక్షుడు నిరంకుశుడై, నిరవధికంగా దేశాన్ని ఏలాలని కుట్రపన్నుతున్నాడు కనుక, అతడితో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధపడ్డారు. రెండువందలమంది ఎంపీలు రాత్రికిరాత్రి గేట్లు దూకి, చట్టసభల్లోకి ప్రవేశించి అధ్యక్షుడి నిర్ణయాన్ని తిరగదోడటం మంచి పరిణామం. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ఒక నాయకుడు, రాజ్యవ్యతిరేక శక్తుల్ని ఏరిపారేస్తానని, కల్లోలంగా ఉన్న దేశాన్ని చక్కదిద్దుతానని ఏవో బూటకపు మాటలు చెబుతూ మరో నియంతగా తయారైనాడని ప్రజలు ఇట్టే గ్రహించారు. ఎవరి ప్రోద్బలమూ, నాయకత్వమూ లేకుండా, అనతికాలంలో అన్నివేలమంది రోడ్లమీదకు వచ్చి, నినాదాలతో, నిరసనలతో అధినాయకుడిని గడగడలాడించడం ప్రశంసనీయమైనది. ఉత్త చేతులతో వీధుల్లోకి వచ్చి, సైన్యం చేతుల్లో ఉన్న తుపాకులు లాక్కోగలిగిన ఆ సాహసం మెచ్చుకోదగినది. పొరుగుదేశాలను, అక్కడి మతాలను, కార్చిచ్చులను, కల్లోలాలను చూపి, లేని కుట్రలన్నీ వాటికి ఆపాదించి హాయిగా అధికారంలో కొనసాగే పాలకులను మనం చూస్తున్నాం. కానీ, ఒక మహానియంత ఏలుబడిలో ప్రత్యర్థిదేశం పొరుగునే ఉండగా, నిత్యమూ నెత్తిన యుద్ధవిమానాలు తిరిగే వాతావరణంలో దశాబ్దాలుగా బతుకుతున్నప్పటికీ దక్షిణకొరియా ప్రజలు తమ అధ్యక్షుడి వాదనలకు విలువ ఇవ్వకపోవడం ఆశ్చర్యం. పొరుగుదేశం ఎంత ప్రమాదకరమైనదో వారికి తెలియనిదేమీ కాదు. కానీ, తన తప్పుడు పనికి అధినాయకుడు ఉత్తరకొరియా బూచిని చూపడాన్ని వారు అంగీకరించలేదు, తీవ్రంగా ప్రతిఘటించారు కూడా. ఆదేశాలున్నాయి కదా అని జనాన్ని పిట్టల్లా కాల్చేయకుండా ప్రజాగ్రహానికి జడిసిన, వారి నిరసనలను గౌరవించిన సైన్యాన్ని సైతం మెచ్చుకోవాలి.

నాలుగుదశాబ్దాల క్రితం వరకూ అనుభవించిన సైనికపాలనను దక్షిణకొరియా ప్రజలు విస్మరించలేదు. ఆనాటి నియంతృత్వం తిరిగి తలెగరేయకుండా జాగ్రత్తపడ్డారు. అప్పటిపాలకులను ఘనంగా కీర్తించే ఇప్పటి దేశాధ్యక్షుడు ఆర్థికంగా ఎదిగిన దేశాన్ని ముంచేయకుండా కాపాడుకున్నారు. పొరుగుదేశాలను, కమ్యూనిస్టులను బూచిగా చూపే కుట్రలను ఛేదించారు. కష్టపడి సాధించిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నారు.

జెలెన్ స్కీ పుణ్యమే ఉక్రెయిన్ యుద్ధం!

అధినేత అని ఊరికే అనరు. ప్రజలు వారికి అలవోకగా ఆ బిరుదు ఇవ్వరు. పరిపాలనా దక్షకుడు అనేది కూడా భావోద్వేగాల లోంచి పుట్టుకురాదు. తాను పాలించే ప్రజల ధన ప్రాణ మానాలకు నష్టం కలగకుండా ఓర్పుతో నేర్పుతో నెగ్గుకు రావడం వల్ల కలిగే కీర్తి పరిపాలనా దక్షత. ఈ మధ్య కాలంలో అవేవీ లేకుండా గాలి వాటంగా నేతలు అధినేతలై గద్దెనెక్కుతున్నారు. ముఖ్యంగా ప్రజల పాలన పట్ల ఏ మాత్రం అవగాహన లేనివారు, తమ అభిమాన గణం ఆహా ఓహోల మధ్య నాయకులై పోతున్నారు. వారికి తోచిందే నినాదం. దేశమేదైనా ప్రజలను చాలా చాలా సులువుగా ఆకట్టుకొని మంట పుట్టించే నినాదాలు జాతీయవాదం, మతం. మనదేశంలో అయితే కులం అనే మరో అదనపు నినాదం కూడా ఉంది. ఈ నినాదాలకు కాస్త గ్లామర్ తోడైతే ఇక నేతల జనాదరణకు ఆకాశమే హద్దు. ఇలాంటి వారిని మన దేశంలో చాలా మందే చూడొచ్చు. కాకపోతే వారు ఇంకా రాష్ట్రాల పరిధిలోనే ఉండిపోయారు కాబట్టి మనం బతికిపోతున్నాం సుమా!

అసలు విషయంలోకి వస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా ఈ కోవలోనే అధికారంలోకి వచ్చాడు. అంతకుముందు ఆయన రాజకీయాలతో ఎలాంటి ప్రమేయం లేని వ్యక్తి. ప్రజలు, ప్రజా జీవితంతో మమేకమైన మనిషి కాదు. ఉక్రెయిన్ సినిమాల్లో కమెడియన్ పాత్రధారి మాత్రమే, క్వార్టర్ 95 నిర్మాణ సంస్థ 'వన్ ప్లస్ వన్' నెట్ వర్క్‌లో నిర్మించిన 'సర్వెంట్ ఆఫ్ ది పీపుల్' సిరీస్‌లో హిస్టరీ ప్రొఫెసర్ పాత్రలో నటించాడు. ప్రొఫెసర్ పాత్రలో అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో అనుకోకుండా ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు అవుతాడు. అప్పుడున్న ఉక్రెయిన్ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టినట్టు ఉండటంతో ఆ సినిమా సూపర్ డూపర్ హిట్టయ్యింది. అచ్చు గుద్దినట్టుగా ఈ కల్పిత పాత్రే కొంచెం అటు ఇటుగా నిజమైంది. క్వార్టర్ 95 టీవీ సంస్థ ఆ సిరీస్ పేరుతోనే సర్వెంట్ ఆఫ్ ది పీపుల్ అనే పార్టీ స్థాపించింది. జెలెన్ స్కీ ఆ పార్టీ తరఫున పోటీ చేసి 72 శాతానికి పైగా ఓట్లు సాధించి ఉక్రెయిన్ అధ్యక్షుడయ్యారు. ఇది మన దగ్గర అంతకు ముందే తెలుగు తమిళ భాషల్లో అర్జున్ హీరోగా నటించిన హిట్ సినిమా 'ఒక్కడు' మూవీని కాపీ కొట్టినట్టు ఉంటుంది. జెలెన్ స్కీ ఆ ఎన్నికల్లో తూర్పు ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పుతా, అవినీతిని అంతమొందిస్తా... ఇత్యాది నినాదాలతో అధికారంలోకి వచ్చాడు. అవినీతి సంగతేమో కానీ ఆ దేశం మొత్తంలోనే శాంతి లేకుండా పోయింది. అశాంతి ఉక్రెయిన్‌కే పరిమితం కాలేదు. యూరప్ మొత్తం యుద్ధం భయంలో ఉంది. ఐరోపా ఏమిటి, ప్రపంచమే అణుయుద్ధం భయంతో ఉలిక్కిపడుతోంది. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రష్యాతో యుద్ధం విషయంలో జెలెన్ స్కీ అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని అనిపిస్తోంది. దాని పర్యవసానాలు, దేశ ప్రజల స్థితిగతులు ఎలా మారిపోతాయో అంచనా వేయకుండా ఆయన కయ్యానికి కాలు దువ్వారని భావించక తప్పడం లేదు. దీనర్థం రష్యా దురాక్రమణను సమర్థించడం కాదు. పిరికితనంతో వ్యవహరించమనడం అంతకంటే కాదు.

ప్రజలను పాలించడం అంటే సినిమాల్లోనో లేక స్టేజీల మీద పూనకాలు వచ్చినట్టు బూతులు తిడుతూ, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ఊగిపోతూ చేసే ప్రసంగాలు చేయడం కానే కాదు. సమయానుకూలంగా, సందర్భోచితంగా చాకచక్యంతో వ్యవహరించడం. అవసరాన్ని బట్టి ఒకడుగు ముందుకు మరో అడుగు వెనక్కు అన్నట్టు ఉండాలి. ప్రత్యర్థి బలాబలాలను, స్వంత బలాన్ని అంచనా వేసి నిర్ణయాలు తీసుకోవాలి. అవతలివాడు బలవంతుడైతే వాడు బలహీనపడే సమయం కోసమే ఎదురు చూడాలి. మన వెంట వచ్చేవారు నమ్మకస్తులు, చివరి వరకూ తమతో ఉండేవారు ఎవరు, మధ్యలో వీడేవారు ఎవరు అని గుర్తెరగాలి. పక్కవారికి చెవులు అప్పగించరాదు. ఒకవేళ వారి మాటలు విన్నా అవి ఏ మేరకు మనకు ఉపయోగపడతాయో చూసుకోవాలి. ఇవేవీ ఆలోచించకుండానే చెప్పుడు మాటలు విని హీరోయిజం మత్తులో జెలెన్ స్కీ తీసుకున్న తప్పుడు నిర్ణయం ఇప్పుడు ఆ దేశ ప్రజల జీవితాలను సర్వనాశనం చేసింది.



ప్రజల రక్షణే ధ్యేయంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ నిర్ణయాలు తీసుకోలేదని ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. యుద్ధం ఎడతెగకుండా కొనసాగుతుంటే, నమ్మినవారు ఒక్కొక్కరు దూరమవుతుంటే నిస్తేజమైపోతున్న ఉక్రెయిన్ ప్రజలకు ఆయన ఏం సమాధానం చెప్పగలరు? ముందస్తు పరిణామాలు అంచనా వేయకుండా నాయకుడు తీసుకునే నిర్ణయాలు ప్రజలకు తీరని నష్టం చేస్తాయనడానికి ఉక్రెయిన్ ఒక ఉదాహరణ.

అమెరికా చెప్పుడు మాటలు విని నాటోలో చేరతామని రష్యా ముందు తొడలుగొట్టి మరీ జెలెన్ స్కీ యుద్ధ రంగంలోకి దిగాడు. నాటో సభ్యత్వం వచ్చి ఉంటే ఉక్రెయిన్‌కు వచ్చే లాభం ఏమిటో, ఎంతో తెలియదు కానీ ఇప్పుడు ఆ దేశం కకావికలమయ్యింది. నాటో సభ్యత్వం లేదు, బహిరంగంగా వెంట వస్తాయని భావించిన నాటో దళాలు చాటు మాటు సాయానికే పరిమితమయ్యాయి. ఉక్రెయిన్ తరఫున నేరుగా యుద్ధంలో పాల్గొంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ అణుదాడి చేస్తాడని నాటో దేశాలు గజగజ వణికిపోతున్నాయి. రష్యా చైనా, ఉత్తర కొరియా, మూడూ ఒక కూటమిగా తిరగబడితే అమెరికా ఆధిపత్యం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఐరోపా దేశాలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ సమయంలో యుద్ధాన్ని ఆపడానికి అమెరికా చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు. శవాల మీద పేలాలు ఏరుకుంటున్నట్టుగా ఆ అగ్రరాజ్యం వ్యవహరిస్తోంది. ఉక్రెయిన్‌కు యుద్ధ సామగ్రి సరఫరా చేసి ఆయిల్ నిల్వలు దక్కించుకుంటూ తన నికృష్ట బుద్ధి చూపిస్తోంది.

జెలెన్ స్కీ ఈ పరిణామాలను గుర్తిస్తున్నారా? లేదు. కనుకనే ఉక్రెయిన్ ప్రజల్ని యుద్ధ గుండంలో దహనం చేస్తున్నాడు. ఈ యుద్ధ కాలంలో ఇంత వరకు ఉక్రెయిన్ జనాభా కోటి తగ్గింది. ప్రపంచంలోనే గణనీయంగా పెట్రో నిల్వలు, నూనె గింజల ఉత్పత్తి, అణు ఇంధన శక్తి కేంద్రాలు, (సోవియట్ యూనియన్ కాలంలో ఏర్పాటు చేసిన) సువిఖ్యాత వైద్య, విద్యా సంస్థలు ఉక్రెయిన్‌లో ఉన్నాయి. అక్కడ వ్యవసాయం అతి పెద్ద వనరు. ఎంతగా అంటే ఏటా కోటి టన్నుల పొద్దు తిరుగుడు పండుతుంది. దీని నుండి ఉత్పత్తి చేసే సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో 27 శాతం నూనె మన భారతదేశానికే ఎగుమతి చేస్తోంది ఉక్రెయిన్. ఇప్పుడు ఆ సారవంతమైన వ్యవసాయ భూములు, యుద్ధ క్షేత్రాలుగా మారిపోయాయి. ఆ భూముల్లో ల్యాండ్ మైన్లు, యుద్ధ ట్యాంకులతో నిండిపోయాయి. ఒకవేళ ఏదో రకంగా యుద్ధం ముగిసినా ట్యాంకులు వెళ్లిపోతాయి. కానీ ల్యాండ్ మైన్స్ అక్కడి రైతుల ప్రాణాలు బలిగొంటూనే ఉంటాయి.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దన్ను చూసుకొని యుద్ధ రంగంలోకి దిగాడు. ఇప్పుడు ఆయన అధ్యక్ష పదవి నుంచి దిగిపోతున్నాడు. రష్యా అధ్యక్షుడు పుతిన్ స్నేహితుడు ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాడు. ఇప్పుడు పరిస్థితి ఏంటి? బైడెన్ తరహాలో ట్రంప్ సాయం చేస్తాడా? అందునా ట్రంప్, జెలెన్ స్కీతో ఫోన్ ఆడియో లీక్ వ్యవహారం ఉండనే ఉంది. ఈ ఆడియో లీక్ చేసి కేసులు ఎదుర్కోవడానికి జెలెన్ స్కీనే కారణమన్న కోపంలో ఉన్న ట్రంప్ సహకరించకపోవచ్చు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే మన తుంటరి భాషలో చెప్పాలంటే జెలెన్ స్కీ బకరా అయ్యినట్టు కన్పిస్తోంది. వ్యక్తిగా ఆయన బకరా అవ్వడం అటుంచితే, ఉక్రెయిన్ నష్టాన్ని ఎవరు పూడ్చగలరు? ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 15 లక్షల కోట్ల డాలర్లకు పైగా అవుతుందని అంచనా. మరి వెలకట్టలేని ప్రాణాల సంగతేంటి? కొన్ని తరాలు చెల్లించాల్సిన మూల్యం ఎంత? కటువుగా చెప్పాలంటే దేశాధ్యక్షుడు ఇంత బుర్ర తక్కువ నిర్ణయం తీసుకుంటాడా అనే ప్రశ్న ఎదురవుతోంది. అధ్యక్షుడి పరిపాలనా నిర్ణయం అంటే కోట్ల మంది తలరాత అని గుర్తించాలి కదా.

ఉక్రెయిన్ యుద్ధం జెలెన్ స్కీ, పుతిన్‌ల మొండితనం వల్లే వచ్చింది కావొచ్చు. మరి రష్యాకూ భారీ నష్టం వాటిల్లింది. చెప్పవచ్చిందేమిటంటే అమెరికా రష్యా పోట్ల గిత్తల రాజకీయ ఎత్తుల్లో చిత్తయ్యింది మాత్రం ఉక్రెయిన్ ప్రజలు. జెలెన్ స్కీ దేశాధ్యక్షుడిగా ప్రజల రక్షణే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకోలేదని అర్థమవుతోంది. రాజకీయ పరిణతితో కాకుండ అపరిపక్వ నిర్ణయం తీసుకున్నారని రోజు రోజుకూ రూఢి అవుతోంది. యుద్ధం మొదట్లో అమెరికా కాంగ్రెస్ యూరప్ దేశాల పార్లమెంట్, ఐక్యరాజ్యసమితిని ఉద్దేశించి ఉక్రెయిన్ భాషలోనే గంభీర ప్రసంగాలు చేశారు. లోపల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి పైన ఆలివ్ గ్రీన్ టీ షర్ట్ ధరించి సైనికులను నేరుగా కలిస్తే చూపరులకు ఆకర్షణీయంగా ఉంటుందేమో కానీ దేశ ప్రజల జీవితాలకు ఏ రకంగానూ ఉపయోగపడదు. దీర్ఘకాల యుద్ధం కొనసాగుతుంటే, నమ్మినవారు ఒక్కొక్కరు దూరమవుతుంటే నిస్తేజమైపోతున్న ఉక్రెయిన్ ప్రజలకు ఏం సమాధానం చెప్పగలరు. ఆవేశపూరిత ప్రసంగాలు, ముందస్తు పరిణామాలు అంచనా వేయకుండా తీసుకునే నిర్ణయాలు తీరని నష్టం కలుగచేస్తాయని చెప్పడానికి ఉక్రెయిన్ ఒక ఉదాహరణ. జెలెన్ స్కీ శాశ్వత మానవుడు లేదా ఉక్రెయిన్ శాశ్వత అధ్యక్షుడు కాదు కదా. యుద్ధాన్ని ఏదో ఒకనాడు ముగించాల్సిందే రేపటి తరానికి సమాధానం చెప్పాల్సిందే. అన్నింటికీ యుద్ధమే గత్యంతరం కాదు.

● జయసారథి రెడ్డి
జర్నలిస్టు

ఈ వివాదాలకు అంతమెక్కడ?

చాలా చట్టాల రూపకల్పనను నేను మొదటి నుంచి చివరివరకు పర్యవేక్షించడం జరిగింది. ముసాయిదా బిల్లు చిన్నదిగా, స్ఫుటంగా, స్పష్టంగా ఉండాలని న్యాయమంత్రిత్వ శాఖ న్యాయ శాస్త్ర నిపుణులకు గట్టిగా సూచించేవాణ్ణి. 'ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991' నా ప్రమేయమున్న చట్టాలలో ఒకటి. అది చాలా చిన్న చట్టం. 8 సెక్షన్లు మాత్రమే అందులో ఉన్నాయి. ఆ చట్టానికి ఒక లక్ష్యమున్నది. ఆ లక్ష్యం స్ఫుటంగా ఉన్నది: ఆగస్టు 5, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని స్తంభింపజేయడం అంటే యథాతథంగా ఉండేలా చేయాలని నిర్దేశించింది. ఆ చట్టం చాలా స్పష్టంగా ఉంది. 'అయితే'లు, 'అయినా'లు, 'కానీ'లకు లేదా అయినప్పటికీ' ఇత్యాది మినహాయింపులు, అభ్యంతరాలకు తావివ్వనిదిగా ఉన్నది. మరీ ముఖ్యంగా ఆ చట్టం పూర్తిగా 'పక్షపాత రహితం'గా ఉన్నది. పూర్వ భావనలు, అవిచారితాభిప్రాయాలను ప్రోత్సహించేదిగా లేదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆ చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4 (1)ని ప్రతి ఒక్కరూ చదవాలని నేను కోరుతున్నాను. సెక్షన్ 3: ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని మార్చడంపై నిషేధం. ఒక మతపరమైన ప్రార్థనా స్థలం లేదా మతపరమైన ప్రార్థనా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి లేదా అదే మతానికి చెందిన వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనా స్థలంగా ఎవరూ మార్చకూడదు. సెక్షన్ 4: ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని మార్చడానికి సంబంధించి అన్ని అప్పీళ్లు, దావాలు లేదా ఇతర న్యాయవిచారణ కార్యకలాపాలు చట్టం ప్రారంభమైన తరువాత ముగుస్తాయి. తాజా అప్పీళ్లను దాఖలు చేయడం అనుమతించడబడు. ఆగస్టు 15, 1947న ఒక ప్రార్థనా స్థలం మతపరమైన స్వభావం ఎలా ఉన్నదో, ఆ రోజున ఉన్న రీతిలోనే కొనసాగుతుంది. అయితే (అయోధ్యలో ఉన్న) రామజన్మభూమి–బాబ్రీ మసీదుగా దేశ ప్రజలకు సుపరిచితమైన ప్రార్థనా స్థలాన్ని మాత్రం ఈ చట్టం నుంచి మినహాయించారు. ఆ ప్రార్థనా స్థలంపై అప్పటికే సుదీర్ఘకాలంగా న్యాయ వివాదం కొనసాగుతుండడమే ఆ మినహాయింపునకు కారణం.

ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం లక్ష్యం, ఉద్దేశం, స్ఫూర్తి, పరిధికి విస్తృతంగా ప్రజామోదం లభించింది. సామాన్య విద్యావంతులు, న్యాయశాస్త్ర నిపుణులు ఆ చట్టాన్ని హర్షామోదాలతో స్వాగతించారు. ఆ చట్టం తన లక్ష్యాన్ని సాధించిందని నేను అభిప్రాయ పడుతున్నాను. వివిధ ప్రార్థనా స్థలాలకు సంబంధించిన పలు వివాదాలపై ఎటువంటి జగడాలు లేకుండా మూడు దశాబ్దాల పాటు ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దేవాలయం ఒక దేవాలయంగా ఉండాలని, ఒక మసీదు ఒక మసీదుగా ఉండాలని, ఒక చర్చి ఒక చర్చిగా ఉండాలని, ఒక గురుద్వారా ఒక గురుద్వారాగా ఉండాలని, ఇంకా ఇతర మతాల ప్రార్థనా స్థలాలు ఆగస్టు 15, 1947న ఎలా ఎలా ఉన్నాయో అలాగే యథాతథంగా ఉండాలనే విషయాన్ని దేశ పౌరులు చాల వరకు అంగీకరించారు.

దురదృష్టవశాత్తు ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం అమలవుతున్న తీరు తెన్నులపై సమగ్ర సమాచారం లేదు. PRISM పార్లమెంటు కార్యకలాపాల పరిశోధనా సంస్థ)ను వాకబ్ చేయగా ఆ చట్టం కింద జరిగిన అరెస్టులు, విధింపబడిన శిక్షల గురించి పార్లమెంటులో మూడు సందర్భాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం చప్పిడి సమాధానాలు మాత్రమే ఇచ్చిందని తెలియజేసింది. మొత్తం మీద కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆ చట్టం పనిచేస్తున్న తీరుపై నిరపాయకరమైన నిర్లక్ష్యం చూపారని చెప్పవచ్చు.

న్యాయస్థానాలు రంగప్రవేశం చేశాయి. అక్టోబర్ 28, 2020న దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఒక రిట్ పిటిషన్ దాఖలయింది. ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991లోని సెక్షన్లు 2, 3, 4 సెక్షన్లను నిష్ప్రయోజనకరమైనవిగాను, రాజ్యాంగవిరుద్ధమైనవిగాను ప్రకటించాలని ఆ రిట్ పిటిషన్ విజ్ఞప్తి చేసింది. పిటీషన్‌దారు అందుకు చూపిన కారణమేమిటి? అనాగరిక దురాక్రమణదారులు న్యాయసమ్మతం కాని రీతిలో 'ప్రార్థనా స్థలాల'ను తమవిగా చెల్లుబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నందున 1991 చట్టంలోని 2, 3, 4 సెక్షన్లను రద్దు చేయాలి. ఇదీ ఆ పిటీషనర్ వాదన.

సెక్షన్ 3, సెక్షన్ 4 ఆ చట్టంలోని కీలక భాగాలు. అవి లేకుంటే ఆ చట్టంలో ఏమీ ఉండదు. అది అసలు అనవసరం. భారత రాజ్యాంగం అధికరణలు 14, 15, 21, 25, 26, 29ని ఆ రెండు సెక్షన్లు ఉల్లంఘిస్తున్నాయనే వాదనతో సుప్రీంకోర్టులో సెక్షన్ 3, సెక్షన్ 4ను సవాల్ చేశారు. ఆ 'ప్రార్థనా స్థలాలు' అనాగరిక దురాక్రమణదారులు చట్టవిరుద్ధంగా స్వాయత్తం చేసుకున్నవని పిటీషనదారు పేర్కొనడం గమనార్హం. ఏ మత ప్రజల తరఫున తాను ఈ పిటిషన్ దాఖలు చేసింది, ఏ మత సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పిటీషన్‌ను వేసింది కూడా పిటీషన్‌దారు స్పష్టంగా పేర్కొన్నాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'హిందువుల, జైనుల, బౌద్ధుల, సిక్కుల' మత ప్రదేశాలను చట్టబద్ధంగా ఆయా మతస్థులకు పునరుద్ధరించాలని ఆ పిటీషన్‌దారు అభ్యర్థించాడు. అక్టోబర్ 28, 2020 నుంచి ఆ రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నది.

2023లో సుప్రీంకోర్టు ఒక స్పెషల్ లీవ్ పిటీషన్ (ఎస్ఎల్‌పి)ను విచారణకు స్వీకరించింది. వారణాసిలోని అంజుమన్ ఇంతెజామియ మసీద్ నిర్వహణా కమిటీ ఆ పిటిషన్‌ను దాఖలుచేసింది. ఆగస్టు 3, 2023న అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఒక ఆదేశాన్ని ఆ ఎస్ఎల్‌పి సవాల్ చేసింది. జ్ఞాన్‌వాపి మసీదు ఉన్న స్థలాన్ని సర్వే చేయాలని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ను జిల్లా జడ్జి ఆదేశించారు. ఈ ఆదేశానికి వ్యతిరేకంగా వారణాసిలోని అంజుమన్ మసీదు నిర్వహణదారుల అప్పీల్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని అంజుమన్ మసీదు నిర్వహణదారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆగస్టు 4, 2023న సుప్రీంకోర్టు జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇలా పేర్కొంది: 'హైకోర్టు అభిప్రాయంతో విభేదించలేక పోతున్నాం. రాజ్యాంగ అధికరణ 136 కింద మా న్యాయాధికారాలను వినియోగించుకుంటూ ఆ నిర్ణయానికి వచ్చాం.. సొలిసిటర్ జనరల్ వాదనలను నమోదు చేశాం. ఈ కేసులో న్యాయప్రక్రియ అంతా ఎఎస్ఐ అనుసరించే పద్ధతులపై ఆధారపడి ముగుస్తుంది'.



ఇప్పుడు మథురలోని ఈద్గా మసీదు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్ మసీదు, ఢిల్లీలోని కుతుబ్ మీనార్ కట్టడం, అజ్మీర్ (రాజస్థాన్)లోని దర్గాపై వివాదాలు ముసురుకుంటున్నాయి. వీటన్నిటికీ ఆస్కారమిచ్చింది జ్ఞానవాపి ఉత్తర్వు కాదూ?

సుప్రీంకోర్టు ఉత్తర్వు అనేక ఉపద్రవాలకు ఆస్కారం కల్పించింది. చిక్కులకు దారితీస్తోంది. 2022లో సివిల్ దావా (18) వేసిన వారి ఉద్దేశాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరపలేదు. ఆ దావా వేసినవారి అభ్యర్థన: జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలోని ఉన్న దేవతామూర్తులకు పూజలు, ఇతర క్రతువులు నిర్వహించే హక్కు తమకు ఉందని, కనుక ఆ మసీదులో పూజలకు తమను అనుమతించాలి. ఒక మసీదులో ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు తమను అనుమతించాలన్నదే దావా వేసిన వారి అభ్యర్థన అన్నది స్పష్టం. వారి విజ్ఞప్తిని అంగీకరించి, అక్కడ ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు అనుమతి నివ్వడమంటే ఆ మసీదును, కనీసం పాక్షికంగా అయినా ఒక దేవాలయంగా మార్చడమే అవుతుంది. మరి ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991లోని సెక్షన్ 3, సెక్షన్ 4 ప్రకారం అటువంటి అనుమతినివ్వడమంటే ఆ మసీదును హిందూ దేవాలయంగా మార్చడమే అవుతుంది!

2022లో సివిల్ దావా 18 వేసిన వ్యక్తుల ఉద్దేశాన్ని, వారు కోరిన విధంగా జ్ఞాన్‌వాపి మసీదులో పూజలకు అనుమతినిస్తే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో చూడలేమా? అర్థం చేసుకోలేమా? సామాన్య విద్యావంతులకూ అదేమంత కష్టం కాదు. సుప్రీంకోర్టు రాజ్యాంగ అధికరణ 141 కింద తన అధికారాలను వినియోగించుకుని ఆ దావాలో 'న్యాయప్రక్రియ పూర్తి చేసి ఉండాల్సింది' అని నేను అభిప్రాయపడుతున్నాను. దావా 18ని దాఖలు చేయడానికి అనుమతించి, మూడు దశాబ్దాలుగా అందరూ గౌరవిస్తున్న ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం–1991 ప్రకారం ఆ దావాను కొట్టివేసి ఉండవల్సింది. దురదృష్టవశాత్తు దేశ సర్వోన్నత న్యాయస్థానం అలా చేయలేదు. సరే, ఇప్పుడు మథురలోని ఈద్గా మసీదు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్ మసీదు, ఢిల్లీలోని కుతుబ్ మీనార్ కట్టడం, అజ్మీర్ (రాజస్థాన్)లోని దర్గాపై వివాదాలు ముసురుకుంటున్నాయి. వీటన్నిటికీ ఆస్కారమిచ్చింది జ్ఞాన్‌వాపి ఉత్తర్వు కాదూ? జ్ఞాన్‌వాపి ఉత్తర్వు పర్యవసనాలు భారత ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠాకరమైన ఎడిఎమ్ జబల్పూర్ కేసులో వలే ఉండవచ్చు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

రెవెన్యూ భూ వివాదాలకు మంగళం

భూమి అంటే అమ్మతో సమానం. మధ్యతరగతి రైతు కుటుంబాలు తమకు ఉన్న సొంత స్థలాన్ని, పొలాన్ని అమ్మలా చూసుకుంటాయి. ఏదైనా కష్టమొస్తే తినడమైనా మానుకుంటారు కానీ, సొంత స్థలాన్ని పొలాన్ని అమ్ముకొని దర్జాగా ఉండొచ్చు అనే ఆలోచన రైతులు చేయరు. అలాంటి రైతులు, పేద మధ్య తరగతి కుటుంబాల మధ్య భూ సమస్యలు వస్తే సివిల్ కోర్టుల చుట్టూ తిరిగి సమస్యను పరిష్కరించుకునేవారు. ఇది 2019కి ముందు మాట. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు రైతులు, పేద మధ్యతరగతి ప్రజలకు చెందిన భూ సమస్యలపై కోర్టుల చుట్టూ కాకుండా అధికార పార్టీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కల్పించారు. కారణం జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలే.

భూ రీ సర్వే పేరుతో, వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష, 22 ఏ జాబితాలో నిషేధిత భూముల తొలగింపు, 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములను విక్రయించుకోవచ్చునని (పార్టీ నాయకుల కోసం) కొత్త కొత్త వింత వింత నిర్ణయాలతో జగన్మోహన్‌రెడ్డి, ఆయన అనుయాయులు రైతులు, పేద ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. నాయకులు వాళ్లే, అధికారులూ వాళ్ల మనుషులే ఇక చేసేది ఏమీ లేక రైతులు బాధను దిగమింగుకుని నిమ్మకుండిపోయారు. ఇప్పుడు పేద ప్రజలకు ఊపిరి పీల్చుకునేలా కూటమి ప్రభుత్వం ధైర్యం ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే భూ ప్రక్షాళన మొదలు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అసైన్డ్ భూముల రక్షణకు ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు భూములను కబ్జా చేస్తే 10 నుంచి 14 ఏళ్ల దాకా జైలుశిక్ష విధించడంతో పాటు కేసు తీవ్రతను బట్టి జరిమానాను కూడా ప్రతిపాదించారు. కబ్జా చేసిన భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అసలైన యజమానులకు దక్కేలా చట్టపరమైన చర్యలను ప్రతిపాదించారు. ఈ ఒక్క నిర్ణయంతో రైతులు, పేద ప్రజలు వారివారి భూ సమస్యలు, వివాదాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం మొదలు పెట్టారు. ఒకటి రెండు కాదు ఏకంగా 68 వేల ఫిర్యాదులు కేవలం భూ వివాదాలకు సంబంధించినవే ఉన్నాయంటే.. వైసీపీ నాయకులు ఎంత మంది రైతులు, పేద ప్రజల నుంచి ఎన్ని వేల ఎకరాలను కబ్జాలు చేశారో, దోచేశారో అర్థం చేసుకోవచ్చు.

దశాబ్దాలుగా లేని ఈ భూ రగడకు కారణాలేమిటి? ఎక్కడ పునాది, ఎక్కడ లోపం, ఏది పరిష్కారం? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన తరువాతే అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ప్రకటన చేశారు. సభ్యులంతా ఆ చట్టానికి ఆమోదం తెలిపే క్రమంలో... తన భూమిలో 40 సెంట్లు భూమి మాయం చేశారని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటన చేయడంతో అంతా ఆశ్చర్యపోయారు. ఒక ప్రజాప్రతినిధి భూమికే రక్షణ లేకపోతే... ఇక సామాన్యుల భూములు ఎలా దోచుకొని ఉంటారో కదా. బుచ్చయ్య చౌదరి అనుభవమే ఆ అక్రమాలకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే కాకుండా, భూముల రీ సర్వే నిలిపివేసి, గిరిజన రైతుల 4.15 లక్షల ఎకరాల ఆర్ఓఆర్ఎఫ్ భూములకు ఫార్మర్ రిజిస్ట్రీలో చోటు కల్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం వారికి మేలు చేసింది. జగన్ నియంతృత్వ పోకడలతో విసిగిపోయిన ప్రజలకు కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో ఉపశమనం కల్పిస్తున్నాయి. ఇప్పటికే అనేక ప్రజా ప్రాయోజిత కార్యక్రమాలు ప్రారంభించిన ప్రభుత్వం భూ సమస్యలు, వివాదాలపై కూడా దృష్టి పెట్టింది. భూ రీ సర్వే, పాసు పుస్తకాల మార్పు, వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష, జగన్మోహన్‌రెడ్డి ముఖచిత్రంతో ముద్రించిన పాసు పుస్తకాలు ముద్రించడం వంటి తప్పులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భూ సమస్యలు పరిష్కారం కాక అనేక మంది రైతులు, ప్రజలు ప్రాణాలు విడిచిన సంఘటనలు చూశాం. ఎవరికి చెప్పాలో తెలియక, ఏ నాయకుడికి, ఏ అధికారికి చెప్పినా సమస్య పరిష్కారం కాక తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఐదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రంలో భారీ స్థాయిలో భూఆక్రమణలు జరిగాయి. వేల కోట్ల రూపాయల విలువ చేసే స్థలాలను వైసీపీ గ్యాంగ్ అప్పనంగా కొట్టేసింది. జనం గొంతు నొక్కేసి రికార్డులను ట్యాంపరింగ్ చేసి ప్రభుత్వ ప్రైవేటు స్థలాలను విచ్చలవిడిగా ఆక్రమించారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఉండాల్సిన రికార్డులు ప్రైవేటు సంస్థల చేతుల్లో తరలించారు. వాగులు, వంకలు రోడ్డులు కేకుల్లా పంచుకొని పేదల నోళ్లు కొట్టి వేల కోట్లు ఆర్జించారు. వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదందాలు సాగాయి. భూ ఆక్రమణలు, అనుమతులు లేని లే అవుట్‌లు కోకొల్లలు. నియంతృత్వ పాలన పీడ విరగడై రైతులు, పేద ప్రజలకు వరంగా ప్రస్తుత ప్రభుత్వ పాలన సాగుతోంది. ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు భూ సమస్యలు, భూ వివాదాలకు సరైన పరిష్కారం చూపిస్తానని, పట్టా పాసు పుస్తకాలు పాత విధానంలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే పట్టా పాసు పుస్తకాలు ప్రభుత్వ ముద్రతో ఉన్నవి అందజేశారు. ఇప్పుడు గ్రామ సభల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సిద్ధమైంది.

అసంబద్ధ రీ సర్వే వలన.. ప్రజల భూములు చిక్కుల్లో పడ్డాయి. ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరు పేరు మీదకు ఎక్కించటం.. అక్రమ ఆన్లైన్ చేసుకోవడం జరిగింది. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు పేదల భూములను కబ్జాలు చేశారు. పేదల భూములు కొట్టేసేందుకు 14 లక్షల ఎకరాలకు పైగా ఫ్రీ హోల్డ్ చేశారు. తమకు అనుకూలంగా ఉండే అధికారులు, సిబ్బందిని నియమించుకోని భూములు మాయం చేశారు. పల్లె, పట్టణాలు అనే తేడా లేకుండా విలువైన ప్రభుత్వ భూములు, వివాదాలలో ఉన్న స్థలాలను తమ అనుయాయులకు, తమకు అనుకూలంగా పనిచేసే అధికారుల చేత ధారాదత్తంగా రాయించుకున్నారు. చాలా చోట్ల రెవెన్యూ రికార్డులు తారుమారు చేసారు. ప్రభుత్వం మారిన కొన్ని రోజులకే తప్పులు ఎక్కడ బయట పడతాయో అని గ్రహించిన వైసీపీకి అనుకూలంగా పనిచేసిన అధికారులు వారి వారి సిబ్బంది చేత ప్రభుత్వ కార్యాలయాల్లో దస్త్రాలను... షార్ట్ సర్క్యూట్ కారణం చూపి తగలబెట్టించేస్తున్నారు. ఈ వ్యవహారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములను విక్రయించుకొని దోచుకోవచ్చని నిబంధనలు తీసుకొచ్చి.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేస్తున్నట్టు జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముసుగులో వైసీపీ నాయకులు రైతులతో ఒప్పందం కుదుర్చుకొని భూములను వారి పేరిట మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతల సూచనలతో గత ప్రభుత్వం 22–ఏ జాబితాలో నుంచి నిషేధిత భూములను తప్పించి అప్పనంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ అక్రమాల భరతం పట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం సంకల్పించి, కార్యాచరణకు పూనుకుంది. ప్రజలకు గత ప్రభుత్వం చేసిన నిర్వాకాన్ని వివరిస్తూనే... ఇలాంటి అత్యధికంగా వస్తున్న భూ సమస్యల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహణకు చర్యలు చేపట్టింది.

భూమి ఉన్నా రికార్డుల్లో లేకపోతే ఆ భూమిపై ఏ లబ్ధి పొందాలన్నా సాధ్యం కాదు. ప్రభుత్వ పథకాలు అందవు. పంటల బీమా దక్కదు. ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరగాలని, మంచి పాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగమే గ్రామాల్లో జనవరి 8 వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు.



ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా స్వీకరించిన వినతుల్లో 60 వేలకు పైగా వినతులు భూ సమస్యల పైనే వచ్చాయి. అందులో భాగంగా డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకుంది. అలాగే గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలు పరిష్కారానికి.. అధికారులు వినతులు స్వీకరించి పరిష్కరించనున్నారు. గ్రామ సభల్లో భూ వివాదాలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి ప్రజలకు రసీదులు ఇస్తారు. ఈ రెవెన్యూ సదస్సులో అధికారులతో పాటు నేతలు కూడా పాల్గొని ప్రజల సమస్యల పరిష్కరించనున్నారు. గ్రామాల్లో దీర్ఘ కాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఒక మంచి వేదిక మాదిరిగా రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమిపై హక్కులో చిక్కులు లేకుంటేనే ప్రజలైనా, ప్రభుత్వమైనా ప్రగతి బాటలో ముందుకెళ్లడం సాధ్యమవుతుందని కూటమి ప్రభుత్వ విశ్వసిస్తోంది. భూ హక్కులోని చిక్కులను తొలగించడానికి మంచి చట్టాలు, సమర్థమైన భూ పాలన, సత్వరం సమస్యలను పరిష్కరించే భూ న్యాయ వ్యవస్థ ఉండాలని ఒకవైపు చట్టాలు చెయ్యడంతో పాటు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిచండం ముఖ్య భాగం. భూమి ఉన్నా రికార్డుల్లో లేకపోతే ఆ భూమిపై ఏ లబ్ధి పొందాలన్నా సాధ్యం కాదు. ప్రభుత్వ పథకాలు అందవు. పంటల బీమా దక్కదు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరగాలని, మంచి పాలన అందించాలనే సంకల్పంతో పనిచేస్తుందన డానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదు.



■ అనగాని సత్యప్రసాద్
రెవెన్యూ, రిజిస్ట్రేషన్ & స్టాంపుల శాఖ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

- రైతులకు చెల్లింపులు వేగవంతం
- ఒక్క రోజే 40,811 టన్నుల సేకరణ
- 48 గంటల్లోనే ఖాతాల్లో సొమ్ము జమ
- జగన్ హయాంలో రైతులను వేధించారు
- పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులకు మద్దతు ధర ప్రకారం సొమ్ములు వేగంగా వారి ఖాతాల్లో జమవుతున్నాయి. శుక్రవారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 5,731 మంది రైతుల నుంచి 40,811 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. రూ.94.01 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 1,67,299 మంది రైతుల నుంచి 11,63,510 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 5.22 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగా.. ఈ ఏడాది 11 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారని, ర్యాండమైజేషన్ పేరుతో నిర్దేశించిన మిల్లులకే తరలించాలనే నిబంధన వల్ల ధాన్యం తరలింపు రైతులకు తలకుమించిన భారంగా పరిణమించిందన్నారు. ధాన్యం సంచుల కోసమే రోజుల తరబడి రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి గత ప్రభుత్వంలో ఉండేదన్నారు. అయినప్పటికీ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి లారీల్లో సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు తరలించినా.. రోజుల తరబడి దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. పైగా తేమ శాతం పేరుతో మిల్లర్లు భారీగా కోతలు విధించడం, ఆ తరుగుకు సమానమైన సొమ్మును రైతులు ముందుగా చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం.. ఇలా అడుగడుగునా సాగిన దోపిడీతో రైతులు నష్టపోయారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు రెండు, మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిందన్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో సమూల మార్పులు చేసిందన్నారు. ర్యాండమైజేషన్ నిబంధనను తొలగించి రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలోని ఏ రైసు మిల్లుకైనా తరలించుకునే సౌలభ్యం కల్పించిందని మంత్రి చెప్పారు. మద్దతు ధర ప్రకారం 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్టు వివరించారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మన్యం జిల్లాలతోపాటు కోస్తాలోని తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని నాదెండ్ల తెలిపారు.

14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ

- హాజరు కానున్న చంద్రబాబు, వెంకయ్యనాయుడు
- హైదరాబాద్‌లో 100 అడుగుల విగ్రహం: టీడీ జనార్దన్



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 14న దివంగత ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ స్మారక సాహిత్య కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దనరావు శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. "గత నెల 24నాటికి ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75 ఏళ్ల పూర్తయ్యాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను నిర్వహిస్తున్నామని తెలిపారు. "తెలుగు సినీ జగత్తులోనే కాకుండా భారతీయ సినీ రంగంలో ఎన్టీఆర్ ఒక మేరునగధీరుడు. పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక... ఇలా ప్రతి పాత్రలోనూ ఆయన మేటి నటుడిగా నిలిచారు. తనను ఎంతో ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయ రంగంలోకి వచ్చిన ఆయన పేదవాడి మనసు తెలిసి వాళ్ల అవసరాలు తీర్చడానికి ఎంతో ప్రయత్నం చేశారు. వజ్రోత్సవ వేడుకలకు ఎన్టీఆర్ కుమార్తెలు, కుమారులు పురందేశ్వరి, రామకృష్ణ, మోహనకృష్ణతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, కృష్ణ, రామానాయుడు కుటుంబ సభ్యులు హాజరవుతున్నారు. సినీ రంగంలో ఎన్టీఆర్‌తోపాటు కలిసి పని చేసిన కళాకారులు, టెక్నీషియన్లు, దర్శకులనూ ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 14న పెనమలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఓ రిసార్ట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది" అని జనార్దనరావు వివరించారు. మన దేశం మొదలుకొని ఎన్టీఆర్ నటించిన మూడు వందల సినిమాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 'తారక రామం' పేరుతో ఒక పుస్తకాన్ని వజ్రోత్సవ వేడుకలో విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగునాట ఎన్టీఆర్ స్మృతి చిరస్థాయిగా ఉండటానికి హైదరాబాద్‌లో ఆయన 100 అడుగుల విగ్రహం ఏర్పాటుచేసి ఆయనకు సంబంధించిన విశేషాలతో డిజిటల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.





మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న సునీత, గోపాల్‌నాయుడు దంపతులు

మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్‌కు 50 రోజులు

» ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా.. 75% వినతుల పరిష్కారం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' శుక్రవారంతో 50 రోజులు పూర్తిచేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదట తన నియోజకవర్గం మంగళగిరిలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన లోకేశ్.. క్రమంగా ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తున్న బాధితుల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు ఉదయం 8గంటలకే ప్రజాదర్బారుకు హాజరవుతున్నారు. అర్జీదారులను నేరుగా కలిసి, ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, వారి గోడు వింటూ, వినతులు స్వీకరిస్తున్నారు. సోషల్‌మీడియా ద్వారా వచ్చే విజ్ఞప్తులనూ పరిశీలించి, పరిష్కార మార్గాలు చూపుతున్నారు. గడచిన 50రోజుల్లో 5,810 విజ్ఞప్తులు అందగా, 4,400(75%) అర్జీలను పరిష్కరించారు. 1,410 పరిశీలన దశలో ఉన్నాయి. భూ వివాదాలకు సంబంధించి, 1,588 విజ్ఞప్తులు అందగా, 1,770 పరిష్కరించారు. హోంశాఖకు చెందిన 1,276 వినతులు రాగా, 1,158 పరిష్కరించారు. ఉద్యోగాల కోసం 800 దరఖాస్తులు అందగా, అర్హతలను బట్టి 347మందికి త్వరలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయాన్ని పరిశీలిస్తున్నారు. పింఛన్ల కోసం 350 అర్జీలు అందగా, త్వరలో పరిష్కారం చూపనున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పెద్దిరెడ్డి మా భూములు కాజేశారు

» మాజీ మంత్రిపై మంత్రి లోకేశ్‌కు మదనపల్లి దంపతుల ఫిర్యాదు


తాడేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నమయ్య జిల్లా మదనపల్లిలో 15 కుటుంబాలకు చెందిన రూ.200 కోట్ల విలువైన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని మదనపల్లికి చెందిన బాసాని సునీత, రెడ్డి గోపాల్‌నాయుడు దంపతులు మంత్రి లోకేశ్‌కు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేశారు. మదనపల్లికి చెందిన కట్టా సులోచనను బినామీగా పెట్టి ఫోర్జరీ డాక్యుమెంట్లతో పట్టణంలో రూ.10కోట్ల విలువైన తమ 50 సెంట్ల భూమిని ఆక్రమించి వేధిస్తున్నారని సునీత, గోపాల్‌నాయుడు దంపతులు మంత్రి ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. రెండు రోజుల క్రితం పెద్దిరెడ్డి, సులోచన అనుచరులు తమ స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి తాము నిర్మించుకున్న ప్రహరీ, సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా టిప్పర్ లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం గంగపల్లిని ప్రత్యేక పంచాయితీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. శిథిలావస్థకు చేరుకున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం స్థలంలో నూతన భవనం నిర్మించాలని, ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం, గట్టుగూడెంకు చెందిన ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు కోరారు. దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన లోకేశ్ వారి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా యిచ్చారు.

రాష్ట్రానికి 8 కేంద్రీయ విద్యాలయాలు

న్యూఢిల్లీ, అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటు కానున్నాయి. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి కొత్తగా 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. వాస్తవానికి గతేడాది సెప్టెంబరులోనే ఏపీలో 8 కేవీలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. కానీ నాటి వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు. కూటమి ప్రభుత్వం శ్రద్ధ వహించడంతో ఇప్పుడు మంజూరయ్యాయి. అనకాపల్లి, వలసపల్లె(మదనపల్లె, చిత్తూరు జిల్లా), పాలసముద్రం(గోరంట్ల మండలం, శ్రీసత్య సాయి జిల్లా), తాళ్లపల్లి(మాచర్ల మండలం, గుంటూరు జిల్లా), నందిగామ (కృష్ణా జిల్లా), రొంపిచర్ల (నరసారావు పేట, గుంటూరు జిల్లా), నూజివీడు(ఏలూరు జిల్లా), డోన్(నంద్యాల జిల్లా)లో కొత్త కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు మంజూరయ్యాయి.

పోలవరం గడువు..
తరచూ మార్చితే ఎలా?

» పీపీఏ సీఈవో అభ్యంతరం
» 2026 మార్చికే ఈసీఆర్ఎఫ్ పూర్తి చేస్తామన్నారుగా!
» ఇప్పుడేమో 2027 చివరికని అంటున్నారు
» వచ్చే జనవరి 2న డయాఫ్రం వాల్ మొదలుపెట్టాల్సిందే
» ప్రత్యేక ఖాతా నుంచే లావాదేవీలు చేయాలి
» అడ్వాన్సులో 75% ఖర్చుపెడితేనే తదుపరి వాయిదా విడుదల
» పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే గడువును తరచూ మార్చేస్తే ఎలాగని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్ జైన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 2021 నుంచి వరుసగా తేదీలు మార్చుతూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టును 2026 మార్చినాటికి పూర్తి చేస్తామని రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చినందునే.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి డెడ్‌లైన్‌ను అధికారికంగా ప్రకటించామని తెలిపారు. ఇప్పుడు కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)ను 2027 డిసెంబరుకు పూర్తి చేస్తామంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. పోలవరం పనులపై శుక్రవారం ఢిల్లీ నుంచి అతుల్ జైన్ రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను జనవరి 2వ తేదీన ప్రారంభించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ పనుల బాధ్యత పూర్తిగా జర్మన్ సంస్థ బావర్‌దేనని స్పష్టం చేశారు. గతంలో ఆ సంస్థ, ఎల్ అండ్ టీ కలసి వాల్‌ను నిర్మించాయని.. ఇప్పుడు బావర్ ఒక్కటే కడుతోందని చెప్పారు. కాంక్రీట్ ప్లాస్టిక్ మిక్స్‌ను మేఘా ఇంజనీరింగ్ సిద్ధం చేసినప్పటికీ.. మిశ్రమం సరిగా ఉందో లేదో ధ్రువీకరించి.. నిర్మాణం చేపట్టాల్సింది బావర్ మాత్రమేనని వెల్లడించారు.

ప్రత్యేక ఖాతాపై సడలింపులు ఉండవ్..

కేంద్రం నుంచి పోలవరం నిధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాంకు ఖాతా ద్వారానే పనుల చెల్లింపులన్నీ జరగాలని అతుల్ జైన్ స్పష్టం చేశారు. ఈ షరతుపైనే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు ముందస్తుగా ఇచ్చామన్నారు. ఈ నిబంధనపై ఎలాంటి సడలింపులూ ఉండవని చెప్పారు. ఈ ఖాతాలో ఇప్పటిదాకా రూ.300 కోట్లే జమ చేశారని.. మిగిలిన రూ.2,000 కోట్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అడ్వాన్సుగా ఇచ్చిన రూ.2,300 కోట్లలో 75శాతం వ్యయం చేస్తేనే.. తదుపరి వాయిదా విడుదలవుతుందని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు ముందస్తుగా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాంట్రాక్టు సంస్థ, జల వనరుల శాఖతో పాటు థర్డ్ పార్టీగా మరో ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అతుల్ పేర్కొన్నారు. ఇందుకోసం టెండర్లు పిలవాలన్నారు. పోలవరం డిజైన్లన్నీ ఆఫ్రీ ఏజెన్సీ ద్వారా మేఘా చేపడుతోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రతి 15 రోజులకోసారి కాంట్రాక్టు సంస్థలతో సమావేశం నిర్వహించాలన్నారు. నిర్మాణ సంస్థపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారికి నియంత్రణ ఉండాల్సిందేనని పీపీఏ సీఈవో స్పష్టం చేశారు.

నేడు మెగా పీటీఎం

» రాష్ట్రవ్యాప్తంగా 44,303 పాఠశాలల్లో నిర్వహణ
» బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో సమావేశానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

అమరావతి/బాపట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు (పీటీఎం) నేడు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్నాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా 44,303 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేరోజున మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాలను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు కలిపి దాదాపు 1.2కోట్ల మంది పాల్గొంటారని అంచనా వేస్తోంది. బాపట్ల మున్సిపల్ పాఠశాలలో నిర్వహించే పీటీఎంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. మిగిలిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వార్డు సభ్యులు వారి పరిధిలోని బడుల్లో పాల్గొనాలని పాఠశాల విద్యాశాఖ ఆహ్వానాలు పంపింది.

సీఎం పర్యటన షెడ్యూల్

శనివారం ఉదయం 10:20 గంటలకు బాపట్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ వద్దకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. అక్కడి నుంచి మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణానికి చేరుకొని మధ్యాహ్నం 1:30 వరకు మెగా పీటీఎంలో పాల్గొంటారు. 1:40 గంటలకు ఉండవల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

ఆర్భాటాలకు దూరంగా.. సీఎం పర్యటన

ముఖ్యమంత్రి పర్యటన అంటే చెట్లు నరకాలి. ఒకరోజు ముందుగానే రోడ్లన్నీ బ్లాక్ చేయాలి. పరదాలు కట్టాలి. రోడ్లన్నీ ఫ్లెక్సీలతో నిండిపోవాలి... గత సీఎం జగన్ పర్యటనలు సాగిన తీరు ఇదీ. బాపట్ల జిల్లాలో తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వచ్చిన ఆయనకు ఏకంగా రెడ్ కార్పెట్ స్వాగతం పలకడంపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. ఇదంతా గతం.. శనివారం బాపట్ల



ముఖ్యమంత్రి పర్యటన కోసం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే పీటీఎంకు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి లోకేశ్ హాజరు కానున్నారు. కానీ ఎక్కడా కూడా చెట్లు కొట్టడం, ఫ్లెక్సీల హోరు, నేతల అత్యుత్సాహం లాంటివి లేకుండా పూర్తిగా విద్యా వాతావరణంలో కార్యక్రమం జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థుల్లో చైతన్యం తేనున్న 'ఈగల్'

మత్తు మహమ్మారిని తరిమి కొట్టేందుకు నడుం బిగించిన 'ఈగల్' పాఠశాల విద్యార్థుల్లో చైతన్యమే లక్ష్యంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ల్లో గంజాయి, డ్రగ్స్, వైట్‌నర్ తదితర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలంటూ చైతన్యం తీసుకురానున్నారు. 'మత్తుకు బానిసైతే అన్నీ కోల్పోతారు. అమ్మానాన్నపై చిరాకు పడతారు. స్నేహితులకు దూరమవుతారు. బంధువులు ఇళ్లకు రానివ్వరు. చదవలేరు, రాయలేరు. అన్ని విధాలా చితికిపోతారు. ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఇస్తోంది. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతోంది. చదువుకోండి, హోంవర్కు చేసుకోండి. మత్తుకు సంబంధించి ఎవరైనా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తే ఇంట్లోవాళ్లకు, టీచర్లకు చెప్పండి. డ్రగ్స్ వద్దు బ్రో అని బడిలో, వీధిలో, ఊళ్లో గట్టిగా అరవండి' అని విద్యార్థులకు వివరించడంతో పాటు దీనికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేస్తారు. మంత్రి లోకేశ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఈగల్ అధిపతి ఆకే రవికృష్ణ చెప్పారు.

సెకీతో విద్యుత్ ఒప్పందం ఆపొద్దు

» గుజరాత్, రాజస్థాన్ నుంచి సరఫరా.. కడప సెకీ ప్లాంట్ నుంచి నిరాకరణ
» 2025-26 వాస్తవాదాయ నివేదికలో డిస్కమ్‌ల వెల్లడి

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని ఆపరాదని డిస్కమ్‌లు నిర్ణయించాయి. సెకీ నుంచి కొనుగోలు చేస్తున్న 7,000 మెగావాట్ల విద్యుత్తును రాజస్థాన్, గుజరాత్ విద్యుదుత్పత్తి సంస్థల నుంచి సేకరించనున్నట్లు స్పష్టం చేశాయి. 2021 డిసెంబరు 1న చేసుకున్న ఒప్పందం మేరకు ఈ ఏడాది 3,000 మెగావాట్లు, 2025లో మరో 3,000 మెగావాట్లు, 2026లో మిగిలిన 1000 మెగావాట్లను సరఫరా చేస్తామని పేర్కొందని తెలిపాయి. 2025-26కి గాను ఈఆర్‌సీకి సమర్పించిన వాస్తవాదాయ నివేదికలో డిస్కమ్‌లు ఈ మేరకు పేర్కొన్నాయి. కడపలో సెకీ నిర్మిస్తున్న 750 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్ నుంచి కొనుగోలు చేసేందుకు నిరాకరించాయి. యూనిట్‌ను రూ.2.78, రూ.2.77 చొప్పున అందిస్తామంటూ సెకీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయలేకపోవడంతో సెకీ నుంచి విద్యుత్తు కొనుగోలుకు డిస్కమ్‌లు నిరాకరించాయి.

మామిడి బీమాకు ప్రీమియంలో రైతు వాటా ఖరారు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి మామిడి పంటకు బీమాను అమలు చేస్తున్నట్లు ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా తొలి అడుగు వేసింది. బీమా కంపెనీ ఎకరాకు నిర్ధారించిన ప్రీమియంలో ఎంత శాతం రైతు భరించాలన్నది ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. అనంతపురం 15.00%, ఎన్టీఆర్, కాకినాడ, కడప, అన్నమయ్య, విజయనగరం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు 16.77%, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, తిరుపతి, తూర్పుగోదావరి జిల్లాలకు 17.74%, నంద్యాల, అనకాపల్లి, ఏలూరు జిల్లాలకు 16.08% సగటు ప్రీమియంగా ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25, 2025-26 రబీ సీజన్లలో మామిడి పంటకు పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా కింద 'అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా' బీమా అమలు చేయనున్నది.

కడప రైల్వే ప్రాజెక్టుకు
10% కూడా ఖర్చు చేయని జగన్ సర్కారు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప-బెంగళూరు మధ్య రూ.2,706 కోట్ల రైల్వే లైన్ నిర్మాణానికి జగన్ ప్రభుత్వం 50 శాతం వ్యయాన్ని భరించాల్సి ఉండగా 10శాతం కూడా భరించలేదని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడ రఘునాథరెడ్డి శుక్రవారం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ ప్రాజెక్టుకు రూ.2,706కోట్లు ఖర్చవుతుందని, గత మార్చి నాటికి జగన్ సర్కారు కేవలం రూ.190 కోట్లు మాత్రమే డిపాజిట్ చేసిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కాగా, గిద్దలూరు - పులివెందుల - ముదిగుబ్బ- శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మధ్య 110 కిలోమీటర్ల మేర రైల్వేలైన్‌కు సర్వే పనులు ప్రారంభించామని వెల్లడించారు.

ఏపీకి నాలుగు జాతీయ అవార్డులు

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు గ్రామ పంచాయతీలు జాతీయ అవార్డులు దక్కించుకున్నాయి. 'ఆరోగ్యకర' కేటగిరిలో చిత్తూరు జిల్లా ఐరాల మండలం బొమ్మసముద్రం, 'సంతృప్తికర తాగునీరు'లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి, 'పచ్చదనం-పరిశుభ్రత'లో అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం తగరంపూడి, 'సామాజిక భద్రత' కేటగిరీలో ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల పంచాయతీకి ఈ అవార్డులు దక్కాయి. 11న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగే జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా మెమెంటో, రూ.కోటి నగదు అందుకోనున్నారు. 2022-23లో పైన పేర్కొన్న అంశాల్లో చూపిన పనితీరుతో ఈ అవార్డులు వరించాయి.

కొత్త వక్ఫ్ బోర్డు నియామకం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త వక్ఫ్ బోర్డును పునర్నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎలెక్టెడ్ సభ్యులను కొనసాగిస్తూ, కొత్త సభ్యులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్ బోర్డులో ఎలెక్టెడ్ మెంబర్లు మహమ్మద్ రుహుల్లా, షేక్ ఖాజా ముతావల్లీలను సభ్యులుగా కొనసాగించారు. నామినేటెడ్ మెంబర్లుగా అబ్దుల్ అజీజ్, హజీ ముఖరమ్ హుస్సేన్, మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్‌లను నియమించారు. నామినేటెడ్ మెంబర్లుగా సెక్షన్ 14 (3) కింద మొహమ్మద్ నజీర్(ఎమ్మెల్యే), సయ్యద్ దావూద్ బాషా, షేక్ అక్రమ్‌లను నియమించారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంతో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో శనివారం దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో బలపడుతూ 12నాటికి తమిళనాడు, శ్రీలంక తీరాల దిశగా వస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది బలపడి వాయుగుండంగా మారడంపై రెండు రోజుల తర్వాత స్పష్టత రానుంది. దీని ప్రభావంతో 11 నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు పెరుగుతాయని, 12న అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

నవ్య | చిత్రజ్యోతి

విజయవాడలో వేడుక

ఎన్టీఆర్ నటించిన మొదటి చిత్రం 'మన దేశం' విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డిసెంబరు 14న విజయవాడలో వేడుక నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్ల గురించి చర్చించేందుకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి హైదరాబాద్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇందులో



టీడీ జనార్దన్, నందమూరి రామకృష్ణ, భరత్ భూషణ్, ప్రసన్నకుమార్

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, తెలుగు సినీ రైటర్స్ అసోసియేషన్, తెలుగు సినీ దర్శకుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మల్లన్న సన్నిధిలో...

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను అక్కినేని నాగార్జున, నాగచైతన్య దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. నాగార్జున తన కుమారుడు నాగచైతన్య, కోడలు శోభితతో కలిసి ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా.. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు జరిపారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నాగార్జున, నాగచైతన్య దంపతులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీశైలం (ఆంధ్రజ్యోతి)

వింటేజ్ లుక్‌లో రామ్



హీరో రామ్ పోతినేని, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'రాపో 22' వర్కింగ్ టైటిల్. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమాలో రామ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ.. 'మీకు సుపరిచితుడు.. మీలో ఒకడు.. మీ సాగర్' అని దర్శకుడు మహేశ్‌బాబు పేర్కొన్నారు. ఇందులో రామ్ వింటేజ్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు.

పీరియాడిక్ యాక్షన్ డ్రామా



హీరో సాయిదుర్గా తేజ్, నూతన దర్శకుడు రోహిత్. కేపీ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎస్‌డీటీ 18' వర్కింగ్ టైటిల్. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 12 సినిమా టైటిల్‌ను.. గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఇటీవలే సాయి దుర్గాతేజ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించి 'ఇంట్రూడ్ ఇన్‌టూ ద వరల్డ్ ఆఫ్ అర్కాడీ' అనే వీడియోను విడుదల చేయగా.. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ఆయన పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మీ కథానాయిక. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియాగా ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నారు.

ఫొటోతో రూమర్స్‌కు చెక్



అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ విడిపోతున్నారంటూ ఇటీవలి కాలంలో జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో వీరిద్దరూ కలసి దిగిన కొన్ని ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ పార్టీకి అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య కలసి హాజరయ్యారు. ఆ సందర్భంగా నటి ఆయేషా జుల్కా, వ్యాపారవేత్త అనురంజన్ వీరిద్దరితో కలసి తీసుకున్న సెల్ఫీలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ పిక్స్ కింద ఓ నెటిజన్.. 'ఒక్క ఫొటోతో రూమర్స్‌కు చెక్' అని కామెంట్ చేశారు. ఈ పార్టీలో క్రికెటర్ సచిన్ టెండూల్కర్, నటుడు తుషార్ కపూర్ కూడా తళుక్కుమన్నారు. కాగా, ఇటీవలే జరిగిన వారి కూతురు ఆధ్యా పుట్టినరోజు వేడుకలో కూడా వీరిద్దరూ కలసి కనిపించిన సంగతి తెలిసిందే.

ఇంట్రడక్షన్ అదిరింది



గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్లపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'జాట్'. సన్నీడియోల్, రణదీప్ హుడా ప్రధాన తారాగణం. ఇప్పటికే ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌తో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. రెండు పాత్రల మధ్య సాగే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. వారిలో ఒకరు పోలీస్ ఆఫీసర్. విలన్ల చేతులు, కాళ్లను గొలుసులతో కట్టి ఉంచిన సన్నీ డియోల్ క్యారెక్టర్ ఇంటెన్స్ ఇంట్రడక్షన్‌ని ప్రజెంట్ చేస్తోంది. రణదీప్ హుడాను మెయిన్ విలన్‌గా పరిచయం చేశారు. దర్శకుడు గోపీచంద్ మలినేని మాస్-అప్పీలింగ్ యాక్షన్‌ని తీయడంలో అద్భుతమైన నైపుణ్యాలు ప్రదర్శించారు. ఈ చిత్రంలో వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

క్రిటిక్స్ ఛాయిస్ అవార్డు..



సమంత, వరుణ్ ధావన్ నటించిన 'హనీ బన్నీ' వెబ్ సిరీస్ ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సంగతి తెలిసిందే. రస్సో బ్రదర్స్ దర్శకులుగా రూపొందిన 'సిటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. రాజ్ అండ్ డీకే దర్శక ద్వయం తెరకెక్కించిన ఈ వెబ్ సిరీస్‌కు ఓ అరుదైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్ 30వ ఎడిషన్‌లో.. ఉత్తమ విదేశీ భాషా సిరీస్‌లలో ఒకటిగా 'హనీ బన్నీ' నామినేట్ అయ్యింది. వచ్చే ఏడాది జనవరి 12న ఈ అవార్డుల వేడుక యూఎస్‌లోని శాంట మోనికాలో జరగనుంది.

గౌరవంగా భావిస్తున్నా



కన్నడ నటుడు రిషబ్ శెట్టి, బాలీవుడ్ దర్శకుడు సందీప్ సింగ్ దర్శకత్వంలో 'ద ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహరాజ్' చిత్రంలో నటించనున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ హిస్టారికల్ డ్రామా టైటిల్‌ను.. ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 2027 జనవరి 21న సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు రిషబ్. "ఛత్రపతి జీవితం నన్నెప్పుడూ ఆశ్చర్యానికి గురిచేస్తుంటుంది. ఆయనో చారిత్రక యోధుడు.. నేషనల్ హీరో. ఆయన జీవిత కథలో భాగమవ్వటాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. ఈ తరహా బయోపిక్‌లలో నటించే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ సినిమా గురించి దర్శకుడు చెప్పగానే క్షణం కూడా ఆలోచించకుండా అంగీకరించా. ఎంతో వైవిధ్యంతో.. ఉన్నతమైన స్థాయిలో ఈ సినిమాను దర్శకుడు సందీప్ తెరకెక్కిస్తున్నారు" అని చెప్పారు.

గౌరవనీయ ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏ.పి.ఇ.ఆర్.సి) వారి సమక్షంలో

విద్యుత్ నియంత్రణ భవన్, 220/132/33/11 కెవి A.P.కార్బైడ్స్ SS ప్రక్కన, దిన్నెదేవరపాడు రోడ్, కర్నూల్ - 518 002, ఆంధ్ర ప్రదేశ్, ఫోన్ నెం: 08518-294823, 24, 25, 26.

ఆంధ్ర ప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిఎస్‌పిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సప్లయి లైసెన్స్ నెం.**15/2000** కలిగి ఉన్న పంపిణీ సంస్థ **"సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)"**, ఆ॥సం॥ **2025-26** నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు, టారిఫ్ ప్రతిపాదనలు మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీలతో సహా (ఎ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) **తేది.30.11.2024**న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఇఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే **ఓ.పి. నెం.88/2024**గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు **చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్ఏసి&ఐపిసి, "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)"**, ప్రధాన కార్యాలయం, **డోర్ నెం. 19-13-65/ఎ**, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, **తిరుపతి-517503 మరియు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూల్ మరియు నంద్యాల** సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను కార్యాలయ పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ **www.apspdcl.in** లో లభించును మరియు వీటిని **www.aperc.gov.in** వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రచురించబడిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ. 100/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా ఎ.ఓ/సిపిఆర్, ఏపిఎస్‌పిడిసియల్, తిరుపతి వారి పేరున డిడి రూపేనా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్‌లో లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా ఎ.ఓ/సిపిఆర్, ఏపిఎస్‌పిడిసియల్ తిరుపతి వారి పేరున డిడి రూపేనా) చొప్పున చెల్లించి పై వివరించిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనల (ఎ.ఆర్.ఆర్, టారిఫ్&సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి తేది.28.12.2024 సా॥ 5.00 గంటల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిఎస్‌పిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని **చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్ఏసి&ఐపిసి, "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)", ప్రధాన కార్యాలయం డోర్ నెం. 19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి - 517503** గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఇఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నివేదించు వారి సంతకం(లు) పూర్తి పేరు(లు) మరియు పోస్టల్ చిరునామా(లు) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిఎస్‌పిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిఎస్‌పిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి మాట్లాడేది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2025-26 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచటమైనది:

ఏపిఎస్‌పిడిసిఎల్ - ఆ॥సం॥ 2025-26 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	1385.07	13	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	0.00
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	47.78	14	మొండి బకాయిలకు సదుపాయం	4.25
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు బదిలీ చేసిన నికర పంపిణీ ఖర్చు	2755.75	15	(N-2) సంవత్సరము (ఆ॥సం॥ 2023-24) : నియంత్రించలేని అంశముల విధింపు	-149.29
4	పిజిసిఐఎల్ ఖర్చు	707.22			
5	యుఎల్‌డిసి ఖర్చు	1.95	16	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15)	17932.67
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి వ్యయం (1+2+3+4+5)	4897.77	17	సమగ్ర ఆదాయ అవశ్యకత (6+16)	22830.44
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	15788.02	18	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే ఆదాయము	14,116.99
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించదగిన పంపిణీ ఖర్చు	1388.04	19	టారిఫేతర ఆదాయము	1,705.85
			20	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయము / లోటు (18+19) - 17	-7007.60
9	వినియోగదారుల సెక్యూరిటీ డిపాజిట్ల మీద వడ్డీ	190.78	21	ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ ద్వారా మారిన ఆదాయం	6861.53
10	రిటైల్ సరఫరా వ్యాపారములో సరఫరా మార్జిన్	39.86	22	క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ మరియు గ్రిడ్ సపోర్ట్ చార్జీల ద్వారా ఆదాయం	146.07
11	ఇతర ఖర్చులు ఏవైనా ఉన్నట్లైతే	64.35			
12	పెన్షన్ బాండ్ల పై అదనపు వడ్డీ	606.66	23	నికర లోటు / మిగులు (20+21+22)	0.00

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిసిపిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ నెం.**1/2020** కలిగి ఉన్న పంపిణీ సంస్థ **"ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)"**, ఆ॥సం॥ **2025-26** నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీలతో సహా (ఎ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) **తేది.30.11.2024**న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఇఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే ఓ.పి.నెం.**89/2024**గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు **చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్), "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)"**, ప్రధాన కార్యాలయం, **గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ -520008 మరియు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, సిఆర్‌డిఏ, ఒంగోలు మరియు బాపట్ల** సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను కార్యాలయ పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apcpdcl.in లో లభించును మరియు వీటిని www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రచురించబడిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ. 100/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా ఎ.ఓ/సిపిఆర్, ఏపిసిపిడిసియల్, విజయవాడ వారి పేరున డిడి రూపేనా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్‌లో లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా ఎ.ఓ/సిపిఆర్, ఏపిసిపిడిసియల్, విజయవాడ వారి పేరున డిడి రూపేనా) చొప్పున చెల్లించి పై వివరించిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనల (ఎ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్)పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి **తేది.28.12.2024** సా॥ 5.00 గం॥ల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిసిపిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని **చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)", ప్రధాన కార్యాలయం, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ - 520008** గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఇఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నివేదికలు నివేదించు వారి సంతకం(లు) పూర్తి పేరు(లు) మరియు పోస్టల్ చిరునామా(లు) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిసిపిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిసిపిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి మాట్లాడేది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2025-26 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచటమైనది:

ఏపిసిపిడిసిఎల్ - ఆ॥సం॥ 2025-26 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	766.48	13	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	0.00
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	26.44	14	మొండి బకాయిలకు సదుపాయం	12.38
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు బదిలీ చేసిన నికర పంపిణీ ఖర్చు	1764.78	15	(N-2) సంవత్సరము (ఆ॥సం॥ 2023-24) : నియంత్రించలేని అంశముల విధింపు	51.02
4	పిజిసిఐఎల్ ఖర్చు	391.37			
5	యుఎల్‌డిసి ఖర్చు	1.08	16	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15)	10049.60
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి వ్యయం (1+2+3+4+5)	2950.15	17	సమగ్ర ఆదాయ అవశ్యకత (6+16)	12999.74
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	8744.03	18	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే ఆదాయము	9516.24
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించదగిన పంపిణీ ఖర్చు	722.51	19	టారిఫేతర ఆదాయము	487.06
9	వినియోగదారుల సెక్యూరిటీ డిపాజిట్ల మీద వడ్డీ	125.61	20	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయము / లోటు (18+19) - 17	-2996.44
10	రిటైల్ సరఫరా వ్యాపారములో సరఫరా మార్జిన్	24.87	21	ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ ద్వారా మారిన ఆదాయం	2973.66
11	ఇతర ఖర్చులు ఏవైనా ఉన్నట్లైతే	33.45	22	క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ మరియు గ్రిడ్ సపోర్ట్ చార్జీల ద్వారా ఆదాయం	22.78
12	పెన్షన్ బాండ్ల పై అదనపు వడ్డీ	335.72	23	నికర లోటు / మిగులు (20+21+22)	0.00

ఆంధ్ర ప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిఈపిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సప్లయి లైసెన్స్ నెం.**12/2000** కలిగి ఉన్న పంపిణీ సంస్థ **"ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)"**, ఆ॥సం॥ **2025-26** నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీలతో సహా (ఎ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) తేది.**30.11.2024**న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఇఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే ఓ.పి. నెం.**90/2024**గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు **చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్.ఎ&పి.పి), "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)"**, ప్రధాన కార్యాలయం, **పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013 మరియు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు మరియు పశ్చిమ గోదావరి** సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను కార్యాలయ పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ **www.apeasternpower.com** లో లభించును మరియు వీటిని **www.aperc.gov.in** వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రచురించబడిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ. 100/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసియల్, విశాఖపట్నం వారి పేరున డిడి రూపేనా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్‌లో లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేనా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసియల్ విశాఖపట్నం వారి పేరున డిడి రూపేనా) చొప్పున చెల్లించి పై వివరించిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనల (ఎ.ఆర్.ఆర్, టారిఫ్& సిఎస్ఎస్)పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి తేది.**28.12.2024** సా॥ 5.00 గం॥ల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిఈపిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని **చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్.ఎ&పి.పి), "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)", పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013** గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఇఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నివేదికలు నివేదించు వారి సంతకం(లు) పూర్తి పేరు(లు) మరియు పోస్టల్ చిరునామా(లు) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిఈపిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిఈపిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి మాట్లాడేది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2025-26 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచటమైనది:

ఏపిఈపిడిసిఎల్ - ఆ॥సం॥ 2025-26 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2025-26 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	1397.16	13	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	0.00
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	48.20	14	మొండి బకాయిలకు సదుపాయం	44.96
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు బదిలీ చేసిన నికర పంపిణీ ఖర్చు	2399.72	15	(N-2) సంవత్సరము (ఆ॥సం॥ 2023-24) : నియంత్రించలేని అంశముల విధింపు	413.86
4	పిజిసిఐఎల్ ఖర్చు	713.39			
5	యుఎల్‌డిసి ఖర్చు	1.96	16	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15)	18477.91
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి వ్యయం (1+2+3+4+5)	4560.43	17	సమగ్ర ఆదాయ అవశ్యకత (6+16)	23038.34
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	15940.72	18	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే ఆదాయము	17,582.85
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించదగిన పంపిణీ ఖర్చు	1212.35	19	టారిఫేతర ఆదాయము	508.34
9	వినియోగదారుల సెక్యూరిటీ డిపాజిట్ల మీద వడ్డీ	197.41	20	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయము / లోటు (18+19) - 17	-4947.14
10	రిటైల్ సరఫరా వ్యాపారములో సరఫరా మార్జిన్	23.72	21	ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ ద్వారా మారిన ఆదాయం	4848.04
11	ఇతర ఖర్చులు ఏవైనా ఉన్నట్లైతే	32.93	22	క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ మరియు గ్రిడ్ సపోర్ట్ చార్జీల ద్వారా ఆదాయం	99.1
12	పెన్షన్ బాండ్ల పై అదనపు వడ్డీ	611.96	23	నికర లోటు / మిగులు (20+21+22)	0.00

ఆర్థిక సంవత్సరం 2025-26 నకు లైసెన్స్‌దారులు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు టారిఫ్ షెడ్యూలు దిగువ తెలుపబడినది

కేటగిరి	వినియోగదారుని కేటగిరి	ఎల్ టి సరఫరా: స్థిర / డిమాండ్ చార్జీలు నెలకు (రూ॥ / హెచ్ పి లేక కిలో వాట్)	ఎల్ టి సరఫరా: ఎనర్జీ చార్జీలు (రూ॥ / యూనిట్)	జి.ఓ. ఆర్.టి. నెం. 161, తేదీ. 15-11-2021 ప్రకారం ప్రతిపాదించిన ఫుల్ కాస్ట్ రికవరీ చార్జీలు రూ॥/ యూనిట్: ఏపిఎస్‌పిడిసిఎల్	ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్	↔ బిల్లింగ్ యూనిట్	హెచ్ టి సరఫరా: స్థిర / డిమాండ్ చార్జీలు నెలకు (రూ॥/కెవిఎ)	హెచ్ టి సరఫరా ఎనర్జీ చార్జీలు (రూ॥ / యూనిట్): 11 కెవి	33 కెవి	132 కెవి	220 కెవి	జి.ఓ.ఆర్.టి. నెం. 161, తేదీ. 15-11-2021 ప్రకారం ప్రతిపాదించిన ఫుల్ కాస్ట్ రికవరీ చార్జీలు రూ॥/ యూనిట్
I	గృహ వినియోగం												
	(A) : గృహ వినియోగం (టెలిస్కోపిక్)												
	0-30	10	1.90	3.25	3.74	6.29	kWh	-	-	-	-	-	
	31-75	10	3.00	3.98	4.57	6.45	kWh	-	-	-	-	-	
	76-125	10	4.50	4.50	5.98	6.50	kWh	-	-	-	-	-	
	126-225	10	6.00	6.00	7.29	6.65	kWh	-	-	-	-	-	
	226-400	10	8.75	8.75	8.75	8.75	kWh	-	-	-	-	-	
	>400	10	9.75	9.75	9.75	9.75	kWh	-	-	-	-	-	
	నెల ఒక్కింటికి 500 యూనిట్లు పైబడి వినియోగిస్తున్న వినియోగదారులు స్మార్ట్ మీటర్లు ఎంపిక చేసుకోవచ్చును మరియు అట్టి వినియోగదారులకు ఉ.గం.10.00 నుండి మ.గం. 12.00 మధ్య వినియోగమునకు యూనిట్ ఒక్కింటికి రూ.1/- చొప్పున టిఓడి తగ్గింపు వర్తిస్తుంది.												
	బి) టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	–	–				kVAh	75	7.00	7.00	7.00	7.00	
II	వాణిజ్యము మరియు ఇతరములు												
	A (i) : వాణిజ్యము												
	0-50	75/kW	5.40	5.40	5.40	5.40	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	51-100		7.65	7.65	7.65	7.65	kWh/kVAh						
	101-300		9.05	9.05	9.05	9.05	kWh/kVAh						
	301-500		9.60	9.60	9.60	9.60	kWh/kVAh						
	500 యూనిట్లు పైబడి		10.15	10.15	10.15	10.15	kWh/kVAh						
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) పీక్ (సా॥ 6.00 నుండి రా॥ 10.00 వరకు)	-	-	-	-	-	kWh/kVAh		8.65	7.95	7.70	7.65	
	(ii) ప్రకటన హోర్డింగులు	100	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	-	-	-	-	
	(iii) ఫంక్షన్ హాల్‌లు / ఆడిటోరియంలు	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
	(బి): స్టార్టప్ పవర్	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
	(సి): విద్యుత్ వాహనాలు (ఇవిలు) / చార్జింగ్ స్టేషన్‌లు	-	6.70	6.70	6.70	6.70	kWh/kVAh	-	6.70	6.70	6.70	6.70	
	(డి) : గ్రీన్ పవర్	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
III	పరిశ్రమలు												
	(ఎ) : పరిశ్రమలు (సాధారణ)	75/kW	6.70	6.70	6.70	6.70	kWh/kVAh	475	-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (అధిక గ్రిడ్ డిమాండ్) (ఫిబ్రవరి 26 -మార్చి 26), (ఏప్రిల్ 25-మే 25) & (సెప్టెంబర్ 25-అక్టోబర్ 25)												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-			7.80	7.35	6.90	6.85	
	ఆఫ్-పీక్ (10-15) & (00-06)	-	-	-	-	-			5.55	5.10	4.65	4.60	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-			6.30	5.85	5.40	5.35	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (తక్కువ గ్రిడ్ డిమాండ్) (జూన్ 25-ఆగస్టు 25), & (నవంబర్ 25-జనవరి 26))												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-			7.30	6.85	6.40	6.35	
	ఆఫ్-పీక్ (10-15) &(00-06)	-	-	-	-	-			5.55	5.10	4.65	4.60	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-			6.30	5.85	5.40	5.35	
	పరిశ్రమల కాలనీలు	-	-	-	-	-	kWh/kVAh	-	7.00	7.00	7.00	7.00	
	(బి) : సీజనల్ పరిశ్రమలు (ఆఫ్ సీజన్)	75/kW	7.45	7.45	7.45	7.45	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(సి) : ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	-	-	-	-	-	kWh/kVAh	475	5.80	5.35	4.95	4.90	
	(డి) : కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు*	20/kW	3.75	3.75	3.75	3.75	kWh	-	-	-	-	-	
	*-గవర్నమెంట్ జారీ చేసిన ఉత్తర్వులు సూచిక జి.ఒ. నెం. 75, తేది. 27-06-2018 ప్రకారం ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరాను విస్తరించాలి												
IV	ఇన్‌స్టిట్యూషనల్												
	(ఎ) : యుటిలిటీలు (వీధి దీపాలు, యన్.టి.ఆర్. సుజల పథకం, సిపిడబ్ల్యూయస్ మరియు పిడబ్ల్యూయస్)	75/kW	7.00	7.00	7.00	7.00	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(బి) : సాధారణ ప్రయోజనాలు	75/kW	7.00	7.00	7.00	7.00	kWh/kVAh	475	7.95	7.25	7.00	6.95	
	(సి) : మత సంబంధమైన ప్రదేశాలు	30/kW	5.00	5.00	5.00	5.00	kWh/kVAh	30	5.00	5.00	5.00	5.00	
	(డి) : రైల్వే ట్రాక్షన్		-				kVAh	350	6.50	6.50	6.50	6.50	
V	వ్యవసాయము మరియు సంబంధిత												
	(ఎ) వ్యవసాయం												
	(i) కార్పొరేట్ రైతులు	-	3.50	3.50	7.79	7.70	kWh	-	-	-	-	-	
	(ii) కార్పొరేట్ రైతులు కానివారు	-	-	7.67	8.09	7.88	-	-	-	-	-	-	
	(iii) ఉప్పు తయారీ కేంద్రాలు 15 హెచ్ పి వరకు	-	2.50	2.50	7.60	7.73	kWh/kVAh	-	-	-	-	-	
	(iv) చెఱకు గానుగ	-	-	7.67	8.17	7.83	-	-	-	-	-	-	
	(v) గ్రామీణ ఉద్యానవన నర్సరీలు	-	-	7.67	7.48	7.82	-	-	-	-	-	-	
	(vi) : ఫ్లోరీ కల్చర్ ఇన్ గ్రీన్ హౌస్	75/kW	4.50	4.50	5.99	7.64	kWh/kVAh	-	-	-	-	-	
	(బి) : ఆక్వా కల్చర్ మరియు పశు సంవర్ధన	30/kW	3.85	3.85	7.53	7.57	kWh/kVAh	30	3.85	3.85	3.85	3.85	
	(డి) : వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు	20/kW	3.75	3.75	7.70	7.33	kWh	-	-	-	-	-	
	(ఇ) : ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	-	6.40	6.40	7.80	6.40	kVAh	-	7.15	7.15	7.15	7.15	
గమనిక	(i) తాత్కాలిక సరఫరా: తాత్కాలిక సరఫరా కొరకు విడిగా కేటగిరి లేదు, అయినప్పటికీ, ప్రతి కేటగిరికి వర్తించు నియమ నిబంధనలతో సంబంధిత కేటగిరిలో తాత్కాలిక సరఫరా విడుదల చేయటం జరుగుతుంది. (ii) హెచ్‌టి సరఫరాలేదా యల్‌టి సరఫరా నందు నిర్వచించబడని కేటగిరిలకు కేటగిరి ii(A)(i) - వాణిజ్య సూచించిన రేట్లతో బిల్లు చేయబడతాయి. (iii) అన్ని ఇతర షరతులు ఆర్థిక సంవత్సరం 2024-25 యొక్క రిటైల్ సరఫరా ఉత్తర్వులోని చాప్టర్- x ప్రకారం ఉంటాయి.												

(చివరి నిలువు వరుసలో:) ఏపిఎస్‌పిడిసిఎల్, ఏపిసిపిడిసిఎల్, ఏపిఈపిడిసిఎల్‌లకు సంబంధించి అన్ని హెచ్‌టి కేటగిరి ఎనర్జీ ఛార్జీలు సమానంగా ఫుల్‌కాస్ట్ రికవరీ ఛార్జీలు ఉంటాయి.

ఆర్థిక సంవత్సరం 2025-26 కొరకు ప్రతిపాదించిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ ధరలు క్రింద తెలుపబడినవి

కేటగిరి		హెచ్‌టి సరఫరా	ఏపిఎస్‌పిడిసిఎల్ సియస్‌యస్ (రూ॥ / యూనిట్)	ఏపిసిపిడిసిఎల్ సియస్‌యస్ (రూ॥ / యూనిట్)	ఏపిఈపిడిసిఎల్ సియస్‌యస్ (రూ॥ / యూనిట్)
11 కె.వి.వద్ద					
I	B	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	0.39	0.58	0.46
II	A (i)	వాణిజ్యము	2.14	2.18	2.20
II	A (iii)	ఫంక్షన్ హాల్‌లు / ఆడిటోరియంలు	2.45	2.45	2.45
II	B	స్టార్టప్ పవర్	2.45	2.45	2.45
II	D	గ్రీన్ పవర్	2.45	-	-
III	A	పరిశ్రమలు (సాధారణ)	1.86	1.95	1.55
III	B	సీజనల్ పరిశ్రమలు	2.44	2.35	0.05
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	1.24	1.83	--
IV	A	యుటిలిటీలు	1.93	1.82	1.84
IV	B	సాధారణ ప్రయోజనాలు	2.32	2.19	2.20
V	E	ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	0.03	0.20	0.20
33 కె.వి.వద్ద					
I	B	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	1.48	1.60	1.39
II	A (i)	వాణిజ్యము	2.11	1.86	1.99
II	B	స్టార్టప్ పవర్	2.45	2.45	2.45
II	D	గ్రీన్ పవర్	2.45	-	-
III	A	పరిశ్రమలు (సాధారణ)	1.34	1.55	1.42
III	B	సీజనల్ పరిశ్రమలు	2.01	3.51	1.92
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.10	--	0.58
IV	A	యుటిలిటీలు	1.80	--	2.28
IV	B	సాధారణ ప్రయోజనాలు	1.78	1.78	-
V	E	ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	0.98	1.15	1.17
132 కె.వి.వద్ద					
II	A (i)	వాణిజ్యము	1.74	--	1.76
II	B	స్టార్టప్ పవర్	2.45	2.45	2.45
III	A	పరిశ్రమలు (సాధారణ)	1.15	1.48	1.37
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.23	0.34	0.20
IV	D	రైల్వే ట్రాక్షన్	1.63	1.55	1.54
V	E	ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	1.43	1.43	-
220 కె.వి.వద్ద					
II	A (i)	వాణిజ్యము	--	--	1.55
II	B	స్టార్టప్ పవర్	--	--	2.45
III	A	పరిశ్రమలు (సాధారణ)	1.43	1.87	1.06
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	--	--	0.20
IV	D	రైల్వే ట్రాక్షన్	1.72	-	-
V	E	ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	1.43	--	1.43

5. కమీషన్ బహిరంగ విచారణను హైబ్రిడ్ పద్ధతి (అనగా వ్యక్తిగతంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) నిర్వహించవలెనని నిర్ణయించినది. బహిరంగ విచారణలు మూడు డిస్కంలకు కలిపి 07.01.2025, 08.01.2025 లలో ఏ. కన్వెన్షన్ సెంటర్, బృందావన్ కాలనీ, విజయవాడ - 10 మరియు 10.01.2025 తేదీన కార్యాలయ సమావేశ మందిరము (గ్రౌండ్ ఫ్లోర్) కర్నూలు నందు ఉదయం 10.30 గంటల నుండి మ॥ 01.00 వరకు మరియు మ॥ గం. 2.00 నుండి సా॥ గం. 04.30 వరకు జరుపబడును.

గమనిక : ఉదయపు సభాకాలము ఉ.గం॥ 10.30 నుండి మ॥ గం. 01.00 వరకు వ్యక్తిగతంగాను మరియు మ॥ 02.00 వరకు మరియు సా॥ గం॥ 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారాను జరుపబడును. ప్రతిరోజు బహిరంగ విచారణ షెడ్యూల్ దిగువ ఇవ్వబడినది.

07.01.2025 విజయవాడ

10:30 AM to 10:35 AM	కమీషన్ సెక్రటరీ ప్రారంభ వ్యాఖ్యలు
10:35 AM to 10:40 AM	గౌరవ చైర్మన్ ఏ.పి.ఇ.ఆర్.సి వారి ప్రారంభ వ్యాఖ్యానం
10:40 AM to 11:30 AM	డిస్కంల నివేదిక
11:30 AM to 01:00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	విరామం
02:00 PM to 04:30 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

08.01.2025 విజయవాడ

10:30 AM to 01.00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	విరామం
02:00 PM to 04:30 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

10.01.2025 కర్నూలు

10:30 AM to 1.00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	విరామం
2.00 PM to 3.00 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
03:00 PM to 04:30 PM	సిఎండి / డిస్కంల ప్రతిస్పందన

గమనిక : అభ్యంతరదారులు పైన తెలిపిన షెడ్యూల్ సూచనాత్మకం అని గమనించగలరు. అవసరమైతే, విచారణలోని అత్యవసరముల ఆధారంగా కమీషన్ షెడ్యూల్ను మార్చవచ్చును.

(6) బహిరంగ విచారణలో వీడియో కాన్ఫరెన్స్/ వ్యక్తిగతంగా పాల్గొను ఆసక్తి కల సభ్యులు తమ ఉద్దేశాన్ని ముందస్తుగా డిస్కంకు తెలియజేస్తూ కమీషన్ కు నకలు సమర్పించవలెను. ఆ ఉద్దేశంలో సభ్యుడు సమీపంలోని ఏ కార్యనిర్వాహక ఇంజనీరు / డివిజనల్ ఇంజనీరు కార్యలయము నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన అభిప్రాయములను సమర్పించాలనుకుంటున్నారో ఆ కార్యాలయమును తెలియజేయాలి. ఆ ఉద్దేశములో ఏ తేదీన విచారణలో పాల్గొనదలచు కున్నారో కూడా తెలియజేయాలి. (7) రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ దృక్పథం (ఆలోచన) వ్యక్తపరచే అభ్యంతరదారులు జాబితాను కమీషన్ తమ వెబ్ సైట్ నందు ఉంచుతుంది. (8) తమ మౌఖిక సమర్పణలు చేయుటకు ఇంతకు మునుపు తెలియచేయని వ్యక్తుల నుండి ఏదైనా డిఇ/ఇఇ ఆఫీసుకు అభ్యర్థనలు అందితే వాటిని షెడ్యూలులోని అభ్యంతరములు విన్న తరువాత విచారణ రోజున సంబంధిత డిఇ/ఇఇ వీడియో సమావేశం ద్వారా కమీషన్ కు తెలియపరుస్తారు. కమీషన్ అనుమతించినచో అట్టి వ్యక్తులు సమర్పణలు చేయవచ్చును. డిస్కం సమావేశపు లింకును ఏర్పాటు చేసి, ప్రజలు డిఇ/ఇఇ కార్యాలయమునకు వెళ్ళనవసరము లేకుండా తమ వ్యక్తిగత ఉపకరణముల ద్వారా అభ్యంతరములను వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో సమర్పించుటకు పత్రికలలో వేరుగా ఆ లింకు ప్రచురించబడును. (9) కమీషన్ వారు ఎ. కన్వెన్షన్ సెంటర్, బృందావన్ కాలనీ, విజయవాడలో రెండు రోజులు (అనగా 07.01.2025 మరియు 08.01.2025) మరియు కార్యాలయము, కర్నూలులోని సమావేశ మందిరములో ఒకరోజు (అనగా 10.01.2025) సమావేశమగుదురు. (10) బహిరంగ విచారణలు ప్రత్యక్ష ప్రసారం చేయబడతాయి. ప్రత్యక్ష ప్రసారమును వీక్షించే పద్ధతి మరియు విధాన ము విడిగా ప్రింట్ / ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచురించబడుతుంది.

తేదీ: 07-12-2024 ప్రదేశం: తిరుపతి చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్	తేదీ: 07-12-2024 ప్రదేశం: విజయవాడ చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్ ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్	తేదీ: 07-12-2024 ప్రదేశం: విశాఖపట్నం చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

నేనడిగితేనే శిందే 'డిప్యూటీ'గా ఉండేందుకు అంగీకరించారు..

» బీజేపీ వద్దే హోం శాఖ: ఫడణవీస్



ముంబై, డిసెంబరు 6: ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందు శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందేతో భేటీ అయ్యాయని.. తానడిగితేనే శిందే డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించారని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ చెప్పారు. మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత మహాయుతి తొలి సమావేశంలో సీఎంగా బీజేపీ వారే ఉండేందుకు శిందే అంగీకరించారు. అయితే శివసేనలోని ఓ వర్గం మాత్రం.. తమ పార్టీ నుంచే సీఎం కావాలని కోరుకుంది. శిందేను నేను కలిసి మాట్లాడాక డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించారు. ఇంకా ఏ శాఖ కావాలన్నది శిందే డిమాండ్ చేయలేదు. ఈ నెల 16 లోపు క్యాబినెట్ విస్తరణ ఉంటుంది. దాదాపు అన్ని శాఖలపై ఏకాభిప్రాయానికి వచ్చాం.. హోంశాఖ ఎప్పుడూ బీజేపీ వద్దే ఉంటుంది. కేంద్రంలో హోంశాఖ బీజేపీ వద్ద ఉన్న నేపథ్యంలో సమన్వయం చేసుకోవడానికి సులభతరమవుతుంది' అని వ్యాఖ్యానించారు.

ప్రిన్సిపాల్‌ను కాల్చి చంపిన విద్యార్థి

» మధ్యప్రదేశ్‌లో ఘటన.. మృతుడి బైక్‌పైనే విద్యార్థి పరార్

భోపాల్, డిసెంబరు 12: మధ్యప్రదేశ్‌లో ఘోరం జరిగింది. ఓ పాఠశాల ప్రిన్సిపాల్‌ను 12వ తరగతి చదువుతున్న విద్యార్థి కాల్చి చంపాడు. అనంతరం మరో విద్యార్థితో కలిసి ప్రిన్సిపాల్ బైక్ తీసుకొని అక్కణ్నుంచి పరారయ్యాడు. సురేంద్రకుమార్ సక్సెనా(55) అనే వ్యక్తి ఛత్తర్‌పూర్ జిల్లాలోని ధామోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం టాయిలెట్‌కు వెళ్తుండగా ఆయనను అనుసరించిన నిందితుడు తుపాకీతో కాల్చాడు. బుల్లెట్ తలలోకి దూసుకెళ్లడంతో ప్రిన్సిపాల్ అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరు నిందితుల ప్రవర్తన సక్రమంగా ఉండేది కాదని పాఠశాల సిబ్బంది చెప్పారు.


చిలీ మాజీ అధ్యక్షురాలికి ఇందిర శాంతి బహుమతి



న్యూఢిల్లీ, డిసెంబరు 6: చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెలీ బాచెలెట్‌కు ఇందిరా గాంధీ శాంతి బహుమతి-2024 దక్కింది. అంతర్జాతీయంగా మానవ హక్కులు, శాంతి, సమానత్వం కోసం ఆమె చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ మీడియాకు వెల్లడించింది. మిచెలీ బాచెలెట్ గతంలో ఐక్యరాజ్య సమితి మహిళా కమిషన్, మానవ హక్కుల సంఘంకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. లింగ సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం గళమెత్తారు.

రేవతి కుటుంబానికి రూ.25 లక్షలు

» దాంతోపాటు.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా: అల్లు అర్జున్



హైదరాబాద్, డిసెంబరు 6: పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంపై చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామంటూ ఒక వీడియో విడుదల చేశారు. 20 ఏళ్లుగా ఆనవాయితీగా థియేటర్‌కు వెళ్లి అభిమానులతో సినిమా చూస్తున్నానని.. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఏమీ జరగలేదని.. అనూహ్యంగా ఇప్పుడు జరిగిన ఘటన తమను కలచివేసిందని అందులో పేర్కొన్నారు. రేవతి మరణవార్త తెలియగానే తామంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని చెప్పారు. "రేవతి కుటుంబానికి.. మా ప్రగాఢ సానుభూతి. మేమేం చేసినా.. ఎంత మాట్లాడినా.. ఆ లోటు పూరించలేనిది" అని ఆవేదన వెలిబుచ్చారు. "మీకు మేమున్నాం. మావైపు నుంచి మీకు ఏ సాయం కావాలన్నా.. మా శక్తి మేరకు చేస్తాం. నా తరఫు నుంచి రూ.25 లక్షలు వారి భవిష్యత్తు కోసం ఇవ్వాలనుకుంటున్నాను. ఈ డబ్బుతో సంబంధం లేకుండా.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా. ఆ కుటుంబం బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. "మేము సినిమా తీసేది ప్రేక్షకులను సంతోషపెట్టాలనే. మీరంతా కుటుంబాలతో కలిసి థియేటర్లకు వచ్చి, చూసి ఆనందించాలనే. కాబట్టి, సినిమా చూడ్డానికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఎంజాయ్ చేయండి. తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లండి" అని తన అభిమానులకు, ప్రేక్షకులకు హితవు పలికారు.

ఇక బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వం: కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇక నుంచి విడుదలయ్యే సినిమాలకు 'బెనిఫిట్ షో'లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వబోమని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సంధ్య థియేటర్‌లో 'పుష్ప-2' ప్రీమియర్ షో చూడ్డానికి వెళ్లిన రేవతి అనే మహిళ.. అక్కడ తొక్కిసలాటలో చనిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతి తనను ఎంతగానో కలచివేసిందన్నారు. బెనిఫిట్ షో ప్రదర్శించే సమయంలో సినిమా హీరోలు థియేటర్లకు వెళ్లడం సమంజసమేనా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

74 ఏళ్ల వయస్సులో గుడ్డు పెట్టిన పక్షి



హొనలులూ, డిసెంబరు 6: చిత్రంలో కనిపిస్తున్న పక్షి పేరు విజ్‌డమ్. ఇదో సముద్రపు పక్షి(ఇంగ్లి‌ష్‌లో దీనిని లేసన్ ఆల్బాట్రాస్ అంటారు). ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ వయస్సు కలిగిన సముద్రపు పక్షిగా ఇది రికార్డులకెక్కింది. దీని వయస్సు 74ఏళ్లు. అయితే, ఇక్కడ విచిత్రం ఇది మాత్రమే కాదు. ఈ వయసులోనూ అది గుడ్డు పెట్టింది. కొన్ని రోజుల్లో పిల్లను కనబోతోంది. ఈ పక్షుల సగటు జీవిత కాలం 68ఏళ్లే. విజ్‌డమ్ 74ఏళ్లు జీవించడమే రికార్డు అనుకుంటే.. ఈ వయస్సులో అది గుడ్డు పెట్టి పిల్లను కనబోతుండటం మరో గొప్ప విశేషం. విజ్‌డమ్ హవాయీ దీవుల్లోని ఓ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో అధికారుల పర్యవేక్షణలో ఉంది. లేసన్ ఆల్బాట్రాస్ పక్షులు ఏడాదికొకసారి ఒక్క గుడ్డు మాత్రమే పెడతాయి.

మళ్లీ రైతాంగం భగ్గు

శంభు నుంచి ఢిల్లీకి 101 మంది రైతుల పాదయాత్ర.. బారికేడ్లు పెట్టి ఆపేసిన పోలీసులు

» వాటిని తొలగించి ముందుకు సాగేందుకు అన్నదాతల యత్నం

» అడ్డుకున్న పోలీసులు.. బాష్పవాయువు ప్రయోగం.. 8మంది రైతులకు గాయాలు




బారికేడ్లను తొలగిస్తున్న రైతులు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు కేంద్రం చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో రైతన్న మరోసారి గర్జించాడు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు శిబిరం నుంచి రైతులు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా పాదయాత్ర (జాతా) ప్రారంభించారు. కొంత దూరం సాగగానే హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. అయినా రైతులు అడుగు ముందుకేశారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఎనిమిది మంది రైతులు గాయపడ్డారు. దరివిలా పాదయాత్రను శుక్రవారం ఒక్కరోజు నిలిపివేస్తున్నట్లు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. అంతకు ముందు ఉదయం 101 మంది రైతులు తమ సంఘాల జెండాలను చేతబట్టి 'చలో ఢిల్లీ' పాదయాత్ర మొదలుపెట్టారు. అయితే పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి.. బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. 'సత్నాం వాహెగురూ' అని నినదిస్తూ రైతులు ముందుకు కదిలారు. బారికేడ్లను వారిలో కొందరు తొలగించారు. ఇనుప వలను గగ్గర్ నదిపై నిర్మించిన వంతెనపైకి విసిరేశారు. అయితే తొలి అంచె వరకే వారు ముందుకెళ్లగలిగారు. ఆ తర్వాత వారు అడుగు కూడా వేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఓ రైతు సాహసంతో పోలీసు బలగాలు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక షెడ్‌పైకి ఎక్కాడు. టియర్ గ్యాస్ గోళాల ప్రయోగంతో పొగ సోకకుండా చాలా మంది రైతులు గోనె సంచులను కళ్లు, నోటికి అడ్డుపెట్టుకుని అటూ ఇటూ పరుగులు తీశారు. పోలీసులు నీటి ఫిరంగి వాహనాలను కూడా మోహరించారు. అంబాలా జిల్లా అంతటా నిషేధాజ్ఞలు విధించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. యాత్ర సాగే తొమ్మిది గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేశారు. దీంతో శుక్రవారం యాత్రను సస్పెండ్ చేస్తున్నట్లు రైతు సంఘం నేత సర్వన్‌సింగ్ పంధేర్ ప్రకటించారు. గాయపడిన ఆరుగురు రైతులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తాయన్నారు. ట్రాక్టర్-ట్రాలీలను తీసుకురాకుండా యాత్ర చేపడితే తమకు అభ్యంతరం లేదని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన బీజేపీ నేతలు ప్రకటించారని.. ఇప్పుడు పాదయాత్రను కూడా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఇంకోవైపు.. ఖనౌరీ వద్ద చేపట్టిన తన ఆమరణ దీక్షను సంయుక్త కిసాన్ మోర్చా నేత జగ్జీత్‌సింగ్ దల్లెవాల్ శుక్రవారం కూడా కొనసాగించారు.

రైతుల డిమాండ్లు ఇవీ..

కనీస మద్దతు ధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని.. రైతు రుణాలను మాఫీ చేయాలని.. రైతులకు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని.. అన్నదాతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని.. కరెంటు చార్జీలు పెంచకూడదని.. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని.. 2020-21లో ఉవ్వెత్తున జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని.. యూపీలోని లఖీంపూర్ ఖేరీలో 2021లో చోటుచేసుకున్న హింసాకాండ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు శంభు, ఖనౌరీ వద్ద మకాం వేసి ఉద్యమిస్తున్నారు. ఫిబ్రవరి 18న కేంద్రప్రభుత్వ ప్రతినిధులు వారితో చర్చలు జరిపారు. ఆ తర్వాత వారి వద్దకు ఎవరూ రాలేదు. కాగా.. 'చలో ఢిల్లీ' యాత్రకు జైరాం రమేశ్ మద్దతు ప్రకటించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలన్నారు.



తెలంగాణలోనే సిజేరియన్లు ఎక్కువ

మొత్తం ప్రసవాల్లో 60.7% సిజేరియన్లు

దేశవ్యాప్తంగా చూస్తే ఇది 21.5 శాతమే

న్యూఢిల్లీ, డిసెంబరు 6: తెలంగాణలో మొత్తం ప్రసవాల్లో 60.7% సిజేరియన్లేనని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ఆధారంగా ఢిల్లీలోని జార్జ్ ఇన్‌స్టిట్యూట్ జరిపిన అధ్యయనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా చూస్తే ఇది 21.5శాతంగా ఉన్నట్లు తెలిపింది. దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15-49 ఏళ్ల వయసు ఉన్న 7.2 లక్షల మంది మహిళల ప్రసవ వివరాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ వివరాలు ద లాన్సెట్ రీజనల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. దేశంలోని ప్రతి అయిదుగురిలో ఒకరు సీజేరియన్ (సి-సెక్షన్) ఆపరేషన్ ద్వారానే జన్మిస్తున్నారు. ఈ శస్త్రచికిత్సలు ఎక్కువ శాతం ప్రయివేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారే ఈ ఆపరేషన్లవైపు మొగ్గు చూపుతున్నారు. సిజేరియన్లలో రాష్ట్రాల వారీగా బాగా తేడాలు ఉన్నాయి. నాగాలాండ్‌లో 5.2 శాతం మేర సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండగా, తెలంగాణకు ఏకంగా 60.7 శాతం శాతం మేర ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండడం, ఆర్థిక స్తోమత, సహజ ప్రసవాలంటే భయం, బిడ్డ జననానికి ముహూర్తాలు చూసుకోవడం వంటి అంశాలు సిజేరియన్ల వైపు మొగ్గు చూపడానికి కారణాలవుతున్నాయి. బిహార్ వంటి పేద రాష్ట్రాల్లో డాక్టర్లు సి-సెక్షన్ ఆపరేషన్లు చేయాలని చెప్పినా అక్కడి వారు మాత్రం సహజ ప్రసవాలనే కోరుకుంటున్నారు. కాగా, 2019-21 సంవత్సరాల్లో ఆస్పత్రుల్లోని సమాచారం ఆధారంగా జాతీయ ఆరోగ్య సర్వే నిర్వహించారు.

బోర్డర్‌లో బంగ్లాదేశ్ కవ్వింపు

సరిహద్దులో కిల్లర్ డ్రోన్లను మోహరించిన పొరుగుదేశం

అప్రమత్తమైన భారత్.. నిఘా పెంపు

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సరిహద్దుల్లో బంగ్లాదేశ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. పశ్చిమ బెంగాల్‌కు సమీపంలో అత్యాధునిక బేరక్తర్ టీబీ2 డ్రోన్లను మోహరించింది. దీంతో వెంటనే అప్రమత్తమైన భారత్ సరిహద్దులో నిఘా పెంచింది. అయితే షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తర్వాత సరిహద్దు వెంట ఉగ్రవాద చర్యలు పెరుగుతున్నాయనే ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో ఆ డ్రోన్లను మోహరించినట్లు బంగ్లాదేశ్ చెబుతోంది. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, మన సరిహద్దుల భద్రత, రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సన్నద్ధంగా ఉన్నామని సీనియర్ రక్షణ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు భారత నిఘా వర్గాలు కూడా బోర్డర్ వెంట పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. హసీనా ప్రభుత్వ హయాంలో అణిచివేసిన ఉగ్రవాదులు ఇప్పుడు మళ్లీ సరిహద్దు సమీపంలో శక్తిపుంజుకుంటున్నారని నిఘా నివేదికలు వెల్లడిస్తున్నాయి. బోర్డర్ వెంట భారత్ వ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఓ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, కోల్‌కతాలో తాత్కాలిక డిప్యూటీ హైకమిషనర్ సిక్దర్ మొహమ్మద్ అష్రఫుర్ రెహమాన్, త్రిపురలోని డిప్యూటీ హైకమిషనర్ ఆరిఫుర్ రెహ్మాన్‌లను వెంటనే వెనక్కి వచ్చేయాలని బంగ్లాదేశ్ ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు నిరసనగా త్రిపుర రాజధాని అగర్తలలో తమ కార్యాలయం వద్ద హిందూ సంఘాల ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

9న బంగ్లాకు విదేశాంగ కార్యదర్శి

బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడుల నేపథ్యంలో ఆ దేశంతో చర్చలకు భారత్ సిద్ధమైంది. ఈనెల 9న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఆ దేశ విదేశాంగ కార్యదర్శితో చర్చలు జరుపుతారు. ఆ పర్యటనలో మరింత మంది అధికారులతో కూడా భేటీ అవుతారు. ఇరు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు సాగుతాయనే ఆశాభావంతో ఉన్నట్లు విదేశీ వ్యవహారాల ప్రతినిధి జైశ్వాల్ చెప్పారు.



చేతులు పట్టుకుని.. చలోక్తి విసిరి..

» పార్లమెంటు ఆవరణలో మోదీ, ఖర్గే సరదా ముచ్చట

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సభలో ఎన్ని వాగ్యుద్ధాలు చేసుకున్నా.. వేరే సందర్భాల్లో కలుసుకున్నప్పుడు రాజకీయ నాయకులు సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం సహజమే! శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో అలాంటి దృశ్యమే కనిపించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో సర్కారు 'మహా పరినిర్వాణ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు.. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా, ఆ సమయంలో ఖర్గే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఆయనతో కరచాలనం చేశారు. ఖర్గే ఏం చలోక్తి విసిరారో ఏమోగానీ.. మోదీ పెద్దగా నవ్వారు. వారిద్దరూ అలా చేతులు పట్టుకుని, కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజ్యసభలో నోట్ల కట్ట!

» తెలంగాణ ఎంపీ సింఘ్వీ సీటు వద్ద లభ్యం

» భద్రతా తనిఖీల్లో లభ్యమైందన్న చైర్మన్

» ఆ డబ్బులు నావి కావు: అభిషేక్ సింఘ్వీ



న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో సంచలన ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీ అభిషేక్ సింఘ్వీకి కేటాయించిన సీటు నంబర్ 222 వద్ద ఒక నోట్ల కట్ట లభ్యమైందని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం సభ వాయిదా పడగానే భద్రతా దళాలు నిర్వహించిన రోజువారీ తనిఖీల్లో సింఘ్వీ కూర్చునే సీటు వద్ద నోట్ల కట్ట కనిపించిందని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే నిబంధనల ప్రకారం దర్యాప్తునకు ఆదేశించానని చెప్పారు. దీనిపై సింఘ్వీ స్పందించారని, ఈ విషయాన్ని తాను మొదటిసారి వింటున్నానని చెప్పారని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. తాను సభకు వచ్చినప్పుడల్లా కేవలం రూ.500 నోటు మాత్రమే తీసుకువస్తానని సింఘ్వీ చెప్పినట్లు తెలిపారు. మరోవైపు సింఘ్వీ 'ఎక్స్'లోనూ, మీడియా వద్ద వివరణ ఇచ్చారు. గురువారం తాను సభకు వచ్చిన మూడు నిమిషాలకే వాయిదా పడటంతో క్యాంటీన్‌కు వెళ్లానని అన్నారు. ఆ తర్వాత అటు నుంచే బయటకు వెళ్లానని చెప్పారు. ఎంపీ సీటులో ఎవరైనా ఏమైనా పెట్టవచ్చునని వ్యాఖ్యానించారు. కాగా, దర్యాప్తు జరిగి ఎవరు డబ్బు పెట్టారో తేలనంతవరకూ ఎంపీ పేరును ప్రస్తావించకూడదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. చైర్మన్‌ను కోరారు. కానీ, బీజేపీ అభ్యంతరం తెలిపింది. డబ్బు ఎక్కడ దొరికిందో తేలినప్పుడు ఆ ఎంపీ పేరును ఎందుకు ప్రకటించకూడదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రశ్నించారు. అయితే పార్లమెంట్‌లో కీలకమైన చర్చల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. రైతుల సమస్య, మోదీ-అదానీ కుంభకోణంపై చర్చ జరగకుండా పక్కదారి పట్టించేందుకే నోట్ల కట్ట దొరికిందంటూ హంగామా చేస్తున్నారని మండిపడ్డారు. పైగా ఆ నోట్ల కట్ట విలువ రూ.50 వేలే ఉంటుందన్నారు. ఎవరి వద్దనైనా రూ.50 వేల కట్ట దొరికితే అందులో నేరం ఏముందని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏ ఏజెన్సీతోనైనా దర్యాప్తు చేయించుకోవచ్చని, జేపీసీ కూడా వేయవచ్చునని కాంగ్రెస్ నేతలు రాజ్యసభ చైర్మన్‌ను కలిసి చెప్పినట్లు తెలిసింది.

మణిపూర్‌లో సత్వరమే పర్యటించండి

» శాంతి స్థాపనకు అదే మార్గం

» ప్రధానికి ఇండియా కూటమి డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 6: అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో సత్వరమే పర్యటించాలని ప్రధాని మోదీని ఇండియా కూటమి డిమాండు చేసింది. ప్రధాని నేరుగా జోక్యం చేసుకుంటేనే శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అభిప్రాయపడింది. ఇండియా కూటమిలోని పది పార్టీల నాయకులు శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తాము జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామంటే అనుమతి ఇవ్వలేదని తెలిపారు. దాంతో ప్రధాని కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మేఘచంద్ర మాట్లాడుతూ తమ రాష్ట్రం కూడా భారత్‌లో అంతర్భాగమేనని, 18 నెలలుగా హింస నెలకొన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. 60వేల మంది సహాయ శిబిరాల్లో ఉన్నారని, ఇంకెంతమంది ఇబ్బందులు పడాలని ప్రశ్నించారు. మణిపూర్‌లో 'అప్రకటిత రాష్ట్రపతి పాలన' కొనసాగుతోందని, సీఎం కాగితం పులిలా విగిలిపోయారని విమర్శించారు. మణిపూర్ ఇండియా కూటమి కన్వీనర్ క్షేత్రిమయుం శాంతా మాట్లాడుతూ శాంతి స్థాపన కోరుతూ ధర్నా చేసేందుకు 3,000 కి.మీ.దూరం నుంచి వస్తే అనుమతి నిరాకరించారని తెలిపారు. రెండేళ్లుగా హింస కొనసాగుతున్నా ప్రధాని మోదీ మణిపూర్‌ను సందర్శించలేదని విమర్శించారు.

కేంద్ర మంత్రులు700 సార్లు పర్యటించారు

ఈశాన్య రాష్ట్రాల అందాలను పరిచయం చేయడానికి ఢిల్లీలో నిర్వహించిన అష్టలక్ష్మి మహోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఓట్లు లేవన్న కారణంతో గత ప్రభుత్వాలు ఆ ప్రాంతాన్ని పట్టించుకోలేదని చెప్పారు. తమ ప్రభుత్వం హయాంలో గత పదేళ్లుగా కేంద్ర మంత్రులు 700 సార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించారని తెలిపారు. ఆ ప్రాంతం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.


రఘురామ కేసులో కుట్ర సుస్పష్టం

» సూపరింటెండెంట్ ఒత్తిడి మేరకే తప్పుడు నివేదిక

» సీఐడీ చీఫ్, సూపరింటెండెంట్‌ల పాత్రపై ఆధారాలు

» సీఐడీ కార్యాలయ సిబ్బందిని విచారిస్తున్న అధికారులు

» విజయ్‌పాల్ కస్టడీ పిటిషన్‌పై 9న కోర్టులో వాదనలు



గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నాటి ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలు, ఐపీఎస్ అధికారుల ఓవరాక్షన్.. సీఐడీ అధికారుల యాక్షన్... ఫలితంగా నాటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత ఉపసభాపతి రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని స్పష్టమైంది. ఈ కేసులో కుట్ర కోణాన్ని ఆధారాలతో సహా ఛేదించి నిందితులకు ఉచ్చు బిగించే దిశగా దర్యాప్తు సాగుతోంది. ఈ కేసులో కీలక నిందితుడు(ఏ4) రావెల విజయ్ పాల్‌ను గతనెల 26న ప్రకాశం ఎస్పీ విచారించిన అనంతరం అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన గుంటూరు జిల్లా జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో విజయ్‌పాల్‌ను ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణను కోర్టు ఈ నెల 9కి వాయిదా వేసింది. రఘురామను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన కేసులో సుమారు 30 మంది సాక్షుల వాంగ్మూలాలను దర్యాప్తు అధికారులు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం రఘురామపై కస్టోడియల్ టార్చర్ వాస్తవమేనని నిర్ధారించారు. రఘురామను చిత్రహింసలకు గురిచేస్తున్నప్పుడు వీడియో కాల్‌చేసిన వ్యక్తి ఎవరనే దానిపై విచారణ అధికారులకు కొంత స్పష్టత వచ్చినప్పటికీ, పక్కా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో నాటి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతి పక్కాగా ఇరుక్కున్నారు. రఘురామ ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, అంతా సాధారణంగానే ఉన్నట్లు కోర్టుకు తప్పుడు నివేదిక పంపారు. ఆ తర్వాత హైదరాబాదులోని మిలిటరీ ఆసుపత్రిలో జరిగిన వైద్య పరీక్షల్లో రఘురామ కాలి వేలు ఎముక విరిగిందని, అరికాలిపై కమిలిన గాయాలు ఉన్నాయని అక్కడి వైద్యులు కోర్టుకు నివేదించారు. గత మూడు, నాలుగు రోజులుగా ప్రకాశం ఎస్పీ కార్యాలయం కేంద్రంగా ఈ నివేదిక ఆధారంగా దర్యాప్తు సాగుతోంది. ఇప్పటికే నాడు రఘురామను పరీక్షించిన సీఎస్ ఆర్ఎంవో సతీశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజులను ఈ నెల 5న ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. అయితే, ఆ రోజు రఘురామను పరీక్షించిన సందర్భంగా ఆయన కేస్‌షీటులో అప్పటి ఆయన కండిషన్‌పై వైద్యులు స్పష్టంగా రాసినట్లు విచారణ అధికారి గుర్తించారు. ఇప్పటి వరకు అందరూ కోర్టుకు ఇచ్చిన నివేదికపైనే దృష్టి పెట్టారు. కానీ, ఎవరూ కేస్‌షీట్ గురించి ఆలోచించలేదు. అయితే, జీజీహెచ్‌లో కేస్‌షీట్ ఈ కేసులో కీలకం కాబోతున్నట్లు సమాచారం. కోర్టుకు ఇచ్చిన నివేదికలో తమపై ఎవరు ఒత్తిడి చేయించి అలా రాయించారనేది చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆ రోజు రఘురామను పరీక్షించిన టీమ్ ఆఫ్ డాక్టర్స్ అందరూ ఈ కేసులో అప్రూవర్‌గా మారతారా? లేదంటే సాక్షులుగా పెడతారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. జీజీహెచ్ నాటి సూపరింటెండెంట్ ప్రభావతి పాత్రపై ఆధారాలు లభించడంతో త్వరలోనే ఆమెను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


మరోసారి సీఐడీ సిబ్బంది విచారణ

రఘురామపై కస్టోడియల్ టార్చర్ జరిగిన సమయంలో అక్కడ విధుల్లో ఉన్న సీఐడీ కార్యాలయ సిబ్బందిని మరోసారి విచారణ చేస్తున్నారు. రెండు రోజులుగా వారిని ప్రకాశం ఎస్పీ కార్యాలయానికి పిలిపించి పలు వివరాలు సేకరిస్తున్నారు. ఇదే సమయంలో ఈ కేసులో నిందితులుగా ఉన్న పోలీస్ అధికారులతోపాటు నాటి సూపరింటెండెంట్ ప్రభావతి, ఆమె భర్త కాఆల్ డేటాల సెల్‌ఫోన్ కాల్ డేటాపై దృష్టి సారించాలని అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ కాల్‌డేటాతోపాటు ఆయన గన్‌మెన్, డ్రైవర్, వంట మనిషి, ఆర్డర్లీ తదితరులకు సంబంధించిన కాల్ డేటాను విశ్లేషించాలని నిర్ణయించారు.

వైకల్యాన్ని అధిగమించి.. 500కుపైగా ప్రదర్శనలు


» నా కుమారుడిని విభిన్న ప్రతిభావంతుల ప్రచారకర్తగా నియమించాలి

» ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెంకట్ తల్లిదండ్రులు విజ్ఞప్తి




సీఎం చంద్రబాబుతో కామిశెట్టి వెంకట్

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో పుట్టినప్పటికీ.. నిరంతర సాధన, గురువుల సహకారంతో అద్భుత ప్రతిభగల కళాకారుడిగా ఎదిగి, రాష్ట్రపతి అవార్డు పొందిన తమ కుమారుడిని విభిన్న ప్రతిభావంతులకు ప్రచారకర్తగా నియమించాలని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణయ్య గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. 2000లో వెంకట్ ఆటిజం, హైపర్ ఆక్టివ్, మానసిక వైకల్య సమస్యలతో పుట్టాడు. వినపడదు. మాటలు, నడక కూడా సరిగా వచ్చేవి కాదు. వైద్యుల సలహాలు, తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ, గురువుల సహకారంతో పాటలు పాడడం, నృత్యం చేయడం చేర్చుకున్నాడు. దేశవ్యాప్తంగా 500పైగా ప్రదర్శనలిచ్చాడు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి జాతీయ బాలల పురస్కారాన్ని అందుకున్నాడు. వెంకట్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'భవిత' కేంద్రాల్లో విభిన్న ప్రతిభావంతుల్లో ప్రేరణ, పట్టుదల, చైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వ ప్రచారకర్తగా నియమించాలని ఆయన తల్లిదండ్రులు సీఎం చంద్రబాబును కోరారు. వాహన సౌకర్యం, శాశ్వత ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు.



నేడు కానూరుకు సీఎం

● ఊర్జావీర్ ప్రారంభోత్సవానికి రాక



పెనమలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం కానూరులో పర్యటించనున్నారు. ఇక్కడి మురళీ రిసార్ట్సులో ఊర్జావీర్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.రవి సుభాష్, ఏపీ జెన్కో ఎండీ చక్రధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు పరిశీలిం చారు. సీఎండీ రవిసుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఊర్జావీర్, అంగన్వాడీ సెంటర్లకు ఇండక్షన్ వంట సామగ్రి పంపిణీ, శక్తి సామర్థ్య ఉపకరణాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్‌తో కలిసి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానంలో అవినీతి భోజనం

దుర్గగుడిలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

* అన్నదాన టెండర్లలో ఆయనదే హవా 8లో
* ఎల్1ను కాదని తనకే కాంట్రాక్టు ఇవ్వాలని పట్టు

భూ వివాదాలకు సత్వర పరిష్కారం

- ప్రజల వద్దకు వెళ్లి అర్జీల స్వీకరణ 8లో
- రెవెన్యూ సదస్సుల ప్రారంభ కార్యక్రమంలో సిసోడియా
- భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యం : కలెక్టర్ లక్ష్మీశ



• కొండపల్లి బొమ్మా.. బాగుందమ్మా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువులు, పర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్ గోపి సందడి చేశారు. కొండపల్లి బొమ్మలను ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నీరాజనంలో 140 మంది కళాకారులు 35 ప్రదర్శనలు ఇవ్వనున్నారు.



రాచనగరికి రాదారి

తుదిదశకు చేరిన కృష్ణానది వారధి

3 కిలోమీటర్ల మేర అద్భుత నిర్మాణం

- ఫిబ్రవరికి పూర్తయ్యే అవకాశం
- కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు
- ప్యాకేజీ-4లో పశ్చిమ బైపాస్‌కు అనుసంధానం
- నగరం నుంచి రాజధానికి దగ్గరగా..

10లో

2023 ఫిబ్రవరిలో గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు



'వారిపైనే గురి..!

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నాయకులపై ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో మరో 12 మందిని సీఐడీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం 71 మందిపై కేసు నమోదు చేయగా, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ 71వ నిందితుడు. కాగా, అడ్డగోలు అక్రమాలపై మాజీమంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఏసీబీ కేసులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడిలో 12 మంది అరెస్టు.. రిమాండ్

- మొత్తం 71 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు
- 71వ నిందితుడిగా సూత్రధారి వల్లభనేని వంశీ
- ఇప్పటికే రిమాండ్‌లో 15 మంది నిందితులు
- విడతలవారీగా అరెస్టులు చేస్తున్న సీఐడీ

(విజయవాడ/గన్నవరం-ఆంధ్రజ్యోతి) : 2023, ఫిబ్రవరి 20న గన్నవరంలో వైసీపీ రౌడీమూకలు రెచ్చిపోయాయి. టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ధ్వంసంచేసి, ఆ పార్టీ నాయకుల కార్లను దహనం చేశారు. ఈ మొత్తం విధ్వంసం అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో సాగింది. ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, కాట్రు శేషుకుమార్, ముల్పూరి ప్రభుకాంత్ కర్రలు పట్టుకుని హంగామా సృష్టించారు. అయితే, అప్పట్లో వైసీపీ నాయకులపై కేసులు పెట్టేందుకు పోలీసులు సాహించలేకపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎట్టకేలకు ఈ ఘటనపై కేసు నమోదైంది. ఈ విధ్వంసంలో 71 మందిని నిందితులుగా గుర్తించి ఎఫ్ఐఆర్ 137/2023 నమోదు చేశారు. ఈ ఏడాది జూలైలో 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో 12 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కొలుసు కిరణ్ (తెంపల్లి), తిరుమలశెట్టి రాజేశ్ (బొమ్ములూరు), మద్దాల అజయ్ (తిప్పనగుంట), ఆర్నేపల్లి రవివర్మ (కోడూరుపాడు), జార్జి (హనుమాన్ నగర్, బాపులపాడు), గండికోట నాగరాజు (రాజీవ్‌నగర్, బుద్ధవరం), మట్టా అనీల్ (తిప్పనగుంట), గంజి కాంతారావు (నున్న), సొంగా నరేంద్ర (ఆత్కూరు), రాజా (వంశీ పీఏ), కడవకొల్లు రామ్మోహన్ (గన్నవరం), దరువేముల పవన్ కుమార్ (తిప్పనగుంట) ఉన్నారు. వీరిని విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరు పరచగా, ఈనెల 20 వరకు రిమాండ్ విధించారు. అనంతరం గాంధీనగర్‌లోని జిల్లా జైలుకు తరలించారు.

కీలక పాత్రధారుల సంగతేంటి?


కేసులో కీలక పాత్రధారులైన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన ముఖ్య అనుచరులు.. ఓలుపల్లి మోహనరంగా రావు అలియాస్ రంగా, బి.యతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, కాట్రు శేషుకుమార్ అలియాస్ శేషు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, నక్కా గాంధీ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నన్నపనేని చలపతి, వంశీ పీఏ గద్దె సుధీర్ తదితరులను పోలీసులు అరెస్టు చేయలేదు. వీరిలో కొందరు న్యాయస్థానం ద్వారా ముందస్తు బెయిల్ తెచ్చుకోగా, మరికొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

నాని, వంశీలకు బిగుస్తున్న ఉచ్చు

రెండు రోజుల్లో కేసులు నమోదు



కొడాలి నాని



వల్లభనేని వంశీ

8

కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ముప్పాళ్ల

● 11న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేత

8లో

రూ.25వేలు పోయినా.. రూ.51వేలు పదిలం

● డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకున్న సీనియర్ సిటిజన్

10లో

మహా కుంభమేళా యాత్ర

● ఐఆర్‌సీటీసీ సరికొత్త టూర్ ప్యాకేజీ విడుదల
● జనవరి 19న ప్రారంభం

10లో

సిటీ బస్సులో అగ్నిప్రమాదం

చాకచక్యంగా బస్సు నిలిపివేసిన డ్రైవర్



8లో



అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ

అంబేడ్కర్ అడుగుజాడల్లో దేశ ప్రగతికి కృషిచేద్దాం

» ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ

కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనిస్తూ దేశాభివృద్ధికి కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీలు అన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు మహోన్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జిల్లా, రాష్ట్రం, దేశప్రగతికి మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో బాలాజీ, ఆర్. గంగాధరరావులు అంబేడ్కర్ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రవీంద్రను బలితీసుకుంది తలశిల రఘురామే!

» టీడీపీ నేతల ఆరోపణ

గొల్లపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దొంగపత్రాలతో గోల్డ్ స్కీం సృష్టించి కారెంపూడి రవీంద్రను బలి తీసుకుంది వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామేనని టీడీపీ నేతలు ఆరోపించారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, టీడీపీ నేత కారంపూడి ఆత్మహత్యకు తనకు ఎలాంటి సబంధం లేదని వైసీపీ నేత, ఎమ్మెల్సీ రఘురాం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వైసీపీ అధికారంలో ఉండగా రఘురాం చేసిన నిర్వాకం అందరికీ తెలుసునన్నారు. రవీంద్ర ఆత్మహత్యకు కారణం రఘురాం అని రవీంద్ర కుమారుడే ఫిర్యాదు చేశాడన్నారు. గొల్లపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా వాసు, నూతులపాటి నారద, బొర్రా తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈలకు సీఈలుగా అడ్‌హాక్ పదోన్నతి

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో ముగ్గురు సూపరింటెండింగ్ ఇంజనీర్లకు చీఫ్ ఇంజనీర్లుగా అడ్‌హాక్ పదోన్నతిని కల్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. కడప ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ(ప్రాజెక్టు) కె.శ్రీనివాసులు, పోలవరం ఏటూరు సర్కిల్ పోలవరం కుడి ప్రధాన కాలువ ఎస్ఈ బి.శ్యామ్ ప్రసాద్‌లకు చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టులో చీఫ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.నరసింహప్రసాద్‌లకు చీఫ్ ఇంజనీర్‌గా అడ్‌హాక్ పదోన్నతి కల్పించారు.

సచివాలయ కో-ఆపరేటివ్ క్యాంటీన్ అధ్యక్షుడిగా దుర్గా ప్రసాద్

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ సచివాలయ కో-ఆపరేటివ్ క్యాంటీన్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన 11 మంది సభ్యులు శుక్రవారం అమరావతి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కె.దుర్గా ప్రసాద్, ఎస్.ఆనందరావు, ఉపాధ్యక్షులుగా బి.పద్మజ, జాయింట్ సెక్రటరీగా శివప్రసాద్, ట్రెజరర్‌గా అనిల్, డైరెక్టర్లుగా అయ్యప్పరెడ్డి, షేక్ షర్మిలా బేగం, ఎస్.వెంకట్రావు, సీహెచ్ ప్రసన్న కుమార్, మురళీ కిశోర్, కేవీ రామ్ మోహన్ బాధ్యతలు స్వీకరించారు.

ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి కృషి

» ఒక్కో జిల్లాలో 4 గ్రామాల దత్తతకు ప్రణాళిక

» ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నందకిశోర్ బాధ్యతలు

గవర్నర్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కృషి చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్ అన్నారు. విజయవాడ ఏలూరు రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఎంఏ శాఖకు 22 వేల మందికి పైగా సభ్యులున్నారని, 26 జిల్లాల్లో 99 శాఖలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఏ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా అక్కడి ప్రజల ఆరోగ్యమే కీలకమని, అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఐఎంఏ కనీసం నాలుగు గ్రామాలను దత్తత తీసుకుని, ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. రక్తహీనత, క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాల వ్యాధు ల నిరోధానికి ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించామన్నారు.

యాంటీబయాటిక్స్‌తో ప్రమాదం పొంచి ఉంది!

దేశంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రమాదం పొంచి ఉందని, దీనివల్ల రాబోయే రోజుల్లో అంటువ్యాధుల నుంచి ప్రజలను రక్షించడం కష్టమని డాక్టర్ నందకిశోర్ హెచ్చరించారు. విచక్షణరహితంగా యాంటీబయాటిక్స్ వాడటమే దీనికి కారణమన్నారు. ఇప్పటికే ఈ రెసిస్టెన్స్ కారణంగా క్షయ వ్యాధిని నిర్మూలించలేక పోతున్నట్లు ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఎం.సుభాష్ చంద్రబోస్, పూర్వఅధ్యక్షుడు డాక్టర్ ఎన్.కిశోర్, పూర్వకార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు సత్వర పరిష్కారం

» ప్రజల వద్దకు వెళ్లి అర్జీల స్వీకరణ

» రెవెన్యూ సదస్సుల ప్రారంభ కార్యక్రమంలో సిసోడియా

» భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్దకు వెళ్లి భూ వివాదాలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా అన్నారు. శుక్రవారం తక్కెళ్లపాడులో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ఫిర్యాదుల్లో 40 శాతానికి పైగా భూములకు సంబంధించే వస్తున్నాయన్నారు. సదస్సు వల్ల రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చని చెప్పారు. దీర్ఘకాలం కోర్టు కేసుల్లో ఉన్న భూములకు కూడా పరస్పర అవగాహనకు వస్తే సదస్సుల్లో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామంలో 16 సమస్యలు రాగా వాటిలో భూములు దేవదాయ శాఖలో నమోదైఉన్నాయని, ఆయాశాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చేసిన పొరబాట్ల వల్ల భూ సమస్యలు పెరిగాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి రైతులకు భరోసా ఇచ్చిందన్నారు. ముందుగా ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి మహేశ్వరరావు, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, సర్పంచ్ కస్తుర్తి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈనాం భూముల సమస్య పరిష్కరించాలి

సుమారు 225 ఏళ్ల క్రితం పాలించిన రాజులు, జమీందార్లు తమ భూములను ఆలయాలలో పని చేసిన సిబ్బందికి వంశపారంపర్యంగా ఈనాం భూములు అందించారని, అప్పటి నుంచి అవి రకరకాలుగా చేతులు మారాయని తెలిపారు. ప్రభుత్వం ఈ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని బాధితులు సిసోడియాకు వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమీక్షలు జరిపి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

మొర్సుమిల్లి గ్రామ సచివాలయంలో..

మైలవరంరూరల్ : మండలంలోని మొర్సుమిల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన గ్రామసభలో 50 మంది రైతులు పలు సమస్యలపై విజయవాడ జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వం పారదర్శకత పాటిస్తుందన్నారు. గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి లావణ్యకుమారి, సర్పంచ్ మాడపాటి రమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కవులూరు గ్రామంలో

కృష్ణలంక : జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సును సీసీఎల్ఏ జి.జయలక్ష్మి పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. సదస్సుల నిర్వహణ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నాని, వంశీలకు బిగుస్తున్న ఉచ్చు

(విజయవాడ/గన్నవరం-ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. వైసీపీ హయాంలో చెలరేగిపోయి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వీరిపై, వీరి అనుచరులపై పోలీసులు ఇప్పటికే వేట మొదలుపెట్టారు. గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల కేంద్రంగా ఈ ఇద్దరు వైసీపీ నేతలు చేసిన దందాలు, దౌర్జన్యాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విభాగం విచారణ నిర్వహించి నివేదికలను ప్రభుత్వానికి అందించింది. వీటి ఆధారంగా ఏసీబీ అధికారులు ఒకటి రెండు రోజుల్లో కొడాలి నాని, వల్లభనేని వంశీపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. వైసీపీ హయాంలో ఈ ఇద్దరు నేతలు చెలరేగిపోయారు. స్థానిక టీడీపీ నేతలపై దాడులు చేయించడం, టీడీపీ అధినేత, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై నోరుపారేసుకోవడం వంటివి చేశారు. కొడాలి నాని గుడివాడలో ఏకంగా కేసినో కల్చర్‌కు శ్రీకారం చుట్టారు. ఇదేమిటని ప్రశ్నించేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై దాడులు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కార్యాలయంపై పెట్రోలు బాటిళ్లు విసిరారు. మరోవైపు కొడాలి నాని అనుచరులు విచ్చలవిడి దందాలకు తెరలేపారు. వివాదాస్పద భూములను చెరపట్టారు. జగనన్న కాలనీలకు మెరక పేరుతో దోపిడీ చేశారు. గన్నవరంలో కూడా పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేసి వంశీ అనుచరులు పెద్ద ఎత్తున డబ్బు సంపాదించారు. చివరికి ప్రభుత్వ భూములను కూడా వదలకుండా మట్టిని తవ్వి సొమ్ము చేసుకున్నారు. ఇచ్చిన అనుమతుల కంటే ఎక్కువ తవ్వడం, మైనింగ్, రాయల్టీ, సీనరేజ్ ఎగ్గొట్టడం వంటివి చేశారని విజిలెన్స్ విభాగం విచారణలో తేలింది. లీజుకు ఇచ్చిన దానికంటే 4 రెట్లు అదనంగా మట్టి తీశారని, అసలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఏ పన్ను కూడా చెల్లించలేదని నిర్ధారించారు. విజిలెన్స్ విభాగం గన్నవరం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో జరిగిన మట్టి తవ్వకాలపై కొలతలు తీయడమే కాకుండా ఏ మేరకు తవ్వకాలు జరిగాయో నిర్ధారించి నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో వంశీ అనుచరులు ఆయన అండ చూసుకుని అధికారులను బెదిరించి ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కొల్లగొట్టారని విజిలెన్స్ విభాగం పేర్కొంది. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా నివేదికతో జత చేసింది. వంశీ అనుచరులు సుమారు 40 మంది ఈ అక్రమ మట్టి దందాలో రూ.కోట్లు గడించారని విజిలెన్స్ స్పష్టం చేసింది. ఒకటి రెండు రోజుల్లో ఏసీబీ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, బినామీ అకౌంట్లను ఓపెన్ చేసి చేయని పనికి చేసినట్లుగా బిల్లులు సృష్టించి డబ్బు డ్రా చేయడం వంటివి ఏసీబీ పరిధిలోకి వస్తుందని న్యాయనిపుణులు సలహా ఇచ్చినట్లు తెలిసింది. అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల ద్వారా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని న్యాయనిపుణులు ప్రభుత్వానికి సూచించారు.

అన్నదానంలో అవినీతి భోజనం!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిపై ఆయన చెప్పిందే వేదం. ఆయన మాట వినకుంటే అధికారులు, సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తారు. తన మాట కాదని ఎవరైనా టెండర్లు వేస్తే వారిని బెదిరిస్తారు. తాజాగా అన్నదాన విభాగంలో టెండర్లు జరిగాయి. ఎల్1గా వచ్చిన కాంట్రాక్టర్‌ను పక్కన పెట్టేసి, ఎల్2గా వచ్చిన తనకు టెండర్ ఇవ్వాలంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లో తన మాటకు తిరుగులేదని, తన దారికి అడ్డు వస్తే ఇబ్బందులు తప్పవని, కాంట్రాక్టు వదిలి వెళ్లిపోవాలని ఎల్1గా వచ్చిన కాంట్రాక్టర్‌ను బెదిరిస్తున్నారు.

ఆయనో అనకొండ

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ఉచిత అన్నదాన పథకంలో క్లీనింగ్, సర్వింగ్ కాంట్రాక్టును కొన్నేళ్లుగా ఓ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. అధికారులను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం ద్వారా ఈయనే ఈ కాంట్రాక్టును దక్కించుకుంటున్నాడు. సుమారు రెండేళ్ల క్రితం ఓ భక్తుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవస్థానం ఉన్నతాధికారులు అంతర్గత విచారణ జరిపించి అన్నదాన విభాగంలో అక్రమాలు జరిగినట్లు నిగ్గుతేల్చారు. దీనికి బాధ్యులను చేస్తూ అన్నదాన విభాగాన్ని పర్యవేక్షించే ఏఈవో అమృతరావు, సూపరింటెండెంట్ హేమ, గుమస్తా ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అసలు సూత్రధారి అయిన కాంట్రాక్టరుపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం 2వేల మంది ఉచిత అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తుంటే, సదరు కాంట్రాక్టర్ మాత్రం అధికారులను ప్రలోభపెట్టి రికార్డుల్లో రెట్టింపు సంఖ్యలో భోజనాలు చేసినట్లు చూపుతున్నారని విచారణలో నిర్ధారణైంది. అంతే కాదు.. సదరు కాంట్రాక్టర్ తన వద్ద పనిచేసే సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ కట్టకపోవడంతో వారు ఈ విషయాన్ని దుర్గగుడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు వాస్తవమేనని నిర్ధారించి ఆ కాంట్రాక్టరును బ్లాక్‌లిస్టులో పెట్టారు. బ్లాక్‌లిస్టులో పెట్టాక కూడా హైదరాబాద్‌కు చెందిన సంస్థకు బినామీగా అవతారమెత్తిన సదరు కాంట్రాక్టర్ 2022లో మళ్లీ అన్నదానం టెండరును దక్కించుకుని యథేచ్ఛగా నడిపించేశాడు. ఈ ఏడాది నవంబరు 14తో కాంట్రాక్టు గడువు ముగియడంతో దుర్గగుడి అధికారులు మళ్లీ టెండర్ పిలిచారు. ఈ టెండర్లలో ఎల్1గా వీఎల్‌డీ ఏజెన్సీ నిలిచింది. ఎల్2గా గతంలో కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి వచ్చాడు. ఎలాగైనా టెండరు దక్కించుకోవాలన్న ఉద్దేశంతో ఎల్1గా వచ్చిన కాంట్రాక్టరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు సదరు కాంట్రాక్టరును బెదిరిస్తున్నాడు.

దుకాణాల్లో పాగా

దుర్గగుడి దత్తఆలయం సీతానగరంలోని శ్రీమద్ వీరాంజనేయస్వామి ఆలయానికి సామారంగం చౌక్ రోడ్డులో దుకాణాల సముదాయం ఉంది. దానిలో ఒకదాంట్లో అన్నదాన కాంట్రాక్టర్ లైటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణానికి సుమారు ఏడాదిగా అద్దె చెల్లించకపోవడంతో సుమారు రూ.5 లక్షల పైచిలుకు బకాయి ఉంది. దీంతో ఈ దుకాణానికి వేలం నిర్వహించేందుకు దుర్గగుడి అధికారులు సిద్ధం కాగా, అన్నదాన కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు. దుర్గగుడిలోని కొందరు సిబ్బంది సలహాతోనే ఈయన కోర్టు మెట్లెక్కినట్టు తెలిసింది.

పీఏసీఎస్ సెక్రటరీ అరెస్టు

రెడ్డిగూడెం, శ్రీరాంపురం పీఏసీఎస్‌లో రైతుల నుంచి వసూళ్లు చేసిన రూ.37 లక్షలను బ్యాంకులో జమ చేయకుండా మోసం చేసిన కేసులో నిందితుడు పీఏసీఎస్ కార్యదర్శి వడిమే ప్రభుదాసును శుక్రవారం పోలీసులు మైలవరంలో అరెస్టు చేశారు.

నిమ్రా కాలేజీ నిర్వాకం!

మెడికల్ విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు.. పరీక్షలు సమీపిస్తున్నా హాల్‌టికెట్లు అందించని వైనం

» మెడికల్ కాలేజీ, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మధ్య నలిగిపోతున్న విద్యార్థులు

» హైకోర్టు ఆదేశించినా స్పందించని తీరు

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిమ్రా(ఇబ్రహీంపట్నం) మెడికల్ కాలేజీ, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మధ్య 210 మంది మెడికల్ విద్యార్థులు నలిగిపోతున్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ డిసెంబరు 10వ తేదీ నుంచి ఎంబీబీఎస్ చివరి ఏడాది విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల హాజరు లిస్టును వర్సిటీకి పంపించి, హాల్ టికెట్లు అందించింది. నిమ్రా కాలేజీ యాజమాన్యం మాత్రం 210 మంది విద్యార్థుల పరీక్షా ఫీజు కట్టించుకోకుండా, హాల్ టికెట్లు ఇవ్వకుండా నిలిపివేసింది. దీంతో కొంత మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని హైకోర్టు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. నిమ్రా కాలేజీ నుంచి ప్రాక్టికల్, థియరీ క్లాస్‌ల వివరాలను తీసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు నిమ్రా కాలేజీకి మెయిల్ చేసింది. అయినప్పటికీ నిమ్రా కాలేజీ యాజమాన్యం వర్సిటీకి ఇప్పటి వరకూ విద్యార్థుల హాజరు వివరాలు పంపించ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు మాత్రం హెల్త్ వర్సిటీ, నిమ్రా కాలేజీల చుట్టూ తిరుగుతున్నారు. 10వ తేదీ నుంచి పరీక్షలు పెట్టుకుని విద్యార్థులను ఇప్పుడు ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేటు జూనియర్ కాలేజీల ఏర్పాటుకు నోటిఫికేషన్

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 53 కొత్త ప్రైవేటు జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ఇంటర్ విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. ఆసక్తి ఉన్న విద్యా సొసైటీలు, ట్రస్టులు కొత్త కాలేజీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇంటర్ విద్యామండలి వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 9 నుంచి దరఖాస్తులు సమర్పించాలని సూచించింది. మేనేజ్‌మెంట్లు అప్‌లోడ్ చేసిన దరఖాస్తులు, మౌలిక వసతులను విద్యామండలి బృందం పరిశీలిస్తుందని తెలిపింది. నిర్దేశిత ప్రమాణాలు కలిగిన మేనేజ్‌మెంట్లకు 2025-26 నుంచి కాలేజీలు ప్రారంభించుకునేందుకు ప్రొవిజినల్ అనుమతుల జారీ అవుతాయని పేర్కొంది. జనవరి 31 వరకు దరఖాస్తులు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించవచ్చని, అయితే అసంపూర్తి దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా కార్యాలయానికి పంపే దరఖాస్తులు స్వీకరించరని స్పష్టం చేసింది.

సిటీ బస్సులో అగ్నిప్రమాదం

చాకచక్యంగా బస్సు నిలిపివేసిన డ్రైవర్

నీళ్లు, ఇసుకతో ఆర్పివేసిన వాహనదారులు, ప్రయాణికులు

వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ లోబ్రిడ్జి వద్ద విద్యాధరపురానికి చెందిన ఆర్టీసీ బస్సు స్వల్పంగా అగ్ని ప్రమాదానికి గురైంది. డ్రైవర్ ఇంజన్ లోపల నుంచి మంటలు వస్తున్నాయని గమనించి చాకచక్యంగా బస్సును రోడ్డు పక్కన ఆపివేశాడు. బస్సు వెనుక ఉన్న వాహనదారులు స్పందించి నీళ్లు, సమీపంలో ఉన్న ఇసుకతో బస్సులో నుంచి వస్తున్న మంటలను ఆర్పివేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రూట్‌నెం.333 సిటీ బస్సు కాళేశ్వరరావు మార్కెట్ సిటీ టెర్మినల్ నుంచి సుమారు 10 మంది ప్రయాణికులతో పామర్రు బయలు దేరింది. లోబ్రిడ్జి వద్దకు వచ్చే సరికి బస్సు ఇంజన్‌లో నుంచి మంటలు పైకి ఎగిశాయి. ఈ విషయం తెలుసుకున్న డ్రైవర్, కండక్టర్‌లు నారాయణ, నాగేశ్వరరావులు బస్సును రోడ్డుపక్కన ఆపి ప్రయాణికులను దించివేశారు. బస్సు వెనుక ఉన్న వాహనదారులు తమవద్ద ఉన్న నీటితో, మరికొందరు సమీపంలో ఉన్న ఇసుకతో మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ సమస్య లేకుండా బస్సును నెట్టుకుంటూ పార్శిల్ ఆఫీసు కార్యాలయం సమీపం వరకు తీసుకువెళ్లారు. కాలం చెల్లిన బస్సు కావటంతో ఇంజన్‌లో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయినట్లు డ్రైవర్, కండక్టర్‌లు చెబుతున్నారు. బస్సు నిలిచిపోవటంతో వన్‌టౌన్ నుంచి గవర్నర్‌పేట వైపు వచ్చే వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు కొద్దిసేపు ట్రాఫిక్‌ను మళ్లించి ఆ తరువాత యథావిధిగా వదిలేశారు.



స్వల్పంగా అగ్ని ప్రమాదానికి గురైన సిటీ బస్సు, పక్కన మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్

జనని శిశు సురక్షలో 14.5 లక్షల గర్భిణులకు చికిత్స

» ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం



వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జననీ, శిశు సురక్ష కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చేకూరిన లబ్ధిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్ సమావేశాల్లో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో 14,05,394 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించినట్టు ఆమె తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద జననీ, శిశు సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి తల్లి ఆరోగ్య సేవల కోసం రూ.81.74కోట్లు విడుదల చేయగా, రూ.65.79 కోట్లు వినియోగించారని చెప్పారు. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం రూ.3.78 కోట్లు విడుదల చేయగా, రూ.3.75కోట్లు వినియోగించారని తెలిపారు. మొత్తంగా 2019-2020 నుంచి 2023-24 వరకు ఈ పథకం కింద 14,05,394 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారన్నారు. ఇదే క్రమంలో 2,04,142 మంది శిశువులకు వైద్య సేవలు అందినట్టు తెలిపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ పథకంలో తల్లీబిడ్డల సంరక్షణ కోసం రూ.29.09 కోట్లు విడుదల చేయగా, రూ.20.53కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.

పీఎం సూర్యఘర్‌లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

» పథకం లబ్ధికి రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై కలెక్టర్ లక్ష్మీశ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకం కింద ఎలాంటి ముందస్తు పెట్టుబడి లేకుండా రూ.2 లక్షల విలువైన కేడబ్ల్యు సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాయితీ మినహా మిగిలిన రూ.1,02,000ను తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు. ఇంటి పైకప్పు సోలార్ ప్యానెల్ ప్రాజెక్ట్ జీవితకాలం 25 ఏళ్లు వుంటుందని, మొత్తం మీద రూ.8,27,369 ఆదా అవుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో వచ్చే మార్చి నాటికి 20 వేల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, అదేవిధంగా 2027 మార్చి నాటికి లక్ష ఇన్‌స్టలేషన్ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ప్రభుత్వ ఉద్యోగులు తొలుత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కుటుంబానికి ఆర్థిక ఆసరాతో పాటు పర్యావరణానికి మేలు చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ మురళీమోహన్, డీఈ (టెక్) హనుమయ్య, నోడల్ అధికారి భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామకు కేబినెట్ హోదా

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజుకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాసన సభ నిబంధనల ప్రకారం డిప్యూటీ స్పీకర్‌కు ఆర్టికల్ 15 ప్రకారం ప్రొటోకాల్ కల్పించాల్సి ఉన్నందున ప్రభుత్వం ఈమేరకు చర్యలు తీసుకుంది.

ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : బొప్పరాజు

» సీఎం ముఖ్య కార్యదర్శికి ఏపీజేఏసీ అమరావతి వినతిపత్రం

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఏపీజేఏసీ అమరావతి శుక్రవారం సీఎంవో కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్రను కలిసి వినతిపత్రం అందజేసింది. ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, సెక్రటరీ జనరల్, ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు.. ముద్దాడను కలిశారు. మొత్తం 16 కీలక సమస్యలను ఏకరువుపెట్టారు. వీటిలో.. నైట్ అలవెన్సులు పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 46 రోజుల ఓటీ అలవెన్సులను చెల్లించాలని, విలీనానికి ముందున్న విధానంలో పదోన్నతులు నిర్వహించాలని, ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలని, పెండింగ్ కారుణ్య నియామకాలు జరపాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, అద్దె బస్సు డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మైలవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఎస్‌సీ చదువుతున్న మరుపు సాయిలక్ష్మి శుక్రవారం సాయంత్రం తాను ఉంటున్న హాస్టల్ భవనం నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. విజయనగరం జిల్లా పేర్లం మండలం లోచర్ల గ్రామానికి చెందిన ఆమెకు ఆరోగ్యం బాగోటం లేదని చదువుకోలేకపోతున్నానని పేరెంట్స్‌కు తెలిస్తే బాధపడతారనే ఉద్దేశంతో కిందకు దూకినట్టు తెలిపిందని ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం గొల్లపూడిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కేంద్ర పురస్కారానికి ముప్పాళ్ల ఎంపిక

చందర్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌కు ముప్పాళ్ల గ్రామం ఎంపికైంది. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే ఈ అరుదైన పురస్కారం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ మొత్తం ఏడు అంశాల ప్రాతిపదికగా రాష్ట్రంలో నాలుగు పంచాయతీలను ఎంపిక చేసింది. సామాజిక న్యాయం, సామాజిక భద్రత అంశాల్లో ముందంజలో ఉన్న ముప్పాళ్ల పంచాయతీని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి గ్రామ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, కార్యదర్శి సాయిరామ్‌లు పురస్కారం అందుకోనున్నారు. పురస్కారంతో పాటు గ్రామాభివృద్ధికి రూ.కోటి నిధులు అందజేయనున్నారు. దీనిపై సర్పంచ్ వీరమ్మ, కార్యదర్శి సాయిరామ్‌లు మాట్లాడుతూ, ఇంతటి మహోన్నతమైన పురస్కారం దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. గ్రామానికి కేంద్ర పురస్కారం దక్కడం పట్ల ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు, మండల అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, నల్లాని రవిబాబు, నల్లాని ప్రభాకర్, నల్లాని శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మర్యాదపూర్వక కలయిక

పటమట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, పోరంకి మురళీ రిసార్ట్స్‌లో జరగనున్న సీఎం కార్యక్రమం పరిశీలనకు వచ్చి తిరుగు ప్రయాణంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌ని పటమటలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రామకృష్ణ ప్రసాద్ పెందుర్తి వెంకటేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వీరివురూ రాష్ట్రంలో పార్టీ అభివృద్ధి గురించి, పలు రాజకీయ అంశాలను చర్చించినట్లు తెలిపారు.







పార్కింగ్ దాటి వచ్చి వ్యాపారాలు, రైతుబజార్ ఎదురుగా ట్రాఫిక్ రద్దీ

రోడ్డుకిరువైపులా ఆక్రమణలు

● పటమట రైతుబజార్ రోడ్డులో నిరాటంకంగా వ్యాపారాలు ● వినియోగదారులు, వాహనదారులతో రద్దీ ● స్తంభిస్తున్న ట్రాఫిక్

(పటమట, ఆంధ్రజ్యోతి)

పటమట రైతుబజార్ రోడ్డులో వ్యాపారులు సగానికి పైగా రోడ్డును క్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలు తొలగించిన ప్రతిసారి మళ్లీ రోడ్డు కబ్జా చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

విజయవాడలో ఉన్న అతిపెద్ద కూరగాయల మార్కెట్లలో పటమట రైతుబజార్ ఒకటి. ఈ రైతుబజార్‌లో పటమట పరిసర ప్రాంతాలైన యనమలకుదురు, రామలింగేశ్వరనగర్, కానూరు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తూ ఉంటారు. అంతటి ప్రాధాన్యత ను సంతరించుకున్న ఈ రైతుబజార్ రోడ్డు నిరంతరం వినియోగదారులతో, వాహనదారులతో ర ద్దీగా ఉంటుంది. రైతుబజార్ గోడను ఆనుకుని ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉంటుంది. పూల వ్యాపారులు, పండ్ల వర్తకులు రోడ్డు సగం పైగా ఆక్రమించి తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. రైతుబజారు ఎదురుగా ఉన్న రోడ్డులో పండ్ల వ్యాపారులు సగంపైగా రోడ్డును కబ్జా చేసి వ్యాపారాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. వినియోగదారులు రోడ్డుమీ వాహనాన్ని నిలిపి పండ్లు, పూలు కొనుగోలు చేయడంతో ట్రాఫిక్ భారీగా స్థంభించిపోతోంది. రైతుబజార్ నుంచి రోడ్డుకి ఇరువైపులా సాగిన ఆక్రమణ పర్వం హైస్కూల్, చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం దాటి చిల్లీస్ బార్ వరకు విస్తరించింది. ఈ ఆక్రమణలపై గతంలో పలుసార్లు ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది. అయినా ఫలితం శూన్యం. ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలు తొలగించిన వెంటనే ప్రజాప్రతినిధుల అండతో మళ్లీ పరిస్థితి యథారాజా తథా ప్రజా అన్నట్లుగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణలు తొలగించాలని పటమట ప్రాంత వాసులు కోరుతున్నారు.



రైతుబజార్ ఎదురుగా పండ్ల వ్యాపారం

రెవెన్యూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం అని, ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తున్నాం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 11వ డివిజన్‌లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఉన్న భూ సమస్యలను స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఈ సదస్సులను నిర్వహిస్తున్నామని గద్దె తెలిపారు. ప్రజలు తమ భూమికి సంబంధించిన ఏ సమస్య అయినా ఈ రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకో వచ్చునన్నారు. రెవెన్యూ అధికారులు భూ రికార్డులను స్వయంగా పరిశీలించి ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నెల రోజుల పాటు ఈ సదస్సులు జరుగుతాయని వివరించారు. రెవెన్యూ సదస్సులనుద్దేశించి చంద్ర బాబు నాయుడు పంపిన సందేశాన్ని గద్దె రామ్మోహన్ చదివి వినిపించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి చంద్రశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలన్నింటిని రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి పరిష్కరిస్తారన్నారు. ఈ సదస్సులో వచ్చిన అర్జీలను సిబ్బంది సర్వే చేసి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. తహసీల్దార్ రోహిణిదేవి మాట్లాడుతూ ప్రజలు చెప్పిన సమస్యలను ఆన్‌లైన్ చేసి వాటిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. సమస్య చిన్నది అయితే ఇక్కడ వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి గాంధీ, కోనేరు రాజేష్, బొలిశెట్టి అన్నపూర్ణ, పాశం సుజాతలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం



లబ్బీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథంతో పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి అన్నారు. చారిటబుల్ ట్రస్ట్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహించామని, రాబోయే రోజుల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల సాంద్రత, టూ డీ ఎకో, ఈసీజీ, డయాబెటిక్, న్యూరోపతి తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవబోయిన అనిల్ కుమార్, డాక్టర్ కుందా శ్రీధర్, డాక్టర్ ఆకాష్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీ చంద్రశేఖర్, మెంబర్స్ చక్రధర్, విశ్వేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు లత, గోపాల్, పద్మప్రియ పాల్గొన్నారు.

అనువాద కోర్సులతో ఉపాధి మెండు

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

గుణదల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనువాద కోర్సులో ప్రతిభకనబర్చిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్టోబరు 21 నుంచి డిసెంబరు 6 వరకు తెలుగు విభాగం వారు నిర్వహించిన అనువాదం సర్టిఫికెట్ కోర్సు శుక్రవారంతో ముగిసింది. అనువాదం సర్టిఫికెట్ కోర్సును 30మంది విజయవంతంగా ముగించారు. కోర్సు పూర్తి చేసిన వారికి కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనువాదం కోర్సును పూర్తి చేసిన వారికి సాహిత్యం, మీడియా, పర్యాటక రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు.

డిగ్రీతో పాటు ఈతరహా కోర్సులపట్ల యువత ఆసక్తి కనబర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్.అనిత మార్గరేట్, కోర్సు సమన్వయకర్త ఎన్.శ్రీకాంత్, అధ్యాపకులు డాక్టర్ కె.వి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి లారీ డ్రైవర్ మృతి

వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక కల్పన ప్రింట్స్ రోడ్డులో ఉంటున్న చింతకాయల ప్రసాద్(49) శుక్రవారం ప్రమాదవశాత్తు భవనం 3వ అంతస్థు పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు పోలీసులకు తెలియపరిచారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చింతకాయల ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతను లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఘనంగా కేక్ మిక్సింగ్

మొగల్రాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ రకాలైన డ్రై ఫ్రూట్స్, నట్స్, వైన్ మిశ్రమాన్ని కలిపి క్రిస్మస్ సందర్భంగా కేక్ తయారీకి సిద్ధం చేశామని కళాశాల ప్రిన్సిపాల్ వి. అరవింద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజ్ అవంత, జీఆర్‌టీ గ్రాండ్ డేస్, ఫార్చ్యూన్ మురళీ హోటల్స్ హెచ్ ఆర్ మేనేజర్‌లు, స్పృహ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ రచయిత బండి స్టాన్లీ

విద్యార్థుల్లో సృజనాత్మకతకు స్ఫూర్తి2కే24

ప్రముఖ రచయిత బండి స్టాన్లీ

భారతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి అనుగుణంగా కళాశాలలో నిర్వహించే స్ఫూర్తి కార్యక్రమాలు విద్యార్థుల్లోని కళను వెలికి తీస్తాయని ప్రముఖ రచయిత బండి స్టాన్లీ తెలిపారు. ఆంధ్రా లయోలా కళాశాలలో స్ఫూర్తి 2కె 24 కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కళ విద్యార్థుల్లోని బాహ్యరూపాన్ని కాకుండా అంతర్గత రూపాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్, ఫాదర్ ప్రభుదాస్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ భార్గవి, విజువల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి రాయప్ప, స్టూడెంట్ యాక్టివిటీస్ డీన్ డాక్టర్ ఎల్ శుభ, 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



6వ డివిజన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, 7వ డివిజన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నేతలు

ఘనంగా బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం 6వ డివిజన్‌లో ఆయన చిత్రపటానికి డివిజన్ పార్టీ అధ్యక్షుడు పడాల గంగాధర్, కార్యదర్శి పునుగుమాటి మోహన్‌రావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డేపల్లి కేశవ్, మోకర గురునాథం, షేక్ షకీల, సగర అప్పారావు, సీరా ప్రసాద్, దుర్గారావు, పి.వాసు, గార్లపాటి గోపిలు పాల్గొన్నారు.

● రెండో డివిజన్ మాచవరం యలిశల వారి వీధిలో అంబేడ్కర్ చిత్రపటానికి బహుజన పార్టీ నేతల ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనపర్తి మురళీ, కేవీ కోటేశ్వరరావు, బోడ ప్రసన్న కుమార్, యలిశల పాపారావు, ఓగిరాల కమలాకర్ పాల్గొన్నారు.

మొగల్రాజపురం: ఏడో డివిజన్ బోయపాటి మాధవరావు రోడ్డు బండెల దొడ్డి వద్ద పీవీ రావు మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా జరిగింది. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్, ఏడో డివిజన్ టీడీపీ నాయకుడు పెనుగొండ శ్రీనివాస్, స్థానిక నాయకులు యేసు, కాపుదేశీ రాజేష్, తుమ్మపూడి గాంధీ, చంటి, శంకర్ పాల్గొన్నారు.



జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు

లబ్బీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిగ్రీతో పాటు వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. నలంద కళాశాల లో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోమర్స్ 2కె24 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చదువును మార్కుల కోసం మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్, నాయకత్వపు లక్షణాలు నేర్చుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోమర్స్ ను గత12 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. తమ నైపుణ్యాలు ప్రదర్శించడానికి ఇది చక్కని వేదిక అని అన్నారు. మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ వై.శ్రీలక్ష్మి మాట్లాడుతూ పీపీటీ క్విజ్, ప్రొడక్ట్ లాంచింగ్, అంత్యాక్షరి, గ్రూప్ డ్యాన్స్, పర్సనాలిటీ కాంటెస్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ, ఇన్‌స్టా రీల్, డాన్స్ బిజినెస్ ప్లాన్ తదితర పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేఆర్‌యూ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థనగర్‌లోని కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ పోటీల్లో ఆరు కళాశాలల జట్లు బరిలో దిగాయి.

ఈ పోటీల్లో ప్రథమస్థానంలో కేబీఎన్ కళాశాల జట్టు నిలవగా, రెండో స్థానంలో కేవీఎస్ఆర్ సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, మూడో స్థానంలో పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల జట్టు నిలిచాయి. విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత మాట్లాడుతూ కాంపిటీషన్లలో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటితే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు.



ఎస్ఆర్ఆర్ వాలీబాల్ టీమ్‌కు అభినందనలు

గుణదల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్‌లో మూడో స్థానం పొందిన ఎస్ఆర్ఆర్ టీమ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అభినందించారు. టీమ్‌లో ప్రతిభ కనబర్చిన వారిని కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ టి.యుగంధర్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

రాచనగరికి రాదారి





తుదిదశకు చేరిన కృష్ణానది వారధి

* 3 కిలోమీటర్ల మేర అద్భుత నిర్మాణం
* ఫిబ్రవరి నాటికి పూర్తయ్యే అవకాశం
* కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు
* ప్యాకేజీ-4లో పశ్చిమ బైపాస్‌కు అనుసంధానం
* విజయవాడ నుంచి రాజధానికి దగ్గరగా..

92 శాతం పనులు పూర్తయిన కృష్ణానది వారధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కృష్ణానదిపై ఆరు వరసల వంతెన పనులు తుదిదశకు చేరాయి. ప్రస్తుతం గొల్లపూడివైపు పనులు జరుగుతుండగా, 92 శాతం పనులు పూర్తయినట్టే. అన్ని పనులను ఫిబ్రవరికి పూర్తిచేసే అవకాశం ఉంది. రెండు వరసలుగా ఉండే ఈ బ్రిడ్జిలో మూడు లేన్ల చొప్పున మొత్తం ఆరు లేన్లు ఉంటాయి. గొల్లపూడి దిగువన సూరాయపాలెం నుంచి కృష్ణానది మీదుగా మూడు కిలోమీటర్ల పొడవున ఈ వంతెన నిర్మాణం జరిగింది. వంతెన పూర్తయినా.. అందుబాటులోకి రావటానికి మరికొంతకాలం పట్టే అవకాశం ఉంది. దీనికి అనుబంధంగా కాజ వరకు రోడ్డు పనులు అనుకున్నంత వేగంగా జరగకపోవడమే ఇందుకు కారణం.

కాజ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో అంతర్భాగం

ప్రతిష్టాత్మక కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు పరిధిలోకి ఈ కృష్ణా బ్రిడ్జి వస్తుంది. ఈ రోడ్డును నాలుగు ప్యాకేజీలుగా చేపడుతున్నారు. ఈ వంతెన నాల్గో ప్యాకేజీ పరిధిలోనిది. కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు కోసం రెండు దశాబ్దాల కిందట కేంద్ర ప్రభుత్వం బీవోటీ పద్ధతిలో టెండర్లు పిలిచింది. అప్పట్లో టెండర్లు దక్కించుకున్న గామన్ ఇండియా ఆర్థిక సమస్యలతో పనులు ప్రారంభించలేదు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టుకు ఈపీసీ విధానంలో కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గుండుగొలను నుంచి కలపర్రు వరకు ప్యాకేజీ-1, కలపర్రు నుంచి చిన్న అవుటపల్లి వరకు ప్యాకేజీ-2, చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3, గొల్లపూడి నుంచి కాజ వరకు ప్యాకేజీ-4గా విభజించి పనులు చేపట్టారు. ప్యాకేజీ-4 పనులను నవయుగ-అదానీ జాయింట్ వెంచర్‌గా దక్కించుకుంది. కృష్ణా బ్రిడ్జితో పాటు అమరావతి మీదుగా కాజ వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించింది.

2025లో సాధారణ సెలవులు 23

» 21 ఐచ్ఛిక సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది (2025) సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. పండుగలు, జాతీయ సెలవులు కలిపి ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తం 23 రోజులు సాధారణ సెలవులు, మరో 21 రోజులు ఐచ్ఛిక సెలవులుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 30న ఉగాది సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ సెలవుల్లో రిపబ్లిక్ డే, ఉగాది, శ్రీరామనవమి, మొహర్రం పండుగలు ఆదివారం వచ్చాయని తెలిపింది. రంజాన్, బక్రీద్, మొహర్రం, ఈద్ మిలాద్-ఉన్-నబీతో పాటు చంద్రుడి రాకతో సంబంధం ఉన్న హిందూ పండుగలను అప్పటి పరిస్థితులను బట్టి ప్రకటిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాధారణ సెలవులు

పండుగ	తేదీ	వారం
భోగి	13/01/25	సోమ
సంక్రాంతి	14/01/25	మంగళ
కనుమ	15/01/25	బుధ
రిపబ్లిక్ డే	26/01/25	ఆది
మహాశివరాత్రి	26/02/25	బుధ
హోళీ	14/03/25	శుక్ర
ఉగాది	30/03/25	ఆది
ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్)	31/03/25	సోమ
బాబు జగ్జీవన్‌రామ్ జయంతి	05/04/25	శని
శ్రీరామనవమి	06/04/25	ఆది
అంబేద్కర్ జయంతి	14/04/25	సోమ
గుడ్ ఫ్రైడే	18/04/25	శుక్ర
ఈద్ ఉల్ అజా (బక్రీద్)	07/06/25	శని
మొహర్రం	06/07/25	ఆది
వరలక్ష్మీ వ్రతం	08/08/25	శుక్ర
స్వాతంత్ర్య దినం	15/08/25	శుక్ర
శ్రీకృష్ణాష్టమి	16/08/25	శని
వినాయక చవితి	27/08/25	బుధ
మిలాదున్ నబీ	05/09/25	శుక్ర
దుర్గాష్టమి	30/09/25	మంగళ
గాంధీ జయంతి/ విజయదశమి	02/10/25	గురు
దీపావళి	20/10/25	సోమ
క్రిస్మస్	25/12/25	గురు

ఐచ్ఛిక సెలవులు

పండుగ	తేదీ	వారం
నూతన సంవత్సరం	01/01/25	బుధ
హజ్రత్ అలీ జయంతి	13/01/25	సోమ
షబ్-ఇ-మీరజ్	27/01/25	సోమ
షబ్-ఇ-బరాత్	14/02/25	శుక్ర
షహదత్ హజ్రత్ అలీ	22/03/25	శని
షబ్-ఈ-కదర్	27/03/25	గురు
జమాతుల్ వాద	28/03/25	శుక్ర
మహావీర్ జయంతి	10/04/25	గురు
బసవ జయంతి	30/04/25	బుధ
బుద్ధ పూర్ణిమ	12/05/25	సోమ
ఈద్-ఇ-గదీర్	15/06/25	ఆది
రథయాత్ర	27/06/25	శుక్ర
మొహర్రం	05/07/25	శని
పార్శీల నూతన సంవత్సరాది	15/08/25	శుక్ర
మహాలయ అమావాస్య	21/09/25	ఆది
యాజ్ దహుమ్ షరీఫ్	09/10/25	గురు
కార్తీక పౌర్ణమి/ గురునానక్ జయంతి	05/11/25	బుధ
హజ్రత్ సయ్యద్ మహమ్మద్ జువన్‌పురి మెహదీ జయంతి	06/11/25	గురు
క్రిస్మస్ ఈవ్	24/12/25	బుధ
బాక్సింగ్ డే	26/12/25	శుక్ర

పరువేలేని వ్యక్తి పరువు నష్టం దావా వేస్తాడా?

» విజయసాయిరెడ్డి ఓ చచ్చిన పాము: బుద్దా వెంకన్న

హైదరాబాద్, అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబుకు కులపిచ్చి ఉందంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలపై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం, ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడారు. 'విజయసాయిపై క్రిమినల్ కేసు పెడతాం. జైలుకు పంపించేంతవరకూ వదలిపెట్టబోం. ఆయన వ్యాఖ్యలపై విజయవాడ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా. పరువే లేని వ్యక్తి పరువు నష్టం దావా వేస్తాడట. ఆయనో చచ్చిన పాము. వైసీపీ టైటానిక్ షిప్ అని, ఎన్ని లంగర్లు వేసినా అది లేవబోదు' అని బుద్దా వెంకన్న విమర్శించారు.

విజయసాయిపై చర్యలు తీసుకోవాలి: బ్రహ్మం చౌదరి

వైసీపీ బ్రోకర్ విజయసాయిరెడ్డిపై హోంశాఖ సుమోటోగా కేసు ఫైల్ చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మం చౌదరి ఒక ప్రకటనలో కోరారు.

ముంపు పరిహారం పంపిణీలో అవకతవకలు

» టీడీపీ గ్రీవెన్స్‌లో పులిచింతల నిర్వాసితుల ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముంపు బాధితుల పరిహార పంపిణీలో అవకతవకలు జరిగాయని గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం ఎమ్మాజీ గూడేనికి చెందిన పులిచింతల నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. 45 మంది అక్రమార్కులకు అధికారులు అప్పనంగా డబ్బులు కట్టబెట్టారని, దీనిపై విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పలువురు బాధితులు శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించారు. మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వారినుంచి వినతులు స్వీకరించారు. శుక్రవారం నుంచి గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, భూ సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

వన్నెకుల క్షత్రియ అభివృద్ధికి కృషి

» చైర్మన్‌గా సీఆర్ రాజన్ బాధ్యతలు



మాట్లాడుతున్న సీఆర్ రాజన్

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ వన్నెకుల క్షత్రియ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆంధ్రప్రదేశ్ వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సీఆర్ రాజన్ అన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆటోనగర్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియులు ఎన్నో ఏళ్లుగా వెనుకబడిపోయారని, వారి అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్‌కు మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ శుభాకాంక్షలు తెలిపారు. గురజాల ఎమ్మెల్యే జగన్‌మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.

అలరించిన గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చెన్నైకి చెందిన కస్తూరి కమల దీప్తి గాత్ర కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో స్వరఝరి సంస్థ, గాయక సార్వభౌమ సంగీత పరిషత్ సంస్థల ఆధ్వర్యంలో గాత్ర కచేరీ నిర్వహించారు.

మహిళల రక్షణ సామాజిక బాధ్యత

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు



మహిళలపై హింసకు వ్యతిరేకంగా 'ఉమెన్స్ ఈక్వాలిటీ 1కే వాక్'ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహితలో మహిళలపై హింసను నివారించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించారన్నారు. అంతర్జాతీయ దినోత్సవం, మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళలపై హింస నిర్మూలనం కోసం బందరురోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వద్ద శుక్రవారం నిర్వహించిన 'ఉమెన్స్ ఈక్వాలిటీ 1కే వాక్'ను ఆయన ప్రారంభించారు. మహిళల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, జి.నారాయణరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్నాం

» విజయవాడ జీజీహెచ్‌లో మంత్రి నిమ్మల.. 24వ సారి మంత్రి రక్తదానం



రక్తదానం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 101వ రక్తదాన శిబిరంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. 24వ సారి రక్తదానం చేశారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దేశంలో మొదటిసారిగా దళితులైన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభాభారతిని శాసన సభ స్పీకర్‌గా చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో సమర్థవంతంగా అమలైన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించిందని, ఎస్సీలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఓ దళిత వ్యక్తిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీకి మాజీ సీఎం జగన్‌రెడ్డి సన్మానం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ఇటీవల మరణించిన జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు నివాళి అర్పించేందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు శుక్రవారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం.. జస్టిస్ పీఎల్ఎన్ శర్మ సేవలను గుర్తుచేసుకున్నారు. డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.25వేలు పోయినా..రూ.51వేలు పదిలం

డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకున్న సీనియర్ సిటిజన్

విజయవాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వీడియోలు ఉన్నాయని సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి తొలుత రూ.25 వేలు పంపినా, తర్వాత బ్యాంక్ అధికారులు, సైబర్ క్రైం పోలీసుల అండతో రూ.51వేలు పంపకుండా డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకోగలిగిన ఓ సీనియర్ సిటిజన్ ఉదంతమిది. వివరాల్లోకి వెళితే..ఎల్‌బీసీ కాలనీకి చెందిన ఓ సీనియర్ సిటిజన్‌కు గవర్నరుపేట బ్యాంక్ ఆఫ్ బరోడాలో అకౌంట్ ఉంది. ఆయన పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. బ్యాంక్ అకౌంట్‌లో ఆయన డబ్బులు పొదుపు చేసుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి గుర్తుతెలియని నంబరు నుంచి ఆయనకు వాట్సాప్ కాల్ వచ్చింది. తాము యూట్యూబ్ చానల్ నుంచి మాట్లాడుతున్నామని, నీ అసభ్యకర చిత్రాలు మా వద్ద ఉన్నాయని, వాటిని మా చానల్‌లో అప్‌లోడ్ చేస్తామని సీనియర్ సిటిజన్‌ను వారు బెదిరించారు. తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినా అవతలి వ్యక్తులు బెదిరిస్తూనే ఉన్నారు. తాము చెప్పిన అకౌంట్ నంబరుకు రూ.25వేలు పంపాలని హుకుం జారీ చేశారు. తన పరువు, ప్రతిష్టలకు భంగం కలుగుతుందని భయపడిన ఆయన ఆగమేఘాల మీద బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లారు. వారు చెప్పిన మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా అకౌంట్‌కు బదిలీ చేశారు. తర్వాత కాసేపటికి పోలీసులమంటూ మరో వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. తాను పోలీసు ఆఫీసర్‌నని, ఆ ఫొటోలను డిలీట్ చేయిస్తానని చెప్పి రూ.51వేలు పంపమని అకౌంట్ నంబరు ఇచ్చాడు. తర్వాత ఈ డబ్బులను పంపడానికి ఆర్టీజీఎస్ ఫాం పూర్తి చేశారు. బ్యాంక్ సిబ్బందికి అనుమానం వచ్చి ఇటీవల పోలీసు అధికారులు ఇచ్చిన ప్రశ్నావళిని ఆయనకు ఇచ్చారు. వెంటనే బ్యాంక్ సిబ్బంది సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ గుణరాము, ఎస్ఐ మూర్తికి సమాచారం ఇచ్చారు. వారు బ్యాంకుకు వెళ్లి సీనియర్ సిటిజన్‌తో సైబర్ నేరగాళ్లతో మాట్లాడించారు. వారు చెప్పిన రూ.51వేలు పంపినట్టుగా ఒక డూప్లికేట్ రశీదును సృష్టించారు. దాన్ని సైబర్ నేరగాళ్లకు వాట్సాప్ ద్వారా పంపారు. సైబర్ నేరగాళ్లు సీనియర్ సిటిజన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచి అకౌంట్‌లో నిల్వను చూసుకున్నారు. నిల్వ పెరగకపోవడంతో డబ్బులు రాలేదని చాలాసేపు సీనియర్ సిటిజన్‌తో వాదనకు దిగారు. తర్వాత కాసేపటికి మొత్తం విషయం అర్థమై ఫోన్‌కాల్‌ను కట్ చేశారు. డిజిటల్ అరెస్టులో ఇరుక్కున్న సీనియర్ సిటిజన్ రూ.25వేలను భయంతో పోగొట్టుకున్నాడు. బ్యాంక్ సిబ్బంది, సైబర్ పోలీసులు రంగప్రవేశం చేయడంతో రూ.51వేలను ఖాతాలో పదిలంగా ఉంచుకున్నాడు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టాభి

3, 4, 5 తేదీల్లో ట్రేడ్ ఎక్స్‌పో

ధర్నాచౌక్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు జనవరి 3, 4, 5 తేదీల్లో నగరంలోని వెన్యూ కన్వెన్షన్‌లో స్మైలీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ట్రేడ్ ఎక్స్‌పో-2025ను నిర్వహిస్తున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తెలిపారు. ఎక్స్‌పో బ్రోచర్‌ను గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిల్డింగ్ వర్కర్స్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గద్దం రవికుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పట్టాభి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన పాలసీలు తెచ్చి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు చేయూతనిస్తోందన్నారు. యువ పారిశ్రామికవేత్తలను కూటమి ప్రభుత్వం పోత్సహిస్తుందని, వారి ఎదుగుదలకు తోడ్పాటునందిస్తుందని డూండీ రాకేశ్, రఘురామరాజు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి హత్యపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం

» ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలి

» నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

ధర్నాచౌక్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం కడప జిల్లా రాయచోటిలో పాఠశాల గదిలోనే ఉపాధ్యాయుడిని విద్యార్థులు హత్య చేసిన ఘటనపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం శోచనీయమని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో ఇటువంటి విపరీత ధోరణులకు డ్రగ్స్, గంజాయి కారణమని, విద్యార్థుల మానసిక స్థితిపై తక్షణమే అధ్యయనం చేయాలని వారు పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టంలో సవరణలకు కమిటీ ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి పాఠశాలలకు అత్యంత సమీపంలోనే విక్రయిస్తున్నా ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. విద్యార్థుల్లో నేర ప్రవృత్తి, చెడు అలవాట్లు, డ్రగ్స్ లభ్యతపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు

కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సర్కిల్(1-3) ఇబ్రహీంపట్నం, మైలవరం, జికొండూరు మండలాలు, విజయవాడ అర్బన్‌లో చౌకధరల దుకాణాల డీలర్ల నియామకానికి ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు పంపాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య ఓ ప్రకటనలో సూచించారు. దరఖాస్తును నిర్దేశ నమూనా ఫాంలో ఆర్డీవో, విజయవాడకు రిజిస్టర్ పోస్టులో పంపాలని సూచించారు. దరఖాస్తు దాఖలు చేసిన తేదీ నాటికి 18 ఏళ్లకు పైబడి, 40 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణ అవసరమన్నారు. రాతపరీక్ష(80 మార్కులు), మౌఖిక పరీక్ష(20 మార్కులు) ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఖాళీల వివరాలు, కొత్తగా ఏర్పడిన చౌక దుకాణాలు, కేటగిరీల వారీగా ఖాళీలు తదితర పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో ఉన్నాయని వెల్లడించారు.



కేంద్ర సహాయ మంత్రి సురేష్‌గోపీకి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి అధికారులు, అర్చకులు

కనకదుర్గమ్మను దర్శించుకున్న సురేష్ గోపి

వన్‌టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయమర్యాదల అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలీసుశాఖకు వెన్నెముక హోంగార్డు వ్యవస్థ



పోలీసులకు పురస్కారాలు అందిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

గుణదల, డిసెంబరు 6(ఆన్‌లైన్): పోలీసుశాఖకు హోంగార్డు వ్యవస్థ వెన్నెముక వంటిదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకను మహాత్మాగాంధీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ విచ్చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 998 మంది హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు. కొవిడ్, వరదలు విపత్తుల సమయంలోనూ హోంగార్డులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. హోంగార్డు కమాండ్ టి.ఆనంద్‌బాబు, డీసీపీ కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు, హోంగార్డ్సు ఆర్ఐ సుధాకర్, డీసీపీలు గౌతమిషాలి, ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

మహా కుంభమేళా యాత్ర

» ఐఆర్‌సీటీసీ సరికొత్త టూర్ ప్యాకేజీ విడుదల

» జనవరి 19న ప్రారంభం

» వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌ల సందర్శన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మహాకుంభమేళాను పురస్కరించుకుని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) సరికొత్త టూర్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. కుంభమేళాను వీక్షించటంతో పాటు పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించుకునేలా 'మహా కుంభ్ పుణ్య క్షేత్ర యాత్ర - 2025 ' పేరుతో ఏడు రాత్రులు, 8 పగళ్లు సాగేలా టూర్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. వారణాసిలో కాశీ విశ్వనాథఆలయం, కాశీ విశాలక్షి, అన్నపూర్ణాదేవి ఆలయాల సందర్శనతో పాటు సాయంత్రం గంగా హారతిని వీక్షించాక అయోధ్య తీసుకెళతారు. సరయు నది దగ్గర ఉన్న రామజన్మభూమి ప్రాంతం, హనుమాన్ గర్హి, ఆరతిలను సందర్శిస్తారు. చివరిగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర జరిగే కుంభమేళా వీక్షణ, పవిత్ర స్నానాలు ఆచరించాక తిరుగు ప్రయాణం ఉంటుంది. యాత్ర ప్యాకేజీ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమవుతున్నా ప్రత్యేక రైలు విజయవాడ వస్తుంది. విజయవాడ నుంచి బుక్ చేసుకున్న వాళ్లంతా ఇక్కడి నుంచే బయలుదేరవచ్చు. ప్రత్యేక రైలు జనవరి 19న విజయవాడ వస్తుంది. యాత్ర జనవరి 25 వరకు కొనసాగుతుంది.

టూర్ ప్యాకేజీ టారిఫ్

టూర్ ప్యాకేజీ ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ కేటగిరీలుగా ఉంటుంది. ఎకానమీలో స్లీపర్ క్లాస్ ఉంటుంది. పెద్దలకు రూ.22,635, పిల్లలకు రూ.21,740. నాన్ ఏసీ రూములు, నాన్ ఏసీ వాహన సదుపాయం ఉంటుంది. స్టాండర్డ్ కేటగిరీలో 3 ఏసీ, పెద్దలకు రూ. 31,145, పిల్లలకు రూ. 30,095. ఏసీ రూములు, నాన్ ఏసీ వాహన సదుపాయం ఉంటుంది. కంఫర్ట్ క్యాటగిరీలో 2 ఏసీ, రూ.38,195, పిల్లలకు రూ.36,935. ఏసీ రూములు, ఏసీ వాహన సదుపాయం కల్పిస్తారు.

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. సహాయం చేయటానికి మా మేనేజర్లు ఉంటారు. ప్రయాణ బీమా, ఎస్కార్ట్ సేవలు అదనం. యాత్రికులకు ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాలు పూర్తి శాఖాహారం అందిస్తాం. 92814 95860, 92814 95848, 89773 14121కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. **- ఎం రాజా, మేనేజర్, ఐఆర్‌సీటీసీ**

సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి

చర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లలో సహచరులను కోల్పోతూ తీవ్ర ఆగ్రహంతో ఉన్న మావోయిస్టులు.. ప్రతి చర్యగా శుక్రవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ పామేడు సమీపంలోని జీడిపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ నాయకుడు మాద్వి హిడ్మా ఆధ్వర్యంలో జరిగినట్లుగా భావిస్తున్న ఈ దాడి దాదాపు ఆరు గంటల పాటు సాగింది. వందల మంది మావోయిస్టులు పాల్గొన్నట్లుగా తెలుస్తోంది. జీడిపల్లి గ్రామంలో సీఆర్‌పీఎఫ్-228కి చెందిన రెండు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. మొదటిది పూర్తయింది. నిర్మాణంలో ఉన్న రెండో క్యాంప్‌పై గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. లేజర్ గైడెడ్ బాంబులైన బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లను (బీజీఎల్స్) వినియోగించారు. దీంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. వీరి పరిస్థితి నిలకడగా ఉంది. ప్రతిగా బలగాలు ప్యారా బాంబులు వేశాయి. కాగా, కాల్పుల సమయంలో బీజాపూర్ జిల్లా కీలక పోలీస్ అధికారులు క్యాంపుల్లోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు క్యాంప్ నిర్మాణంలో పనిచేస్తున్న కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, సమీప గ్రామస్థులు భయాందోళన చెందారు. సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లను మావోయిస్టులు వ్యతిరేకిస్తున్నారని, పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలోనే దాడికి పాల్పడ్డారని బలగాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి 16న పామేడు సమీపంలోని ధర్మారం క్యాంప్‌పై వందలమంది దాడికి దిగారు. శుక్రవారం దాడి జరిగిన ప్రదేశం.. జీడిపల్లి క్యాంప్‌నకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. తెలంగాణ సరిహద్దులోని చర్ల మండలానికి ఇవి 8 నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కాగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఏ క్షణాన్నైనా పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర దాడులు జరిగే ప్రమాదం కనిపిస్తోంది.

నాలెడ్జ్ హబ్‌గా ఆంధ్ర

> స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. దీనికి పది ప్రణాళికా సూత్రాలు తయారు చేసుకున్నాం.
>
> ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరి కంటే ఎక్కువ తెలుగువారే ఉన్నారు. ఐటీ నిపుణుల్లో 30 శాతం ఆంధ్రకు చెందిన వారే.
>
> జనాభా నిర్వహణ గురించి చర్చించుకోవలసిన సమయం వచ్చింది. అధిక మానవ వనరులు ఉంటే.. దేశం సేవల కేంద్రంగా వర్ధిల్లుతుంది.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

- దాని కేంద్రం విశాఖే: చంద్రబాబు
- రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు
- స్టార్టప్స్‌కు అనుగుణంగా పాలసీలు
- రాష్ట్రం ఐదు జోన్లుగా విభజన
- ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటు.. 15% వృద్ధి రేటే ధ్యేయం
- డీప్ టెక్నాలజీ సదస్సులో సీఎం వెల్లడి
- 3 నెలలకోసారి 'డీప్' ప్రదర్శనలు



విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చేసుకున్న ఒప్పంద పత్రాలు చూపుతున్న కంపెనీల ప్రతినిధులు. చిత్రంలో 'గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్' డైరెక్టర్ సి.కుటుంబరావు తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీని నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని, విశాఖపట్నం దానికి కేంద్రంగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేసే ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించడంతోపాటు వారికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. శుక్రవారం 'డీప్ టెక్నాలజీపై విశాఖలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కొత్త ఆలోచనల(ఇన్నోవేషన్)ను అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. విభిన్న సమస్యలకు పరిష్కారాలను చూపించే స్టార్టప్స్‌కు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ తరహా ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రాన్ని ఐదు జోన్లు గా విభజించి ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పా టు చేస్తున్నామన్నారు. వాటిని అమరావతిలోని సెంట్రల్ హబ్ గైడ్ పర్యవేక్షిస్తుందన్నారు. దీనికి టాటా ఇన్నోవేషన్ హబ్ గా పేరు పెట్టినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామికవేత్త రావాలన్న తమ నినాదాన్ని నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇందుకు వ్యవస్థను ఏర్పాటుచేసే ఉద్దేశంతోనే ఇన్నోవేషన్ హబ్ ఎకో సిస్టమ్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆయా హబ్‌లు స్థానికంగా ఉండే పరిశ్రమలు, విద్యాసంస్థల తో కలిసి నడిచేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రం నుంచే కాకుండా దేశ, విదేశాలకు చెందిన ఇన్నోవేటర్స్ ను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఖర్చు తక్కువగా ఉండి, ఎక్కువ మంది వినియోగించేలా ఆవిష్కరణలు ఉండాలన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో రాష్ట్రాన్ని నంబర్‌వన్ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రసంగంలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

పీ-4తో ముందుకు..: హైదరాబాద్‌లో 1996లో పీపీపీ విధానంలో హైటెక్ సిటీని అభివృద్ధి చేశాం. ఇప్పుడు ప్రజల భాగస్వామ్యం కూడా కలిపి 'పీ-4' విధానంతో మరింత ముందుకు వెళ్లేందు కు ప్రయత్నిస్తున్నాం. ప్రతి 3 నెలలకొకసారి డీప్ టెక్నాలజీ ప్రదర్శనలు నిర్వహిస్తాం. మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్.. అన్నీ డీప్ టెక్నాలజీ కిందికే వస్తాయి. డ్రోన్ల సాయం తో పురుగుల మందును పిచికారీ చేస్తు న్నాం. అవసరమైన మందులను కూడా డ్రోన్ల ద్వారా వేగంగా పంపగలుగుతున్నాం. క్లీన్, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నాం. విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులో రూ2 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి.



విశాఖలోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రతి కుటుంబానికీ లబ్ధి..

ప్రజలకు సంబంధించిన పూర్తి సమాచారం రాష్ట్రప్రభుత్వం వద్ద ఉంది. ఏ సమస్య వచ్చినా సాంకేతిక సాయంతో తక్షణ నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. అన్ని సేవలను పొందేలా సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతి కుటుంబానికీ లబ్ధి కలిగేలా కార్యక్రమాలను అమలు చేస్తాం. పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించడమే లక్ష్యంగా పథకాల ను రూపొందిస్తాం. అక్షరాస్యతను పెంచడంపై దృష్టి సారిం చాం. స్పీచ్ అండ్ హియరింగ్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. భవిష్యత్‌లో ఆటిజం వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుంది.

సదస్సులో ఏడు ఒప్పందాలు..

డీప్ టెక్నాలజీ సదస్సులో పలువురు ప్రతినిధులు, ఇన్నోవేటర్స్, వైద్యులు మాట్లాడారు. తమ అభిప్రాయాల ను, ఆలోచనలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్‌టీ)తో వివిధ సంస్థ లు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. విద్య, వైద్య రంగాల్లో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ స్టడీస్, మహిళా సాధికారిత, తదితర అంశాలపై సమగ్ర, జీఎస్ఆర్, ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్, జర్మన్ వర్సిటీలు ఒప్పందాలు చేసుకోగా.. మరో గేమింగ్ కంపెనీ 2 ఎంవోయూలు చేసుకుంది. సీఎంఎస్ కంపెనీతో ప్రభుత్వం ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. సదస్సుకు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్ఎస్‌టీ వైస్‌చైర్మన్ ఎస్పీ టక్కర్ అధ్యక్షత వహించగా.. మంత్రులు అనిత, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, గణబాబు, ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, యువరాజ్, జీఎఫ్ఎస్‌టీ డైరెక్టర్ చదలవాడ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. అధునాతన టెక్నాలజీలపై మక్కువ చూపే చంద్రబాబు జీఎఫ్ఎస్‌టీ సంస్థను 2020లో ఏర్పాటు చేశారు. ఆయనే దానికి చైర్మన్‌గా ఉన్నారు.

'కంటెయినర్‌లో డ్రగ్స్'

కథ కంచికి!?

- డ్రై ఈస్ట్‌లో 'మత్తు' లేదని ల్యాబ్ నివేదిక?
- కిట్‌తో పరీక్షించినపుడు పాజిటివ్...
- ప్రయోగశాల పరీక్షలో నెగెటివ్
- కంటెయినర్ విడుదల చేయాలని సీబీఐ లేఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'విశాఖపట్నం కంటెయినర్ డ్రగ్స్' కథ కంచికి చేరింది. ఈ ఏడాది మార్చి 19న బ్రెజిల్ నుంచి విశాఖపట్నం వచ్చిన ఒక కంటెయినర్‌లో డ్రై ఈస్ట్‌తో పాటు డ్రగ్స్ కొకైన్) ఉన్నాయని సీబీఐ ప్రాథమికంగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. విచారణ పూర్తయ్యేంత వరకు కంటెయినర్‌ను తీసుకువెళ్లకూడదంటూ అక్కడే ఉంచారు. కంటెయినర్ నుంచి సేకరించిన డ్రై ఈస్ట్ నమూనాలను సెంట్రల్ నార్కోటిక్ డ్రగ్స్ లేబొరేటరీకి పంపించారు. అయితే అందులో ఎటువంటి మత్తు పదార్థాలు(డ్రగ్స్) లేవని నివేదిక వచ్చినట్టు సమాచారం. అదే వివరాలను విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో సమర్పించి, కేసును మూసేయాలని సీబీఐ అధికారులు కోరారు. దానికి న్యాయస్థానం ఆమోదం తెలపడంతో ఆ కంటెయినర్‌ను సంబంధిత సంస్థకు ఇచ్చేయాలని కస్టమ్స్ అధికారులకు 10 రోజుల క్రితం లేఖ రాశారు. ఇదే విషయాన్ని కస్టమ్స్ అధికారులు కంటెయినర్ యజమాని అయిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు తెలియజేయగా వారు ఇంతవరకూ స్పందించలేదు. 'మేం తెప్పించుకున్న సరకును 9 నెలలు ఉంచేసుకున్నారు. అది ఇప్పుడు వాడడానికి పనికి రాదు. తీసుకొని ఏమి చేయాలి?' అని వారు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

ఆ రోజు ఏమి జరిగిందంటే..?: అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్‌ను బ్రెజిల్ నుంచి విశాఖపట్నానికి రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు మార్చి 18న ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులు ఆగమేఘాలపై వచ్చి విచారణ ప్రారంభించారు. విశాఖకు చెందిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ రొయ్యల మేతగా ఉపయోగించే 'డ్రై ఈస్ట్'ను బ్రెజిల్ నుంచి కంటెయినర్(ఎస్ఈకేయు4375380) ద్వారా తెప్పించుకోగా అందులో డ్రగ్స్ ఉన్నాయని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. ఆ కంపెనీ యాజమాన్యం ముందే కంటెయినర్ తెరిచారు. 25 కిలోల బరువున్న వేయి సంచులతో డ్రై ఈస్ట్ రాగా, దాదాపుగా అన్ని సంచులను పరిశీలించి నమూనాలు తీసుకున్నారు. వెంట తెచ్చుకొన్న కిట్‌తో డ్రగ్స్ కలిశాయా? లేదా? అని పరిశీలించారు. ప్రాథమిక పరీక్షలో కొకైన్ ఉన్నట్టు తేలడంతో కంటెయినర్‌ని సీజ్ చేశారు. ఆ తరువాత సంస్థ ప్రతినిధుల కాల్ డేటా సేకరించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే ఇదే సంస్థకు చెందిన అకౌంటింగ్ పుస్తకాలతో ఒక వ్యాన్ తూర్పు గోదావరి జిల్లాలో పోలీసులకు పట్టుబడింది. సంధ్యా ఆక్వాలో ఏదో జరుగుతోందని అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజాగా డ్రై ఈస్ట్‌లో డ్రగ్స్ లేవని తేల్చారు.

ఆస్పత్రి లిఫ్ట్ కూలి

బాలింత మృతి

లఖ్‌నవూ, డిసెంబరు 6: నవ మాసాలు మోసి కన్న బిడ్డను ఒడిలోకి తీసుకోక ముందే ఆ తల్లి మృత్యు ఒడికి చేరింది. ఈ విషాదకర ఘటన ఉత్తరప్రదేశ్ మేరఠ్‌లోని క్యాపిటల్ ఆస్పత్రిలో శుక్రవారం జరిగింది. మేరఠ్‌కు చెందిన కరిష్మా శుక్రవారం క్యాపిటల్ ఆస్పత్రిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత కరిష్మాను ఇద్దరు ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ ద్వారా గ్రౌండ్‌లో ఫ్లోర్‌లోని వార్డుకు తరలిస్తుండగా లిఫ్ట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో కరిష్మా మృతి చెందగా.. ఇద్దరు ఆస్పత్రికి సిబ్బంది గాయాలపాలయ్యారు.

రేషన్ లూటీపై సిట్

- సీఐడీ ఐజీ బ్రిజ్‌లాల్ నేతృత్వం
- ఇందులో సీఐడీ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు
- దర్యాప్తుపై 15 రోజులకోసారి నివేదిక
- కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం మాఫియా గుట్టు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సీఐడీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసింది. కాకినాడ పోర్టు కేంద్రంగా జరిగిన ఎగుమతులపై నమోదైన 13 కేసుల్లో నిందితులు, సూత్రధారులు ఎవరో తేల్చాలని ఆదేశించింది. ప్రతి 15 రోజులకు ఒకసారి దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇవ్వాలని సూచించింది. సిట్‌లో సీఐడీ ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీలు అశోక్‌వర్ధన్‌రెడ్డి, బాలసుందరరావు, గోవిందరావు, రత్తయ్యలను నియమించారు. శుక్రవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మిల్లర్లు, ఎగుమతిదారులు, నాయకులతో వ్యవస్థీకృత నేరంగా తయారైన ఈ చైన్ లింకు నెట్‌వర్క్‌ను పూర్తిగా తెగ్గొట్టాలని ఆదేశాలు జారీ చేశారు. లక్షలాది రేషన్ కార్డుల బియ్యం పక్కదారి పట్టిన వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. 'సిట్'కు ప్రత్యేక అధికారాలు కల్పించింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023 కింద కేసులు విచారించి, గోదాములు, అనుమానం ఉన్న చోట్ల తనిఖీలు చేసేందుకు అనుమతిచ్చింది. అలాగే అక్రమ ఎగుమతిదారుల ఆస్తులను జప్తు చేసి, బాధ్యులను అరెస్టు చేయడానికి పూర్తి అధికారాలు ఇచ్చింది. రేషన్ బియ్యానికి పాలిష్ పెట్టి ఎగుమతులు చేస్తున్న వారిని ఉపేక్షించొద్దని స్పష్టం చేసింది.

వేలకోట్లు దోపిడీ

గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని పెద్దఎత్తున విదేశాలకు అక్రమ రవాణా చేసి వేలకోట్లు సొమ్ము చేసుకున్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టుకు వెళ్లి నౌకను సీజ్ చేయాలని ఆదేశించడంతో రేషన్ మాఫియా అంశం చర్చనీయాంశమైంది. విజిలెన్స్ సమాచారం తెప్పించుకున్న సీఎం ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించారు. సీఐడీ విచారణ కు ఆదేశించాలని భావించినా, ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తే తొందరగా కొలిక్కి వస్తుందని ఈ నిర్ణయం తీసుకున్నారు. సమర్థుడైన అధికారిగా పేరున్న ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. కాగా, బియ్యం అక్రమ ఎగుమతులపై నిగ్గు తేల్చాలంటే సీఐడీ, పోలీసులతోపాటు సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు కూడా సిట్ బృందంలో ఉంటే బాగుండేదన్న అభిప్రాయా లు వినిపిస్తున్నాయి. అలాగే సిట్‌లో డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి పేరు చేర్చడంపై భిన్నాభిప్రా యం వ్యక్తమవుతోంది. ఒంగోలు, దర్శి డీఎస్పీ గా పనిచేసిన సమయంలో ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. వైవీ సుబ్బారెడ్డి అండతో ఒంగోలు డీఎస్పీగా ఆయన పోస్టింగ్ దక్కించుకున్నారని అప్పట్లో మంత్రిగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి అభ్యంతరం చెప్పడంతో వివాదం రేగింది. అశోక్‌వర్ధన్ రెడ్డికి దర్శి డీఎస్పీగా సుబ్బారెడ్డి పోస్టింగ్ ఇప్పించినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు బియ్యం అక్రమ ఎగుమతుల వ్యవహారంపై ఏర్పాటు చేసిన సిట్‌లో అశోక్‌వర్ధన్ రెడ్డి ఉండడంపై అభ్యంతరాలు వస్తున్నాయి.

బ్రదర్స్ బొక్కేశారు!

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ 13 కేసులపై ప్రత్యేకంగా దర్యాప్తు చేసి డొంక లాగాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ 13 కేసుల్లో పట్టుబడ్డ బియ్యం ఏకంగా 22,947 టన్నులు. దీని విలువ ఏకంగా రూ.84.87కోట్లు. రేషన్ బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయిన ఈ కేసుల్లో కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరులకు చెందిన కంపెనీలు ఉన్నాయి. మరోపక్క ద్వారంపూడి సోదరుడు, ఆయన ప్రధాన అనుచరుడి కంపెనీలు వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఊహకు అందని విధంగా ఏకంగా 13.41 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు తరలించాయి. ఈ బియ్యం విలువ రూ.4,995కోట్లు.

అన్ని దారులూ కాకినాడకే!

రేషన్ బియ్యాన్ని తరలించేందుకు వైసీపీ అక్రమార్కులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. రేషన్ బియ్యం కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించేవారు. ప్రధానంగా ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు రేషన్ వ్యవస్థను కుళ్ల బొడిచేశారు. ద్వారంపూడి కుటుంబం కారణంగానే రేషన్ బియ్యం స్మగ్లింగ్ కాకినాడలో చెలరేగింది. ఈ స్మగ్లింగ్ పై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. నిందితులను అవసరమైతే తక్షణం అరెస్ట్ చేసే అధికారం కల్పించింది. కాకినాడ, చుట్టుపక్క మొత్తం 5 పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపైనా సిట్ దృష్టి సారించనుంది.

తెలంగాణ నుంచీ...

మణికంఠ ఇండస్ట్రీస్ పేరుతో తెలంగాణలోని సిద్దిపేట నుంచి గత నెల 27న వచ్చిన 35 మెట్రిక్ టన్నులను కరప పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. తాళ్లరేవు స్టేషన్ పరిధిలో జూలై 17న కరీంనగర్ జిల్లా నుంచి తరలుతున్న 30టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శ్రీనివాస గౌడ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జూన్ 28న రూ.13.96కోట్ల విలువైన 4,531 టన్నుల బ్రోకెన్, రారైస్(రేషన్ బియ్యం) పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించి, కొటారి అమిత్‌కుమార్‌ని నిందితుడిగా తేల్చారు. ఇదే కంపెనీ ఇటీవల పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా, బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు తేల్చారు.

కొవిడ్‌లో చెలరేగారు...

గడచిన అయిదేళ్లలో కొన్నిలక్షల టన్నుల బియ్యం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవగా, వాటిలో అత్యధికంగా ద్వారంపూడి సోదరుడైన ద్వారంపూడి వీరభద్రారెడ్డి తరలించేశారు. ఈయనకు చెందిన మానస కంపెనీ బియ్యం ఎగుమతులను రెట్టింపు చేసింది. గత ఐదేళ్లలో ద్వారంపూడి సోదరుడు కాకినాడపోర్టు నుంచి రూ.2,250కోట్ల విలువైన 6,01,290 టన్నుల బియ్యం ఎగుమతి చేశారు. కొవిడ్ సమయంలో విదేశాలకు తరలించేశారు. 2020-21లో 1,10,300 టన్నులు, 2021-22లో 1,44,400 టన్నులు, 2022-23లో 2,00,890 టన్నులు, 2023-2024లో 82,400 టన్నులు, 2024-25లో ఇప్పటివరకు 28,400 టన్నులు విదేశాలకు తరలించారు. ఇందులో సగానికిపైగా రేషన్ బియ్యమేనని అంచనా!

కేసుల కథాకమామీషు!

- 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

సిట్ దృష్టి సారించనున్న 13 కేసులపై 'ఆంధ్రజ్యోతి' పూర్తిస్థాయిలో పరిశీలన జరిపింది. తెలంగాణ నుంచీ కాకికాడ పోర్టుకు భారీగా అక్రమ బియ్యం తరలిరావడం గమనార్హం. వివరాలిలా..

- జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.15.31కోట్ల విలువైన 3,723 టన్నుల రేషన్, బాయిల్డ్ బియ్యం పట్టుబడింది. ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫు డ్స్ కంపెనీ వీటిని తరలించింది. దీని పై కేసు నమోదు చేసి, శ్రీనివాస్ అగర్వాల్‌ను నిందితుడిగా చేర్చారు.
- జూన్ 30న కాకినాడ రూరల్ ఇంద్రపాలెం పోలీసులు శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీ 1,406టన్నుల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. సత్తిసూర్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి రూ.3.83కోట్ల బియ్యంగా తేల్చారు.
- కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జూన్‌లో 7 కేసుల్లో 14,648 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులోను ద్వారంపూడి అనుచరులే ఉన్నారు.
- కాకినాడ రూరల్ పరిధిలో జూలై 11న అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా 2 కేసులు నమోదయ్యాయి. వీటిలో 373 ఎఫ్ఐఆర్ కింద రూ.26కోట్ల విలువైన 9,280 టన్నుల బియ్యం పట్టుబడింది. మెరైన్ లాజిస్టిక్ కంపెనీవిగా గుర్తించారు. ఎఫ్ఐఆర్ 374 కింద 138 టన్నుల బియ్యం సీజ్ చేశారు. నిందితులుగా యర్రా రామ భీమ సుబ్రహ్మణ్యం, గుబ్బల సూర్యనారాయణలను గుర్తించారు.

విక్రాంత్‌రెడ్డిపై కేసు వివరాలివ్వండి

» సీఐడీ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ వాటాల బదిలీ వ్యవహారంలో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిపై నమోదు చేసిన కేసు పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని హైకోర్టు సీఐడీ పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విక్రాంత్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను బెదిరించి, భయపెట్టి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ లోని వాటాలను బలవంతంగా అరబిందోకు బదలాయించుకున్నారని కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీఆర్ గ్రూపునకు చెందిన కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 2న మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాలని, లేదంటే అది నిరర్థకమవుతుందన్నారు. ఈ అభ్యర్థనను న్యాయమూర్తి సున్నితంగా తోసిపుచ్చారు.

గంజాయి కేసుల్లో ఇదేం తీరు?

» సహనిందితుల వాంగ్మూలాల ఆధారంగా అరెస్టులు...దర్యాప్తులో పురోగతి ఉండదు

» బెయిల్ నిరాకరించాలని ఎలా కోరతారు?

» పోలీసుల పనితీరుపై హైకోర్టు అసంతృప్తి

» పిటిషనర్‌కు బెయిల్ మంజూరు

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ (గంజాయి) కేసుల్లో రాష్ట్రంలోని పోలీసుల పనితీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వ్యక్తులను అరెస్ట్ చేస్తున్నారని, నెలలు గడుస్తున్నా ఎలాంటి ఆధారాలు సేకరించకుండా బెయిల్ నిరాకరించాలని కోరడం ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. శుక్రవారం ఓ ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.విశాఖపట్నం, నక్కపల్లి మండలం, ఒడ్డిమిట్ట వద్ద లారీలో తరలిస్తున్న 530 కేజీల గంజాయిని 2022 జూన్ 11న పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరికొందరిని సహనిందితులుగా చేర్చారు. ఈ కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న నడిగట్ల హనుమంతురావును ఈ ఏడాది ఆగస్టులో పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్....ప్రస్తుత కేసులో గంజాయి రవాణా చేస్తుండగా అరెస్ట్ అయిన లారీ డ్రైవర్ వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌ను అరెస్ట్ చేశారని, నాలుగు నెలలు గడుస్తున్నా అతనికి వ్యతిరేకంగా ఒక్క ఆధారం సేకరించలేదన్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

పోటెత్తిన భూ బాధితులు

» రెవెన్యూ సదస్సులకు భారీ స్పందన

» 536 మండలాల్లో ప్రారంభం

» పాల్గొన్న రెవెన్యూ మంత్రి అనగాని, స్పెషల్ సీఎస్, సీసీఎల్ఏ



శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తుల రక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రెవెన్యూ సదస్సులకు భూ బాధితులు పోటెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సులకు జగన్ జమానాలో భూములు, విలువైన ఆస్తులు కోల్పోయిన బాధితులు, రైతులు, ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. రెవెన్యూ యంత్రాంగం ఊహించిన దాని కంటే రెట్టింపు స్పందన వచ్చింది. రెవెన్యూ సదస్సుకు ఆ గ్రామానికి సమీపంలోని గ్రామాల ప్రజలు కూడా పెద్దఎత్తున తరలివచ్చారు. సదస్సు తీరును పరిశీలించారు. అనేక గ్రామాల్లో సదస్సుల కోసం చేసిన ఏర్పాట్లు కూడా సరిపోలేదు. దీంతో శనివారం జరిగే సదస్సుల్లో అదనపు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌లను ఆదేశించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆరు జిల్లాల పరిధిలో సదస్సులు జరగలేదు. మిగిలిన 20 జిల్లాల పరిధిలో 536 మండలాల్లోని 645 గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో అధికారిక లెక్కల ప్రకారం తొలి రోజే ప్రజల నుంచి 11,857 వినతులు, ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 152 భూ సమస్యలను అధికార యంత్రాంగం అక్కడికక్కడే పరిష్కరించింది. మిగిలిన వినతులను షెడ్యూల్ ప్రకారం త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ పేర్కొంది. చిత్తూరు జిల్లాలో 31 గ్రామాల్లో 1,087, తిరుపతి జిల్లాలో 45 గ్రామాల్లో 1,184, అన్నమయ్య జిల్లాలో 33 గ్రామాల్లో 1,331, పార్వతీపురం మన్యంలో 43 గ్రామాల్లో 7,094, ప్రకాశం జిల్లాలో 45 గ్రామాల్లో 797 వినతులు ప్రభుత్వానికి అందాయి.

రేపల్లె మండలంలో రెవెన్యూ మంత్రి

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ రేపల్లె మండలం పేటేరు గ్రామంలో జరిగిన సదస్సులో పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలో జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఈ గ్రామంలోనే వైసీపీ హయాంలో భూముల రీసర్వేను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. అప్పట్లో తలెత్తిన సమస్యలను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు రైతులు, బాధితులు భారీగా తరలివచ్చి స్పెషల్ సీఎస్‌కు అర్జీలు అందించారు. ఈ గ్రామంలో ఓ సర్వే నంబర్ మొత్తాన్ని తీసుకెళ్లి దేవదాయశాఖ భూముల్లో కలిపారు. ఆ భూములను నిషేధ భూముల జాబితాలో చేర్చారు. ఈ సమస్యపై బాధితులు సిసోడియాకు వినతి పత్రం ఇచ్చి.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. "ఆ సర్వే నంబర్‌లోని భూములను తిరిగి రీసర్వే అయినా చేయాలి. లేదంటే రెవెన్యూ రికార్డులను సవరించాలి. ఇది అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయం కాదు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆ సమస్యను పరిష్కరిస్తాం" అని పేర్కొన్నారు. ఇక ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలో జరిగిన సదస్సులో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలో అదనపు సీసీఎల్ఏ, సర్వే ఇన్‌చార్జి కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందిస్తోన్న ఫిర్యాదులను మండలాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌లో భాగంగా వాటిని అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ డేటాను ఆర్టీజీఎస్‌కు అనుసంధానించనున్నారు. ప్రజల వినతులను ఆర్టీజీఎస్ ద్వారా నేరుగా సీఎం పరిశీలించే వీలుంది. సభలు ముగిసిన తర్వాత 45 రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ చెబుతోంది. కాగా, రెవెన్యూ సదస్సులకు ఊహించని స్పందన వచ్చిందని మంత్రి అనగాని'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "వైసీపీ హయాంలో రీసర్వే అనంతరం భూవివాదాలు తీవ్రంగా తలెత్తాయి. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నవారిని ఐదేళ్లపాటు భూముల్లోకి వెళ్లనివ్వకుండా, జీవనోపాధిని దెబ్బతీసిన ఉదంతాలు మా దృష్టికి వచ్చాయి. ప్రతి సమస్యను పరిష్కరిస్తాం." అని తెలిపారు.

సీఎంవో ఆదేశాలతోనే 'సాక్షి'కి సంతర్పణ!

» గత జూన్‌లో హైకోర్టులో అఫిడవిట్ వేసిన అప్పటి సమాచార కమిషనర్ విజయకుమార్‌రెడ్డి

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్రికలకు ప్రకటనల జారీ విషయంలో గత జగన్ ప్రభుత్వం అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి తన రోత పత్రిక 'సాక్షి'కి రూ.వందల కోట్లు దోచిపెట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఆదేశాలతోనే ఇలా ప్రజాధనాన్ని సంతర్పణ చేసినట్లు ఆయన హయాంలో పనిచేసిన సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి హైకోర్టుకు నివేదించడం గమనార్హం. 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ప్రభుత్వ ప్రకటనల జారీకి సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం కొన్ని మీడియా సంస్థలకు మేలు చేకూర్చేలా ఉండకూడదని స్పష్టంగా చెప్పింది. సర్క్యులేషన్‌ను ప్రాతిపదికగా తీసుకుని ప్రకటనల జారీలో అన్ని పత్రికలకూ సమాన అవకాశాలు ఇవ్వాలని చెప్పింది. ఈ నిబంధనలకు తూట్లుపొడిచి.. నచ్చినవారికి ఇష్టారీతిన ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసిన విజయ్‌కుమార్‌రెడ్డి.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వక్రభాష్యం చెబుతూ రాష్ట్ర హైకోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. అడ్డగోలుగా జగన్ పత్రికకు ప్రకటనల టారిఫ్ పెంచేసి.. వందల కోట్లు చెల్లించేసి.. ప్రకటనల జారీ విషయంలో చట్టనిబంధనల మేరకే వ్యవహరించామని ఒకవైపు చెబుతూనే.. మరోవైపు సీఎంవో ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్నామని ఈ ఏడాది జూన్‌లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సీఎంవో ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న మెదటి రెండు పత్రికలకు మాత్రమే ఎంప్యానెల్డ్ రేటుతో ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చామని తెలిపారు. సర్క్యులేషన్‌లో మొదటి స్థానంలో ఉన్న పత్రికకు మించి అడ్డగోలుగా రోతపత్రికకు ఎన్నో వందల కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించిన సమాచారం ప్రకారం.. సమాచార శాఖ ద్వారా జగన్ పత్రికకు విడుదల చేసిన ప్రకటనల విలువ రూ.371.12 కోట్లు. అయితే జిల్లా స్థాయిలో ఆ పత్రికకు ఎంత విలువైన ప్రకటనలు ఇచ్చారో చెప్పలేదు. కాగా, ప్రభుత్వ విధానాల్లో లోటుపాట్లు ఎత్తిచూపిన పత్రికలను పక్కన పెట్టి.. సంప్రదింపుల ప్రక్రియ పేరుతో నచ్చిన పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను కప్పిపుచ్చుకొనేందుకు, సంప్రదింపుల ప్రక్రియ ద్వారా ప్రకటనలు జారీ చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు వందల కోట్లు ఆదా చేశామంటూ హైకోర్టును తప్పుదోవ పట్టించడానికి విజయకుమార్‌రెడ్డి ప్రయత్నించారు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం 2019 నుంచి ప్రకటనలు ఇస్తూ వచ్చిందని.. రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుచేసిందని బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీం నోటీసులు

» బెయిల్ రద్దు చేయాలన్న సునీత

» పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం

» ప్రతివాదులందరికీ నోటీసులు జారీ



న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తండ్రి, వైఎస్ భాస్కర్‌రెడ్డికి సుప్రీం కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. భాస్కర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీతా రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన కేసులో ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొంది. శుక్రవారం సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వివేకా హత్య కేసుకు సంబంధించి కీలక పరిణామాల తర్వాత ఈ ఏడాది ఏప్రిల్‌లో భాస్కర్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేసింది. భాస్కర్ రెడ్డికి ఇటీవల బెయిల్ మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 25న హైకోర్టు తీర్పును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. భాస్కర్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీతా రెడ్డి కూడా గత నెల 5న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై గత నెల 29న విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వైఎస్ భాస్కర్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అదేరోజు సునీత తరఫు న్యాయవాదులు కలుగజేసుకుని ఈ కేసులో ఇతర నిందితులకు సంబంధించిన బెయిల్ రద్దు పిటిషన్లు దాఖలయ్యాయని వివరించారు. వాటితో భాస్కర్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ కూడా జత చేయాలని కోరారు. ఇందుకు భారత ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారు. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి ఈ పిటిషన్లు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. గతంలో సీబీఐ కేసులో భాస్కర్‌రెడ్డికి నోటీసులు జారీచేసిన సుప్రీంకోర్టు... తాజాగా సునీత కేసులో ఆయనకు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేస్తున్నామని సీజేఐ పేర్కొన్నారు. తదుపరి విచారణను మార్చి మొదటి వారంలో చేపడతామని వెల్లడించారు.

గౌతంరెడ్డి సహకరించడం లేదు

» ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దు

» హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నివేదన

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత గౌతంరెడ్డి దర్యాప్తునకు సహకరించడంలేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు తెలియజేశారు. దర్యాప్తు అధికారి చెప్పిన సమయానికి విచారణకు హాజరుకావడంలేదని.. విచారణాధికారి లేని సమయంలో స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నారని వెల్లడించారు. ఆయన గండూరి ఉమామహేశ్వరశాస్త్రిని చంపేందుకు మనుషులను పురమాయించారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో గౌతంరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 11న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ప్రకటించారు. ఫోర్జరీ పత్రాలతో తన భూమిని ఆక్రమించడమే కాకుండా, తనను చంపేందుకు ప్రయత్నించారంటూ గౌతంరెడ్డిపై విజయవాడకు చెందిన గండూరి ఉమామహేశ్వరశాస్త్రి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేయడం, ముందస్తు బెయిల్ కోరుతూ గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శుక్రవారం వ్యాజ్యం విచారణకు రాగా గౌతంరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. హత్యకు ప్రణాళిక రచించాల్సిన అవసరం గౌతంరెడ్డికి లేదని.. దర్యాప్తునకు ఆయన సహకరిస్తున్నారని తెలిపారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటారని.. పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించేందుకు కూడా సిద్ధమని.. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ దశలో కేసు పూర్వాపరాల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. హత్యాయత్నంలో పిటిషనర్ ప్రమేయంపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయా లేదా అన్న అంశానికే పరిమితమైతే సరిపోతుందన్నారు. 11న నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.